సాహితి
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
హైదరాబాద్
: fb.com/vaartha Digital
Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
26-8-2026 బుధవారం సంపుటి: 32 సంచిక: 207 పేజీలు: 10+4 వెల: 6.50



రైతు నేత సారంపల్లికి అశ్రునివాళి 3
బీహార్ సిఎం ఇల్లు ముట్టడికి యత్నం 5



కులగణనలో 'ఓపెన్‌ఎండెడ్' వద్దు
ప్రధాని మోడీకి ఖర్గే, రాహుల్ సంయుక్త లేఖ 5





మహిళలకూ కమాండో శిక్షణ 5
ఎన్‌ఎస్‌జి కీలక నిర్ణయం





భారత్ ప్రజాస్వామ్యానికి బిఎల్‌ఓలే పునాది
కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ 5




# ఇక జలజలా 'మూసీ'

## భూసేకరణ వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశం

## ల్యాండ్ పూలింగ్‌పై స్పష్టమైన విధానం రూపొందించాలి

## ప్రాజెక్టుపై సమీక్షలో సిఎం రేవంత్

ఓంకారేశ్వర్ ఆలయానికి తక్షణమే టెండర్లు



మంగళవారం హైదరాబాద్‌లో మూసీపై సమీక్షలో సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు25:** మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు కోసం అవసరమైన భూసేకరణను వేగవంతం చేయాలని ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. భూసేకరణకు ల్యాండ్ పూలింగ్ విషయంలో స్పష్టమైన విధానం రూపొందించాలని చెప్పారు. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్‌పై మంగళవారం ముఖ్యమంత్రి ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షించారు. మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టు ఫేజ్-2కి వీలైనంత తొందరగా టెండర్లు పిలవాలని చెప్పారు. భూసేకరణ ప్రక్రియలో ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్, అసైన్డ్ భూముల సేకరణకు స్పష్టమైన విధివిధానాలు రూపొందించాలని అన్నారు. ఇందులో న్యాయపరమైన ఎలాంటి చిక్కులు రాకుండా జాగ్రత్తవహించాలని చెప్పారు. మూసీ రివర్‌ఫ్రంట్‌లో భాగంగా చేపట్టే ప్రాజెక్టులకు అతి తక్కువ వడ్డీకి రుణ సదుపాయాలపై మున్సిపల్ కమిషనర్లు దృష్టి సారించాలని, అలాగే టీడీఆర్‌లు జారీ చేసే విషయంలో కూడా ప్రతి వారం సమీక్షించాలని చెప్పారు. గండిపేట మంచిరేవుల సమీపంలోని ఓంకారేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి తక్షణంటెండర్లు పిలవాలని ఆదేశించారు. అలాగే, కొత్వాల్‌గూడ బర్డ్స్ పార్క్‌కు విస్తృత ప్రచారం కల్పించాలని చెప్పారు. ఈ సమావేశంలో సీఎం కార్యదర్శి మాణిక్‌రాజ్,హెచ్‌ఎండిఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్, మల్కాజ్‌గిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి, సైబరాబాద్ కమిషనర్ సృజన, రంగా రెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి,మేడ్చల్ కలెక్టర్ మను చౌదరి, ఎంఆర్‌డిసీఎల్ ఎండీ ఈ.వి.నరసింహారెడ్డి, ఎంఆర్‌డిసీఎల్ జేఎండీ గౌతమి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రాజెక్టులో భాగంగా మూసీలో చెత్త తొలగించి శుభ్రపరచడం, రివర్ బెడ్ ప్రొఫైలింగ్ చేయడం, వరద నియంత్రణ కోసం రిటైనింగ్ వాల్స్, నదికి రెండు వైపులా రోడ్లు, ప్రధాన మురుగు నీటి కాలువలు, నీటి నిల్వ కోసం

>>2

# చర్యలు తప్పవు!

## కొండా సురేఖ, చిన్నారెడ్డి తీరుపై పిసిసి చీఫ్‌కు నివేదిక ఇచ్చాం..

## కాంగ్రెస్ నాయకులు, శ్రేణులకు మెసేజ్ ఇచ్చేలా నివేదిక

**పార్టీ ఇన్‌ఛార్జి మీనాక్షికి నివేదిక అందజేత**

**ఇక హైకమాండ్ నిర్ణయమే తరువాయి: క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లురవి**



మంగళవారం హైదరాబాద్‌లో పిసిసి చీఫ్ మహేష్ గౌడ్‌కు నివేదిక అందజేస్తున్న క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి

**హైదరాబాద్,ఆగస్టు 25,ప్రభాతవార్త:** కాంగ్రెస్‌పార్టీ నాయకులకు శ్రేణులకు లక్ష్మణరేఖ గీత దాటకుండా ఒక మెసేజ్ ఇవ్వాలను కొంటున్నామని క్రమశిక్షణకమిటీ చైర్మన్ మల్లురవి అన్నారు. మంగళవారం టిపిసిసి అద్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌కు క్రమశిక్షణ కమిటీ నివేదికను అందజేశారు. మంత్రి కొండసురేఖ, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిలపై రూపొందించిన క్రమశిక్షణ సంఘం నివేదికను క్రమశిక్షణకమిటీ చైర్మన్ మల్లు రవి, వైస్‌చైర్మన్ శ్యామ్ మోహన్‌లు అందించారు. అనంతరం గాంధీభవన్‌లో విలేఖరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ కమిటీలో క్రమశిక్షణ ప్రధానమైనదనీ, క్రమశిక్షణ పైనే పార్టీ గౌరవం ఆధారపడి ఉంటుందనీ చెప్పారు. పార్టీపై గౌరవం ఉంటేనే మళ్ళీ పార్టీ అధికారంలోకి వస్తుందనీ అన్నారు.పార్టీపై నెగెటివ్ అభిప్రాయాన్ని కలిగించకుండా ఉండాలంటే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాల్సిందే అని అభిప్రాయపడ్డారు. టిపిసిసి చీఫ్ ను కలిసి మా నివేదిక ఇచ్చామనీ, కొండా సురేఖ, చిన్నారెడ్డిపై పూర్తి అంశాలను నివేదికలో ఇచ్చాం మీడియాలో వచ్చిన కథనాలను చూసి ఒక అంచనాకు వచ్చామనీ వివరించారు. గత విషయాలను కూడా పరిగణలోకి తీసుకున్నామనీ మా నివేదికను టిపిసిసి చీఫ్‌కి అందచేశామనీ వివరించారు. టిపిసిసి చీఫ్ ఆ నివేదికను ఇంచార్జీ మీనాక్షికి పంపారు ఎఐసిసిచీఫ్, ఎఐసిసి జనరల్ సెక్రెటరీకి కూడా నివేదిక పంపిస్తారు కాంగ్రెస్ హై కమాండ్ ఆదేశాల మేరకు చర్యలు ఉంటాయి ఈ నిర్ణయంతో నాయకులు, క్యాడర్‌కు ఒకమెసేజ్‌ఇవ్వాలని అనుకుంటున్నాం

>>2



# క్యూఆర్ పరిధిలో ఇందిరమ్మ టవర్స్

**15 నియోజకవర్గాల్లో టెండర్ ప్రక్రియ పూర్తి**

**28 నుంచి 31 దాకా పారదర్శకంగా లక్కీడ్రా**

## మరో 4 నియోజకవర్గాల్లో దరఖాస్తులకు ఆహ్వానం

## సెప్టెంబరు 3 వరకు దరఖాస్తుల స్వీకరణ: మంత్రి పొంగులేటి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు25:** హైదరాబాద్ మహానగరంలోని క్యూర్ పరిధిలో సొంతింటి కోసం ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్న నిరుపేద కుటుంబాల కలలను నిజం చేసే దిశగా ప్రభుత్వం మరో కీలక అడుగు ముందుకు వేసిందని పేదవాడికి కూడా నగరంలో సొంత ఇల్లు ఉండాలని, ఆత్మగౌరవంతో జీవించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ టవర్స్ నిర్మాణ కార్యక్రమాన్ని వేగవంతం చేశామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మంగళవారం సచివాలయంలో హౌసింగ్ శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణ పురోగతి, లబ్ధిదారుల ఎంపిక, లక్కీ డ్రా నిర్వహణ, కొత్త నియోజకవర్గాల్లో దరఖాస్తుల స్వీకరణ తదితర అంశాలపై సమగ్రంగా

>>2

# యేడాదిలో దేవాదుల రెడీ

## యుద్ధప్రాతిపదికన పనులకు ఆదేశాలు..

**భూ సేకరణ, ఆర్అండ్ఆర్‌కు నిధుల కొరత లేదు.. గోదావరి జలాలను గరిష్టంగా ఎత్తిపోసి 6 లక్షల ఎకరాలకు సాగునీరు**

## కలెక్టర్లు, చీఫ్ ఇంజినీర్లతో విసిలో మంత్రి ఉత్తమ్



మంగళవారం దేవాదుల సమీక్షలో మంత్రులు ఉత్తమ్, పొంగులేటి, సీతక్క

**హైదరాబాద్, ఆగస్టు 25 ప్రభాతవార్త:** దాదాపు రెండు దశాబ్దాలుగా పూర్తి స్థాయిలో ఫలాలు అందించలేకపోతున్న దేవాదుల ఎత్తిపోతల పథకాన్ని వచ్చే ఏడాదిలోగా పూర్తి చేయాలన్న దృఢ సంకల్పంతో తెలంగాణ ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు దేవాదుల ప్రాజెక్టును ఫాస్ట్‌ట్రాక్‌పై పెట్టి, దాని పూర్తికి అడ్డుగా నిలిచిన ప్రతి సమస్యను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించాలని నిర్ణయించినట్లు తెలిపారు.దేవాదుల ప్రాజెక్టుపై మంగళవారం జిల్లా కలెక్టర్లు, చీఫ్ ఇంజినీర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన విస్తృతస్థాయి సమీక్ష అనంతరం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు.. రెవెన్యూ, నీటిపారుదల శాఖలు, జిల్లా కలెక్టర్లు, ఇంజినీరింగ్ అధికారులు సమన్వయంతో పనిచేసి భూసేకరణ, ఆర్ అండ్‌ఆర్, ఇతర సమస్యల కారణంగా ప్రాజెక్టుల నిర్మాణంలో జాప్యం జరగకుండా చూడాలని ఆదేశించినట్లు చెప్పారు గోదావరి జలాలను ఎత్తిపోసి తెలంగాణలోని విశాలమైన ప్రాంతానికి సాగునీటి భరోసా కల్పించాలన్న మహత్తర లక్ష్యంతో రూపుదిద్దుకున్న దేవాదుల రాష్ట్ర సాగునీటి చరిత్రలో అత్యంత కీలకమైన ప్రాజెక్టుల్లో ఒకటని అన్నారు.దాదాపు రెండు దశాబ్దాల క్రితం చేపట్టిన ఇంతటి ప్రాధాన్యత కలిగిన ప్రాజెక్టు గత ప్రభుత్వాల నిరక్ష్యం కారణంగా ఇప్పటికీ అసంపూర్తిగా మిగిలిపోవడం దురదృష్టకరమన్నారు. ఇకపై జాప్యానికి తావులేకుండా, ప్రాజెక్టును అత్యంత ప్రాధాన్యతతో పూర్తి చేయాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని స్పష్టం చేశారు.సుమారు 38 టిఎంసిల గోదావరి జలాలను ఎత్తిపోసి, దాదాపు ఆరు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో దేవాదుల పథకం రూపుదిద్దుకుందని మంత్రి తెలిపారు. హనుమకొండ, వరంగల్, కరీంనగర్, జనగామ, యాదాద్రి-భువనగిరి, సూర్యాపేట, సిద్ధిపేట, మేడ్చల్-మల్కాజిగిరి, ములుగు, జయశంకర్ భూపాలపల్లి తదితర జిల్లాలకు ఈ ప్రాజెక్టు ప్రయోజనాలు విస్తరించనున్నాయని వివరించారు. భూసేకరణ, పునరావాసం-పునరావాస ప్యాకేజీ , అటవీ అనుమతులు, ఇతర పరిపాలనా సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు చెప్పారు. భూసేకరణ ప్రక్రియ పూర్తయి, అవార్డులు ఖరారైన చోట నిధుల విడుదలలో ఒక్కరోజు కూడా జాప్యం ఉండకూడదన్నది ప్రభుత్వ విధానమని స్పష్టం చేశారు.రాష్ట్రవ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న

>>2


22ఎపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి: హరీష్ 7




# రేవంత్ వ్యాఖ్యలు సహేతుకం కాదు..

## అమెరికా పర్యటనలో అర్హతలేని వ్యక్తులను కలవాలనుకొన్నారు..

## కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి నిశిత విమర్శ

**హైదరాబాద్, ఆగస్టు 25 ప్రభాతవార్త:** అమెరికా పర్యటనపై సిఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు అర్థరహితమైనవని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి కిషన్‌రెడ్డి తప్పుపట్టారు. రేవంత్‌రెడ్డిని కేంద్రం అడ్డుకుందని అనటం సరికాదన్నారు. కేంద్రం అనుమతి రాకుండానే ఆదరాబాదరగా ముఖ్యమంత్రి పర్యటన పెటుకున్నారని,

>>2



మంగళవారం హైదరాబాద్‌లో రాంచందర్‌రావుకు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేస్తున్న బిజెపి సీనియర్ నేత లక్ష్మణ్

# రాంచందర్‌రావు దీక్ష విరమణ

**రూ. 15 వేల కోట్ల బకాయిలు విడుదల చేసేదాకా పోరాటం ఆగదన్న బిజెపి చీఫ్**

**హైదరాబాద్, ఆగస్టు 25 ప్రభాతవార్త:** తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం తొక్కిపెట్టిన రూ. 15,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు చేపట్టిన మహా నిరాహార దీక్ష ప్రజా మద్దతుతో విజయవంతంగా ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా 40 లక్షల మంది విద్యార్థుల జీవితాలను సంక్షోభంలోకి నెట్టిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై నిర్వహించిన ఈ పోరాటం కాంగ్రెస్ సర్కార్ పునాదులను కదిలించిందన్నారు. ప్రభుత్వ నిర్బంధాలు, పోలీసు ఆంక్షలను ఏమాత్రం లెక్కచేయకుండా ఎన్. రాంచందర్ రావు పార్టీ కార్యాలయ ప్రాంగణంలోనే పట్టుదలతో నిరాహార దీక్షను

>>2

# వర్షాలతో పంటలకు కొత్త ఊపిరి

## పచ్చదనంతో చేలు కళకళ

## తెప్పరిల్లిన అన్నదాతలు

## మెదక్, సిద్దిపేట, జనగామ, మహబూబాబాద్, ఖమ్మం జిల్లాల్లో పెరిగిన వర్షపాతం



**హైదరాబాద్, అగస్టు 25, ప్రభాతవార్త:** తీవ్ర వర్షభావ పరిస్థితులతో దిక్కుతోచని స్థితిలో ఉన్న అన్నదాతలకు వర్షాలు కొండంత ఊరటనిచ్చాయి. పంటల పెట్టుబడి చేతికందే కీలక తరుణంలో ఈ వర్షాలు రైతులకు పెద్ద ప్రయోజనంగా మారాయి. ఎల్ నినో ప్రభావంతో గత కొద్ది రోజులుగా వర్షాలు ముఖం చాటేయడం, ఎండల తీవ్రత పెరగడంతో సాగు చేసిన పంటలు ఎండుముఖం పట్టాయి. వివిధ ప్రాంతాల్లో చేలు కూడా బీటలు వారి, నీరు

>>2

# మూడు రోజులు వర్ష సూచన

**హైదరాబాద్, అగస్టు 25, ప్రభాతవార్త:** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో తెలంగాణలో రాగల రెండు నుంచి మూడు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. దీని ప్రభావంతో పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే సూచనలు ఉన్నాయి. తెలంగాణ వ్యాప్తంగా పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రాష్ట్రంలో గంటకు దాదాపు 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే ఆస్కారముందని అధికారులు పేర్కొన్నారు. ఆకాశం మేఘావృతమై ఉంటూ ఉక్కపోత నుంచి ఉపశమనం లభించడంతో పాటు

>>2



మంగళవారం జమ్మూలోని ఓ పాఠశాలలో ప్రధాని మోడీ మాస్కులు ధరించిన విద్యార్థులకు రాఖీలు కడుతున్న దృశ్యం

# చర్యలు తప్పవు!

>> లెటర్ లో ఏముందో చెప్తే నాకు నోటీసులు వస్తాయి మా రిపోర్ట్ లో అన్ని విషయాలు పొందు పరిచామని అన్నారు. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, చిన్నారెడ్డిపై వేటు వేయాల్సిందేనని రాష్ట్ర కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ తేల్చినట్లు సమాచారం. క్రమశిక్షణ రాహిత్యంగా మాట్లాడేవారిని వదిలేస్తే పార్టీకి తీవ్ర నష్టం జరుగుతుందని అభిప్రాయపడింది. వ్యక్తులు ముఖ్యం కాదని, పార్టీనే అంతిమమని స్పష్టం చేసింది. అటు సిఎం రేవంత్ రెడ్డి కూడా కొండా సురేఖ అంశంపై ఇక ఎవరూ మాట్లాడొద్దని స్పష్టం చేశారు. అన్ని విషయాలు అధిష్ఠానం చూసుకుంటుందని నియోజకవర్గాల అభివృద్ధిపై ఫోకస్ పెట్టాలని సూచించారు. క్రమశిక్షణ కమిటీ నివేదికను పిసిసి, ఎఐసిసి సోమవారమే ఇస్తారని ప్రచారం జరిగినా, ఇతర కార్యక్రమాల వల్ల మంగళవారానికి వాయిదా పడింది. వ్యక్తుల స్థాయి పెద్దదని తప్పు చేసినా చూసీ చూడనట్లు వదిలేస్తే కాంగ్రెస్ పార్టీకి తీవ్ర నష్టం జరుగుతుందని భావిస్తున్నట్లు తెలిసింది. వ్యక్తులు ముఖ్యం కాదని, పార్టీనే అంతిమమని భావించి వారిపై చర్యలు తీసుకోవాల్సిందేనని కమిటీ తేల్చినట్లు సమాచారం. కాంగ్రెస్‌కు, ప్రభుత్వానికి నష్టం కలిగించేలా మాట్లాడే వారిని వదిలేస్తే పార్టీలో మరింత క్రమశిక్షణ పట్టుతప్పుతుందని పలువురు నేతలు కూడా కమిటీకి చెప్పారు.

గతంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ఎమ్మెల్యేలు ఫిర్యాదు చేసినప్పుడే హెచ్చరించినా కొండా సురేఖ వైఖరిలో ఏమాత్రం మార్పు రాలేదని కమిటీ సభ్యులు అనుకుంటున్నట్లు సమాచారం. మంత్రి మండలిలో మంత్రిగా కొనసాగుతూ సురేఖ సమిష్ఠి బాధ్యత వహించాల్సిందిపోయి రేవంత్ రెడ్డిపైనే ఆమె కుమార్తె ఆరోపణలు చేయడం ఏమాత్రం మంచిది కాదని . కుమార్తె వ్యాఖ్యలతో తనకు సంబంధం లేదని కమిటీకి కొండా సురేఖ పంపిన వివరణ అసంబద్ధమని వారు అభిప్రాయపడ్డారు.

అలా అని భావిస్తే వెంటనే బాధ్యత గల మంత్రిగా ఆమె కుమార్తె చేసిన వ్యాఖ్యలను ఖండించాలని, కానీ అలా ఎందుకు చేయలేదని కమిటీ నివేదికలో ఎత్తి చూపింది. అంటే ప్రభుత్వంతో తనకు సంబంధం లేదన్నట్లుగా కొండా సురేఖ వ్యవహార శైలి ఉందని, అలాంటి ఆమెకు మంత్రివర్గంలో కొనసాగే నైతిక అర్హత లేదని క్రమశిక్షణ సంఘం పేర్కొంది.

చిన్నారెడ్డి కూడా కేబినెట్ హోదా పదవిలో ఉండి పార్టీ టికెట్లను అమ్ముకున్నారనడం క్షమించకూడదని ఆయనకు ప్రభుత్వ పదవిలో కొనసాగే నైతిక అర్హత లేదని కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ నివేదికలో పేర్కొన్నట్లు తెలిసింది. చిన్నారెడ్డి గతంలో రాష్ట్ర కాంగ్రెస్ క్రమశిక్షణ వ్యవహారాల కమిటీ ఛైర్మన్‌గా కూడా పని చేసినందున ఇతర నేతలకు మార్గదర్శకంగా ఉండాల్సి ఉండల్సింది.

# ఇందిరమ్మ టవర్స్

>> సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేసుకున్న ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి సంబంధించి ఇప్పటికే టెండర్ల ప్రక్రియను పూర్తిచేశామని వెల్లడించారు. క్యూఆర్ పరిధిలోని తొలి విడతలో ప్రయోగాత్మకంగా 16 నియోజకవర్గాల్లో 807.40 కోట్ల అంచనా వ్యయంతో ఇందిరమ్మ టవర్స్ నిర్మిస్తున్నామని ఇందుకోసం జూన్ 20 నుంచి ఆగస్టు 15 తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించగా మొత్తం 60,720 దరఖాస్తులు అందాయని, వచ్చిన .దరఖాస్తులపై 360 డిగ్రీల క్షేత్రస్థాయి పరిశీలన, సమగ్ర విచారణ అనంతరం 40,900 మందిని అర్హులుగా, 19,820 మందిని అనర్హులుగా గుర్తించామన్నారు. అనర్హతకు గల కారణాలను దరఖాస్తుల వారీగా వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఈ నెల 28, 29, 30, 31 తేదీల్లో ఆయా ప్రాంతాల్లోని ప్రత్యేక ఫంక్షన్ హాళ్లలో ప్రజలు, అర్హులైన దరఖాస్తుదారుల సమక్షంలోనే పారదర్శకంగా లక్కీ డ్రా నిర్వహిస్తామని ప్రతి కేంద్రానికి ఒక ప్రత్యేక పర్యవేక్షణాధికారిని కూడా నియమించామని తెలిపారు. లక్కీ డ్రా ద్వారా లబ్ధిదారుల తుది జాబితా ప్రకటించిన తర్వాత ఎంపిక కాని దరఖాస్తుదారులకు వారు చెల్లించిన రూ.10,000 ఈఎండీ మొత్తాన్ని వెంటనే వారి ఖాతాల్లోకి తిరిగి జమ చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. 28వ తేదీన రాయదుర్గం, కెపిహెచ్‌బి కాలనీ, మైలార్‌దేవరపల్లి, రెడ్‌హిల్స్, 29న కొకూర్, పాటిగెడ్డ, జల్‌పల్లి, కుల్సుంపుర, 30న జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే కాలనీ, బోయన్‌పల్లి, బండ్లగూడ (ఎల్ఐజి కాలనీ), నందిముసలిగుడ, 31వ తేదీన గాజుల రామారం, అంబర్‌పేటలోని సిటీపోలీస్ లైన్స్, గడ్డిన్నారం, ఆర్ బి క్వార్టర్స్, పోచారం ( ఎల్ఐజి కాలనీ)లో లక్కీడ్రా నిర్వహిస్తారని తెలిపారు. మరో నాలుగు నియోజకవర్గాల్లో స్థలాల ఎంపిక:-క్యూర్ పరిధిలో కొత్తగా మరో 4 నియోజకవర్గాల్లో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి స్థలాలను ఎంపిక చేశామని తెలిపారు. ఒక్కో నియోజకవర్గంలో 480 ఇళ్ల చొప్పున మొత్తం 1,920 ఇళ్లను నిర్మించేందుకు చర్యలు చేపట్టినట్లు వివరించారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో హయత్‌నగర్ గ్రామంలోని అమంగల్, గోషామహల్ నియోజకవర్గంలోని నాంపల్లి, ముషీరాబాద్ నియోజకవర్గంలోని జమిస్తాన్‌పూర్ (ఆర్టీసీ క్వార్టర్స్), చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలోని బండ్లగూడలో (ఫలక్‌నుమా సమీపంలో) ఇళ్లు నిర్మించేందుకు వీలుగా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. ఈ 4 నియోజకవర్గాల పరిధిలోని అర్హులైన ప్రజలు ఇందిరమ్మ టవర్స్ కోసం సెప్టెంబర్ 3వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని పొంగులేటి తెలిపారు.

గతంలో 16 నియోజకవర్గాలకు వర్తింపజేసిన నిబంధనలే ఈ కొత్త దరఖాస్తులకూ వర్తిస్తాయన్నారు ఇందిరమ్మ టవర్స్ ప్రత్యేకత కేవలం అపార్ట్‌మెంట్‌లో ఒక ఇల్లు ఇవ్వడంలోనే లేదని నగరంలో విలువైన భూమిపై ఒక కుటుంబానికి శాశ్వత ఆస్తి, భద్రమైన భవిష్యత్, ఆత్మగౌరవంతో జీవించే అవకాశం కల్పించడమే ప్రధాన లక్ష్యమన్నారు. ప్రతిపాదిత ప్లాట్ విస్తీర్ణం 525 చదరపు అడుగులు. అన్‌డివైడెడ్ షేర్ విధానంలో సుమారు 20-25 గజాల భూమిని లబ్ధిదారుల పేరుతో ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయనున్నామని ప్రాంతాన్ని బట్టి లబ్ధిదారులకు అందే భూమి విలువ రూ.60 లక్షల నుంచి రూ.కోటికి పైగా ఉండనుందన్నారు.

ఇంత విలువైన ఆస్తిని పేద కుటుంబానికి అందించడంతో పాటు, ఇంటి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షల పూర్తి సబ్సిడీ అందిస్తోందని లబ్ధిదారుడి వాటా కేవలం రూ.6 లక్షలు మాత్రమే, అది కూడా నాలుగు విడతల్లో చెల్లించే విధంగా అవకాశం కల్పించామన్నారు. జీవితాంతం అద్దె ఇంట్లోనే ఉండాల్సిన పరిస్థితి నుంచి పేదకుటుంబాన్ని బయటకు తీసుకువచ్చి, నగరంలోనే సొంతింటి యజమానిగా నిలబెట్టడమే ఇందిరమ్మ టవర్స్ లక్ష్యమన్నారు.

# కొత్త ఊపిరి

>> కోసం నోళ్లు తెరచుకుని చూస్తున్నాయి. ఈ దశలో రెండు రోజులుగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో కురుస్తున్న వానలు, జల్లులు పంట పొలాలకు పునర్జీవం పోశాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో అరకొర వర్షాలతో రైతులు వరి, పత్తి, మొక్కజొన్న తదితర పంటలను సాగు చేశారు. అయితే సరైన సమయానికి వర్షాలు కురవకపోవడం, భూగర్భ జలాలు అడుగంటి బోరుబావుల్లో నీటి ప్రవాహం తగ్గడంతో పంటలు నిలువునా ఎండిపోయే పరిస్థితులు ఉత్పన్నమయ్యాయి. పెట్టుబడులు కూడా దక్కవేమోనన్న తీవ్ర ఆందోళనల్లో రైతులు కూరుకుపోయారు. సరిగ్గా ఇలాంటి విపత్కర సమయంలో వాయుగుండం, అల్పపీడనాల ప్రభావంతో ప్రారంభమైన వర్షాలు పంటలకు అమృతంలా పనిచేశాయి. గడచిన 24 గంటల్లో రాష్ట్ర వ్యాప్తంగా సగటున 5.3 మిల్లీ మీటర్ల వర్షపాతం రికార్డయింది. అత్యధికంగా ఖమ్మం జిల్లా కల్లూరులో 38.5 మిల్లీ మీటర్ల వర్షపాతం రికార్డయింది. రాష్ట్రంలోని మెదక్, సిద్దిపేట్, ములుగు, భూపాలపల్లి, మహబూబాబాద్, ఖమ్మం, జనగామ జిల్లాల్లో ఒక మోస్తరు వర్షాలు కురియగా, సిరిసిల్లా, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిజామాబాద్, సంగారెడ్డి, జగిత్యాల, ఆదిలాబాద్, మల్కాజిగిరి, భువనగిరి జిల్లాల్లో స్వల్పంగా వర్షాలు పడ్డాయి. కాగా ఏక ధాటిగా కురిసే వర్షాల కన్నా, ఇలా నేలను తడుపుతూ నిదానంగా కురిసే వానల వల్ల తేమ ఎక్కువ కాలం నిలిచి పంటలు ఎదుగుదలకు ఎంతగానో దోహదపడుతుందని రైతులు చెబుతున్నారు.

మరోపక్క వర్షాలతో నేలంతా తడిసి ముద్ద వడంతో పొలాల్లో తేమ శాతం పెరిగింది. దీంతో బోరు బావులపై ఆధారపడాల్సిన అవసరం తాత్కాలికంగా తగ్గింది. పత్తి చేలల్లో పూత, కాత రాలకుండా ఈ తేమ రక్షణగా నిలుస్తుందని, అలాగే ఎండిపోతున్న వరి పైర్లకుతిరిగి పచ్చదనాన్ని సంతరించుకుంటున్నాయని రైతులు అంటున్నారు.

# వర్ష సూచన

>> కొన్నిచోట్ల ఈదురుగాలులతో కూడిన జల్లులు పడే అవకాశమున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా సంగారెడ్డి, వికారాబాద్, మెదక్, కామారెడ్డి, నిర్మల్, నిజామాబాద్, ఆదిలాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, సిద్దిపేట, భువనగిరి, జనగామ, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, సూర్యాపేట, కొత్తగూడెం, నల్గొండ జిల్లాల్లో మధ్యాహ్నం నుంచి రాత్రి వేళల్లో అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు నుంచి తీవ్ర వర్షాలు నమోదయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ప్రజలు, ముఖ్యంగా రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

## వారం - వర్జ్యం

26-08-2026, బుధవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
శ్రావణ మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, శుక్లపక్షం, మఖకార్తె
తి.త్రయోదశి ఉ.7.58
న.శ్రవణ రా.12.46
వ.తె.5.00-ఉ.6.42
దు.ఉ.11.44-మ.12.34
రాహు మ.12.00-మ.1.30
శుభ ఉ.7.00-ఉ.8.00

## వార్తాఫలం

**మేషం :** క్రీడారంగంలోని వారికి అనుకూలంగా ఉంటుంది. ఆవేశాన్ని కలిగి ఉంటారు. కష్టాలు ఎప్పుడు వంటరిగా రావు.

**వృషభం :** ప్రభుత్వపరమైన పనులు సానుకూల పడతాయి. పోటీ పరీక్షల్లో విజయం సాధిస్తారు. ఇంటాబయట ప్రోత్సాహం.

**మిథునం :** ప్రయోజనాలను పరిరక్షించుకోవడానికి మీ ఆత్మసాక్షికి విరుద్ధంగా ఓ కార్యక్రమాన్ని చేపడతారు. ఆహ్వానాలు.

**కర్కాటకం :** ఖచ్చితమైన ప్రణాళికలను రూపొందించు కుంటారు. నూతన కార్యక్రమాలకు శ్రీకారంచుడతారు. వస్తువులు కొనుగోలు.

**సింహం :** ఆర్థిక లావాదేవీలు లాభసాటిగా సాగుతాయి. సోదరుల ద్వారా విలువైన సమాచారం అందుకుంటారు.

**కన్య :** అనుకోని ఆహ్వానాలు ఆశ్చర్యపరుస్తాయి. కొత్త వస్తువులు, వస్త్రాలు కొనుగోలు చేస్తారు. బంధువుల సలహాలు తీసుకుంటారు.

**తుల :** ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది. కోపతాపాలకు దూరం వుండండి. వాహనాలు కొనుగోలు యత్నాలు.

**వృశ్చికం :** వృత్తి, వ్యాపారాలలో మార్పులు వుంటాయి. ఆర్థికపరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది. వస్త్రా లాభం.

**ధనుస్సు :** మనోనిబ్బరంతో ముందడుగు వేసి ముఖ్యమైన వ్యవహారాలు పూర్తి చేస్తారు. కోపతాపాలకు దూరంగా వుండండి.

**మకరం :** వ్యాపారాలను ప్రారంభించడానికి గాను కావలసిన వనరులను సమకూర్చుకునే యత్నాలను ప్రారంభిస్తారు.

**కుంభం :** వృత్తి, వ్యాపారాలలో మార్పులు వుంటాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. నూతన వ్యక్తులతో పరిచయాలు.

**మీనం:** భాగస్వామ్య వ్యాపారాలలో అభివృద్ధిని సాధిస్తారు. జీవిత భాగస్వామి సహాయం సహకారాలను అందుకుంటారు. ధనలాభం.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# సహేతుకం కాదు..

>> అమెరికా పర్యటనలో అర్హతలేని వ్యక్తులను కలవాలని రేవంత్‌రెడ్డి నిర్ణయించుకున్నారని ఆరోపించారు. మంగళవారం సాయంత్రం ఢిల్లీలో మీడియాతో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి, కేంద్రమంత్రి స్థాయి వ్యక్తులు అన్ని అనుమ తులు తీసుకున్నాకే విదేశీ పర్యటన ఖరారు చేసుకుంటారు. ఆదరబాదరాగా లండన్ వెళ్లి.. అక్కడి నుంచి రేవంత్ రెడ్డి అమెరికా వెళ్లాలనుకు న్నారు. ఆయన విదేశాలకు వెళ్లక ముందే మీ స్థాయికి తగ్గట్టు విదేశీ పర్యటన లేదని, అందుకే అనుమతులు ఇవ్వట్లేదని విదేశాంగ శాఖ స్పష్టంగా చెప్పింది. దీనిపై ఆలోచించి నిర్ణయం తీసుకుని, అధికారులతో చర్చించి క్లియరెన్స్ తీసుకోవాల్సి ఉంది. కానీ, రేవంత్ రెడ్డి.. తన అసమర్థతను కప్పిపుచ్చుకునేం దుకు ఈ నెపాన్ని కేంద్ర ప్రభుత్వంపై నెడుతున్నారు. విదేశీ పర్యటనల విషయంలో విదేశాంగ శాఖ నిబంధనలు మోడీ ప్రభుత్వం వచ్చాక ఖరారు చేసినవి కాదు. స్వాతంత్రం వచ్చినపట ి నుంచి ఈ నిబంధనలున్నాయ న్నారు. రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనకు అనుమతులివ్వకపోవడం ఏదో తెలంగాణకు అన్యాయం జరిగిందనేలా మాట్లాడుతున్నారు. 2005లో అప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం మోడీ అమెరికా వెళ్లకుండా అనుమతులు ఇవ్వలేదన్నారు. మరి దీనికి ఎవరిని ప్రశ్నించాలి. ఈ యేడాదిజనవరిలో హార్వర్డ్ బిజినెస్ స్కూల్ వెళ్లేందుకు రేవంత్ రెడ్డికి అనుమతులు ఇచ్చామన్నారు. అంతకుముందు తెలంగాణ మూసీ అభివృద్ధి కోసం లండన్ వెళ్లేందుకు, తాజాగా లండన్ వెళ్లేందుకు కూడా అనుమతులిచ్చాం. సిఎం స్థాయిలో ఉన్న వ్యక్తి బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. అమెరికా పర్యటన విషయంలో ఆయన క్లారిటీ ఇవ్వకుండా ఇలా మాట్లాడటం సరికాదు. గతంలో అనేక మంది ముఖ్యమంత్రులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు పర్యటనలకు నిరాకరించింద న్నారు. ఇదంతా సాధారణ పరిపాలనా ప్రక్రియ మాత్రమే అన్నారు. ఇదేమీ రాజకీయ అంశం కాదని, ఈ విషయంలో కేంద్రంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సిఎం రేవంత్ రెడ్డి బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. పాకిస్థాన్ అనుకూల వ్యక్తి, న్యూయార్క్ మేయర్ మమ్దానీని కలవడానికి రేవంత్ ప్రయత్నించారని పత్రికల్లో చదివానన్నారు. ఇది వాస్తవమా? కాదా? అని రేవంత్ రెడ్డి చెప్పాలి. భారత ప్రధానిని టెర్రరిస్టుతో పోల్చిన వ్యక్తి మమ్దానీ. అలాంటి వ్యక్తిని కలవడానికి రేవంత్ ప్రయత్నించారా? విదేశీ యూనివర్సిటీలను తీసుకొస్తామని చెప్పే రేవంత్ రెడ్డి.. ముందు తెలంగాణ విద్యా వ్యవస్థ గురించి మాట్లాడాలి. మీరు అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యారంగానికి బడ్జెట్‌లో 15శాతం నిధులు కేటాయిస్తామన్నా రు. విద్యార్థులకు స్కూటీలు, విద్యా భరోసా కార్డులు ఇస్తామన్నారు. వాటి సంగతేంటి? ప్రతిమండలానికి ఇంటర్నేషనల్ స్కూల్ అన్నా రు. దీనిపై ప్రశ్నిస్తే.. సమాధానం చెప్పడం లేదు.నేల విడిచి సాము చేయడం రేవంత్ రెడ్డికి అలవాటైంది. తన అసమర్థత, ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, మాటలతో గారడీ చేయడం తప్పితే.. ఎక్కడ కూడా నిర్మాణాత్మక నిర్ణయం తీసుకోలేదన్నారు.



మంగళవారం బ్యాడ్మింటన్ క్రీడాకారులు గాయత్రి గోపీచంద్, త్రిసా జాలీలను అభినందిస్తున్న సిఎం రేవంత్

## బ్యాడ్మింటన్ వరల్డ్ ఛాంపియన్స్ గాయత్రి, త్రిసాలను అభినందించిన సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు25:** జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రముఖ బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్, బ్యాడ్మింటన్ క్రీడాకారులు గాయత్రి గోపీచంద్, త్రిసా జాలీ కలిశారు. ఇటీవల బ్యాడ్మింటన్ వరల్డ్ ఛాంపియన్‌షిప్స్ మహిళల డబుల్స్‌లో కాంస్య పతకం గాయత్రి గోపీచంద్, త్రిసా జాలీ సాధించారు. ఈ సందర్భంగా ఆ ఇద్దరు ప్లేయర్లను సిఎం రేవంత్‌రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు, మాజీ బ్యాడ్మింటన్ ప్లేయర్ పి.వి.వి. లక్ష్మి పాల్గొన్నారు.

## మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు తెలిపిన సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు25:** మిలాద్ ఉన్ నబీ పండుగ సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ముస్లిం సోదర, సోదరీమణులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకునే ఈ పవిత్ర దినం ముస్లింలకు ఎంతో విశిష్టమైనదని పేర్కొన్నారు. ప్రవక్త మహ్మద్ బోధించిన శాంతి, ప్రేమ, సోదరభావం, కరుణ, మానవత్వం, ధర్మబద్ధమైన జీవన విధానం సమాజానికి ఎల్లప్పుడూ ఆదర్శప్రాయమని ముఖ్యమంత్రి అన్నారు. ఆయన సందేశాలు ప్రపంచ శాంతి, సామరస్యానికి మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ముస్లిం మైనారిటీల సంక్షేమం, అభివృద్ధికి ప్రజా పాలనలో తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని సీఎం స్పష్టం చేశారు. ముస్లింల సామాజిక, ఆర్థిక, విద్యా రంగాల అభ్యున్నతికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని భరోసా ఇచ్చారు. మిలాద్ ఉన్ నబీ ప్రతి ఒక్కరి జీవితాల్లో శాంతి, సంతోషం, సౌభ్రాతృత్వాన్ని నింపాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

# యేడాదిలో దేవాదుల రెడీ

>> నీటిపారుదల ప్రాజెక్టుల్లో భూసేకరణ తదితర అడ్డంకులను తొలగించేందుకు రూ.6,000 కోట్ల ప్రత్యేక ప్యాకేజీకి ఏర్పాటు చేయగా, అందులో ఇప్పటికే సుమారు రూ.2,500 కోట్లు విడుదలయ్యాయని మంత్రి వెల్లడించారు. దేవాదుల ప్రాజెక్టుకు కూడా ఇటీవల భూసేకరణ కోసం నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న పంపింగ్ వ్యవస్థలన్నింటినీ పూర్తి సామర్థ్యంతో వినియోగించి, గోదావరి నుంచి సాధ్యమైనంత గరిష్ఠ పరిమాణంలో నీటిని ఎత్తిపోసి ఆయకట్టుకు, ప్రాజెక్టు పరిధిలోని రిజర్వాయర్లకు చేరవేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఏళ్లుగా దేవాదుల అమలులో ఎదురైన సమస్యలను సమీక్షలో క్షుణ్ణంగా విశ్లేషించామని, మిగిలిపోయిన ప్రతి అడ్డంకిని అధిగమించేందుకు ఆచరణాత్మక పరిష్కారాలను రూపొందించినట్లు చెప్పారు. మంత్రులు, ప్రజాప్రతినిధులతో విస్తృత సమీఈ సమీక్ష సమావేశంలో రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార-పౌరసంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ "సీతక్క, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎంపి పోరిక బలరాం నాయక్, సీనియర్ శాసనసభ్యుడు కడియం శ్రీహరి, దేవాదుల ప్రాజెక్టు పరిధిలోని ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు, ఇంజినీర్లు పాల్గొన్నారు. దేవాదుల ప్రాజెక్టుతో ఏళ్లుగా అనుబంధం ఉన్న ప్రజాప్రతినిధులు సమీక్షలో పాల్గొనడం వల్ల క్షేత్రస్థాయిలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను సమగ్రంగా పరిశీలించే అవకాశం లభించిందని మంత్రి పేర్కొన్నారు. దేవాదులపై నిరంతర పర్యవేక్షణకుపై విధానపరమైన, పరిపాలనా లేదా కాంట్రాక్టు సంబంధిత సమస్యల పేరుతో దేవాదుల పనులు సాగదీయడానికి అవకాశం ఉండదని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. గౌరవెల్లి ప్రాజెక్టు విషయంలో ప్రభుత్వం నిధులు అందించినప్పటికీ క్షేత్రస్థాయిలో కొన్ని ప్రక్రియలు ఆలస్యమవుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. సంబంధిత కలెక్టర్లు, చీఫ్ ఇంజినీర్లు సంయుక్తంగా సమావేశమై పెగ్ మార్కింగ్, భూసేకరణ, ఆర్అండ్ఆర్, న్యాయపరమైన సమస్యలు, నిర్మాణం, కాలువ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. గౌరవెల్లి ప్రాజెక్టుపై వారం రోజుల తర్వాత ప్రత్యేక సమీక్ష నిర్వహిస్తామని ప్రకటించారు. బస్వాపూర్ రిజర్వాయర్‌లో 5 టీఎంసీల నీటిని నిల్వ చేసేందుకు పరిమిత అదనపు పనులతో అవకాశం ఉందా అన్న అంశాన్ని అధికారులు పరిశీలించాలని మంత్రి సూచించారు. స్థానిక ప్రజాప్రతినిధులతో సంప్రదించి సాంకేతిక, ఆర్థిక అంశాలపై సమన్వయ నివేదిక సమర్పించాలని ఆదేశించారు. భూసేకరణ, ఆర్అండ్ఆర్, అటవీ అనుమతులకు సంబంధించిన సమస్యల పరిష్కారంలో తాను, నీటిపారుదల శాఖ కార్యదర్శి ఈ. శ్రీధర్ కలెక్టర్లు, చీఫ్ ఇంజినీర్లకు నేరుగా అందుబాటులో ఉంటామని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.



న్యూఢిల్లీలో మంగళవారం కురిసిన భారీ వర్షానికి చెరువును తలపిస్తున్న వరద నీటిలో వాహనాల రాకపోకలు

# జలజలా 'మూసీ'

>> బ్యారేజీలు, నార్సింగి నుంచి గౌరెల్లి వరకు 55 కిలోమీటర్ల మేర ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం, రివర్ ఫ్రంట్ అభివృద్ధి ఉంటాయని అధికారులు పేర్కొంటున్నారు. సుమారు రూ.7.55 వేల కోట్లతో చేపట్టనున్న మొదటి ఫేజ్ నిధుల సమీకరణపై ఆసియా అభివృద్ధి బ్యాంక్‌తో సాంకేతిక, ఆర్థిక చర్చలు విజయవంతంగా అధికారులు ఇది వరకే పేర్కొన్నారు. మొదటి ఫేజ్‌లో హిమాయత్ సాగర్ నుంచి బాపుఘాట్ ఉస్మాన్ సాగర్ నుంచి బాపుఘాట్ వరకు 21 కిలోమీటర్ల మేరకు అభివృద్ధి చేయనున్నట్లు అధికారులు చెప్పారు. ఉప్పల్ భగాయత్ నుంచి గౌరెల్లి వరకు ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్ సిద్ధంగా ఉందని ఉందని అధికారులు తెలిపారు. ప్రజల ఆస్తులపై ప్రభావం లేని ఐదు కిలోమీటర్లలో వెంటనే పనులను ప్రారంభించాలని భావిస్తున్నట్లు సమాచారం.

## రాంచందర్‌రావు దీక్ష విరమణ

>> ప్రారంభించి విజయవంతంగా కొనసాగించారు. ఈ సందర్భంగా దీక్షా ప్రాంగణంలో బిజెపి ముఖ్యనేతలు, ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి ంవంత్ రెడ్డిపై, రాహుల్ గాంధీ ద్వంద్వ వైఖరిపై నిప్పులు చెరిగారు. "ఎన్నికలప్పుడు యూత్ డిక్లంషన్ పేరుతో అనేక హామీలిచ్చి అశోక్ నగర్ లైబ్రరీ వద్ద నిరుద్యోగ యువత కాళ్లు మొక్కి, బాండ్లు రాసిచ్చిన నాయకులు.. తీరా గద్దెనెక్కాక అదే విద్యార్థుల పొట్టకొడుతున్నారు. పేద బిడ్డల చదువుల కోసం ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వమంటే చేతులెత్తేసి, ఢిల్లీ పెద్దలకు రాచమర్యాదలు చేయడానికి మాత్రం వందల కోట్ల ప్రజాధనాన్ని లూటీ చేస్తున్నారు. విద్యాశాఖ మంత్రిగా ఉన్న ముఖ్యమంత్రి ంవంత్ రెడ్డికి విద్యార్థుల గోడు పట్టదు కానీ, హార్వర్డ్, ఆక్స్‌ఫర్డ్ పర్యటనల పేరుతో విదేశాల్లో విహరించడానికి సమయం దొరుకుతుందని విమర్శించారు. నిరంతర నిరాహార దీక్ష కారణంగా ఎన్. రాంచందర్ రావు రక్తపోటు పడిపోవడం, షుగర్ లెవెల్స్ తగ్గడంతో ఆరోగ్యం క్షీణించింది. దీక్షా శిబిరానికి వచ్చిన వైద్య బృందం ఆయన ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి, దీక్షను కొనసాగిస్తే ఆయన ఆరోగ్యానికి ప్రమాదం ఉందని హెచ్చరించింది. ఈ నేపథ్యంలో పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధుల బలవంతపు విజ్ఞప్తి మేరకు, వైద్యుల సలహాల మేరకు రాంచందర్ రావుకి నిమ్మరసం స్వీకరించి నిరాహార దీక్షను విరమించారు. దీక్షా శిబిరంలో రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె. లక్ష్మణ్ చేతుల మీదుగా, బిజెఎల్పి నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఇతర ముఖ్య నేతలు ఎన్. రాంచందర్ రావుకి నిమ్మరసం ఇచ్చి నిరాహార దీక్షను విరమింపజేశారు. దీక్ష విరమణ అనంతరం ఎన్. రాంచందర్ రావు మాట్లాడుతూ "నిరాహార దీక్ష ముగిసినా, విద్యార్థుల హక్కుల కోసం బిజెపి పోరాటం ఆగదు. ప్రభుత్వం మొండివైఖరి వీడి రూ. 15,000 కోట్ల బకాయిలను పైసా పైసా చెల్లించేవరకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిద్రపోనివ్వం. విద్యార్థులకు న్యాయం జరగకపోతే త్వరలోనే సచివాలయాన్ని ముట్టడించి కాంగ్రెస్ మెడలు వంచుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, శాసనమండలి పక్షనేత ఏవీఎన్ రెడ్డి, బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యులు, రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె. లక్ష్మణ్, మహబూబ్‌నగర్ ఎంపి డికె అరుణ, రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య, ంఖాశర్మ, మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్, మెదక్ ఎంపి రఘునందన్ రావు, నిజామాబాద్ ఎంపి ధర్మపురి అర్వింద్, చేవెళ్ల ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఎమ్మెల్యేలు పాల్వాయి హరీష్ బాబు, ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, వెంకట రమణారెడ్డి, పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వన మహోత్సవంలో 86 % లక్ష్యం పూర్తి..

### చేయూత పెన్షన్ల అర్హతపై క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన చేయాలి: మంత్రి సీతక్క

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు25:** రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలను సద్వినియోగం చేసుకుంటూ వన మహోత్సవం లక్ష్యాలను పూర్తి చేయడంతో పాటు, ఉపాధి హామీ పనులు, నీటి సంరక్షణ, జీవనోపాధి ఆస్తుల కల్పనపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క ఆదేశించారు. మంగళవారం సచివాలయం నుంచి జిల్లా స్థాయి అధికారులతో మంత్రి సీతక్క వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలోని వివిధ కార్యక్రమాల పురోగతిని సమీక్షి ంచారు. కమిషనర్ దివ్య, స్పెషల్ కమిషనర్ శ్రీలక్ష్మి, జిల్లా సీఈఓలు, డీఆర్డీఓలు, డీపీఓలు, అదనపు డీఆర్డీఓలు తదితరులు పాల్గొన్నారు. ఇతర శాఖల పరిధిలో వన మహోత్సవ కార్యక్రమాలు ఇటీవల ప్రారంభమైనప్పటికీ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ముందుగానే ప్రారంభించి ఇప్పటికే 86 శాతం లక్ష్యాన్ని పూర్తి చేశామని మంత్రి సీతక్క తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 6.18 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటివరకు 5.32 కోట్లకు పైగా మొక్కలు నాటడం జరిగిందని చెప్పారు. ఇది గణనీయమైన పురోగతి అని పేర్కొంటూ, మిగిలిన లక్ష్యాన్ని కూడా వర్షాలు అనుకూలంగా ఉన్న ప్రస్తుత సమయంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎండాకాలంలోనే ఉపాధి హామీ కూలీల సహకారంతో మొక్కలు నాటేందుకు గుంతలు సిద్ధం చేశామని, ఎల్‌నినో పరిస్థితులు ఉన్నప్పటికీ తొలి వర్షాలు పడగానే మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించామని మంత్రి తెలిపారు. ఇప్పుడు 86 శాతం లక్ష్యం పూర్తయిన నేపథ్యంలో నాటిన మొక్కలు ఏ మేరకు ఎదుగుతున్నాయి, వాటి మనుగడ ఎలా ఉంది అన్నదానిపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలని సూచించారు. వాగులు, వంకలు, రహదారులకు ఇరువైపులా, చెరువుల పరిసరాలు, శ్మశాన వాటికలు, పార్కులు, ప్రభుత్వ స్థలాలు తదితర ప్రాంతాలను వినియోగించుకుని మిగిలిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని అన్నారు. మొక్కలు నాటడంతో కార్యక్రమం పూర్తయినట్లు భావించకుండా వాటి సంరక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని సీతక్క సూచించారు. వర్షాలు లేని రోజుల్లో క్రమం తప్పకుండా నీరు అందించాలని, ప్రతి మొక్క చుట్టూ నీరు నిలిచేలా గుంటలు, తట్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. మొక్కలకు రక్షణ కంచెలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని, ముఖ్యంగా అవెన్యూ ప్లాంటేషన్లలో ఫెన్సింగ్ పటిష్టంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. చనిపోయిన మొక్కల స్థానంలో వెంటనే ప్రత్యామ్నాయ మొక్కలు నాటి 100 శాతం మనుగడ సాధించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 13,046 ఫార్మ్ పాండ్ల లక్ష్యానికి గాను 8,924 పనులు మంజూరయ్యాయని, అయితే గ్రౌండింగ్ పూర్తయినవి తక్కువగా ఉన్నాయని, పనుల వేగం పెంచాలని ఆదేశించారు.

## సిజెపి ఆందోళనలపై విచారణ కమిటీ పునర్వ్యవస్థీకరణకు పిటిషన్

**న్యూఢిల్లీ, ఆగస్టు 25:** ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఇటీవల జరిగిన కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలోని ఆందోళనల్లో పోలీసుల దౌర్జన్యాలపై విచారణకు సుప్రీంకోర్టు ఆదేశాలతో ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి కమిటీని పునర్వ్యవస్థీకరించాలని కోరుతూ సుప్రీంకోర్టులో దరఖాస్తు దాఖలైంది. ఈ దరఖాస్తును మంగళవారం ఉదయం భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, న్యాయమూర్తులు జోయ్‌మాల్య బాగ్చి, వి. మోహనాలతో కూడిన ధర్మాసనం ముందు ప్రస్తావించారు. వచ్చే వారం ఈ దరఖాస్తును విచారణకు జాబితా చేయాలని సీనియర్ న్యాయవాది గోపాల్ శంకరనారాయణన్ కోరారు. అయితే సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఈ దరఖాస్తును తీవ్రంగా వ్యతిరేకించారు. ఇది రాజకీయ ప్రేరేపిత దరఖాస్తు కావచ్చని ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. కమిటీని పునర్వ్యవస్థీకరించాలని, నిర్దిష్ట వ్యక్తుల పేర్లను ప్రస్తావిస్తూ కొన్ని సూచనలు చేయడం సరికాదని అన్నారు. కోర్టు రాజకీయ వేదిక కాదని పేర్కొన్నారు. దీనిపై శంకరనారాయణన్ స్పందిస్తూ, దరఖాస్తును కేవలం విచారణకు జాబితా చేయాలని మాత్రమే తాము కోరుతున్నామని, విచారణ సమయంలో ఎవరిపేర్లనూ ప్రస్తావించబోమని స్పష్టం చేశారు. చివరకు ఈ దరఖాస్తును కమిటీ పునర్వ్యవస్థీకరణకు సంబంధించిన ప్రధాన పిటిషన్లతో కలిపి విచారిస్తామని సుప్రీంకోర్టు తెలిపింది.

# అక్రమ సంపాదనతో భారీగా ఆస్తుల కొనుగోలు

### కుటుంబసభ్యుల ఖాతాల్లో కోట్ల రూపాయలు జమ
### కారుమూరి రిమాండ్ రిపోర్టులో కీలక విషయాలు
### గోల్‌మాల్ అంతా ఆయనకు తెలిసే జరిగిందన్న ఇడి



**హైదరాబాద్, ఆగస్టు 25, ప్రభాతవార్త:** ఏపిలో వైసిపి హయాంలో వెలుగుచూసిన మద్యం రవాణా కుంభకోణం కేసులో నిందితుడుగా వున్న ఆ రాష్ట్ర మాజీ మంత్రి, వైసిపి నేత కారుమూరి నాగేశ్వరరావు రిమాండు రిపోర్టులో కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) అధికారులు కీలక విషయాలు వెల్లడించారు. ఆదివారం సాయంత్రం హైదరాబాద్‌లోని కొండాపూర్‌లో ఆయ నను అరెస్టు చేయగా సోమవారం సాయంత్రం కోర్టులో హాజరు పరిచి రిమాండు నిమిత్తం చంచల్‌గూడ జైలుకు తరలించడం తెలిసిందే. ఈ గోల్‌మాల్ వ్యవహారంలో కారుమూరి పాత్రతోపాటు ఆయన కుటుంబసభ్యులు ఎంతమేర లబ్ధి పొందారనే వివరాలను ఇడి అధికారులు మంగళవారం నాంపల్లిలోని ఇడి కోర్టుకు రిమాండు రిపోర్టులో సమగ్రంగా వెల్లడించారు. ఈ స్కాంకు సంబం ధించి ఎపి బెవరేజెస్ నాటి ఎండి వాసుదేవరెడ్డితోపాటు కీలక సూత్రధారిగా వ్యవహరించిన రాజ్ కసిరెడ్డిని, కారుమూరి నాగేశ్వరరావు తనయుడు సునీల్ రెడ్డిని ఇదివరకే అరెస్టు చేయగా తాజాగా నాగేశ్వరరావును అరెస్టు చేసినట్లు ఈడీ వెల్లడించింది. మద్యం రవాణా కుంభకోణంలో కారు మూరి నాగేశ్వరరావు ఒక ముఠాను ఏర్పాటుచేసి సర్కారు ఖజానాకు 195.33 కోట్ల రూపాయల మేరకు నష్టం కలిగించారని ఇడి పేర్కొంది. ఈ స్కాంలో కొల్లగొట్టిన డబ్బులో 11.95 కోట్ల రూపాయ లు కారుమూరి ఖాతాలో వెల్లిందని, దీంతో పాటు 18.09 కోట్ల రూపాయలు మనీలాండరింగ్ జరిగిందని ఈడీ పేర్కొంది. కారుమూరి అప్పట్లో మంత్రిగా వుండడం, రాజకీయంగా బలంగా వుండడంతో అక్రమాలకు పాల్పడ్డాడని ఈడీ పేర్కొంది. తన ఖాతాలో వచ్చిన డబ్బులతో కారుమూ రి పాత అప్పులను తీర్చడంతో పాటు పెద్దఎత్తున స్థిరచరాస్తులను కొన్నట్లు ఈడీ తెలిపింది. తన పుట్టిన రోజు వేడుకలను ఈ డబ్బులతోనే ఘ నంగా జరుపుకున్నాడని, ఖరీదైన వాచీలు కొనడంతో పాటు విమానాల్లో అనేక ప్రాంతాలకు పర్యటించినట్లు ఈడీ తెలిపింది. ఇక ఈ కేసులో కీ లకంగా వ్యవహరించిన రాజ్ కసిరెడ్డి నెలకు 50 నుంచి 60 లక్షల రూపాయల వరకు తీసుకునే వాడని ఈడీ వెల్లడించింది. ఈ కేసులో మొ దట అనుమానితుడుగా కారుమూరి నాగేశ్వరరావుకు పది నోటీసులు ఇచ్చామని, అయితే ఆయన విచారణకు రాకుండా కేసు ముందుకు సాగకుం డా, విచారణ జరగకుండా చూసేందుకు తన పలుకుబడిని వాడారని, తప్పించుకు తిరిగారని ఈడీ కోర్టుకు తెలిపింది. మద్యం అక్రమ రవాణా లో సంపాదించిన డబ్బులను తన కుటుంబ సభ్యుల ఖాతాల్లోకి మళ్లించడంలో కారుమూరి పాత్ర వుందని ఈడీ పేర్కొంది. మద్యం అక్రమ రవాణాలో పలువురికి కారుమూరి సబ్ కాంట్రాక్టులు ఇప్పించి అందులో 50 శాతం వాటా పొందాడని, ఇలా సంపాదించిన డబ్బులను కారుమూ రి కుమారుడు సునీల్ రెడ్డి, భార్య కీర్తి, మామ ప్రతాప్ రెడ్డి, తల్లి కారుమూరి లక్ష్మి కిరణ్, సోదరి దీపికా, ఆమె మామ అచ్చప్ప రామూర్తిల బ్యాంకు ఖాతాలకు మళ్లించినట్లు ఈడీ తన రిమాండు రిపోర్టులో వెల్లడించింది. తాను అక్రమంగా సంపాదించిన సొమ్ముతో కారుమూరి నాగేశ్వరరావు మైనింగ్ లీజు హక్కులను పొందాడని ఈడీ పేర్కొంది. మద్యం రవాణాలో ఒక్కో మద్యం కేసుపై కిలోమీటర్‌కు 13 రూపాయల చొప్పున దోచుకున్నారని, సిగ్మా నుంచి తన ముసుగు కంపెనీ అయిన సుదర్శన్ కన్‌స్ట్రక్షన్ పేరిట కారుమూరి సబ్ కాంట్రాక్ట్ పొందాడని ఈడీ తెలిపింది. ఇందులో వచ్చిన ఆదాయంలో 85 శాతం కారుమూరి కుటుంబానికి, మిగతా 15 శాతం సుదర్శన్ కన్‌స్ట్రక్షన్ కు వచ్చేలా ఒప్పందం రాసుకునా న్నరని ఈడీ తెలిపింది. సబ్ కాంట్రాక్ట్ పనులన్నీ కారుమూరితో పాటు ఆయన తనయుడు సునీల్ రెడ్డి అతని అనుచరులు చూసుకున్నారని ఇడి తెలిపింది. సబ్‌కాంట్రాక్ట్ వచ్చేలా చేసినందుకు రాజ్ కసిరెడ్డికి నెలకు 60 లక్షల రూపాయలు చెల్లించారని ఈడీ తెలిపింది. ఈ చెల్లింపులను సుదర్శన్ కన్‌స్ట్రక్షన్ ప్రతినిధి సందీప్ ద్వారా జరిగాయని ఈడీ వెల్లడించింది. ఈ గోల్‌మాల్ వ్యవహారంలో మరింత లోతుగా విచారించాల్సి వుందని ఇడి కోర్టుకు తెలిపింది.

## అక్రమ నిర్మాణాల నిర్మూలనకు బిల్డింగ్ ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలి

### సిఎం రేవంత్‌రెడ్డికి ఫోరం ఫర్ గుడ్‌గవర్నెన్స్ లేఖ

**హైదరాబాద్, ఆగస్టు 25, ప్రభాతవార్త:** రాష్ట్రంలో లక్షల సంఖ్యలో వున్న అక్రమ భవనాలను సమూలంగా నిర్మూలించేందుకు బిల్డింగ్ ట్రిబ్యున ల్ బిల్డింగ్ ఏర్పాటు చేయడం ఒక్కటే పరిష్కారమని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ పేర్కొంది. ఈ ట్రిబ్యునల్ ఏర్పాటుకు 2022లో హైకోర్టు ఆదే శాలు ఇచ్చినా ఇప్పటి వరకు పట్టించుకోక పోవడం విడ్డూరంగా వుందని సంస్థ కార్యదర్శి ఎం. పద్మనాభ రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన సి ఎం రేవంత్ రెడ్డికి మంగళవారం ఒక లేఖ రాశారు. మాదాపూర్‌లోని అంజయ్య నగర్‌లో 48 గజాల స్థలంలో వెలిసిన ఏడంతస్తుల భవనం కుప్పకూలగా ఇద్దరు కూలీలు మరణించిన ఉదంతం కలచి వేసిందని, ఇటువంటి నిర్మాణాలు రాష్ట్రంలో లక్షల సంఖ్యలో వున్నాయని ఆయన తె లిపారు. వీటి తొలగింపుకు అధికారులు నోటీసులు ఇస్తే భవన యజమానులు కోర్టుల నుంచి స్టే పొందుతూ పనులు కొనసాగిస్తున్నారని ఆయన తెలిపారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం 2016లో బిల్డింగ్ ట్రిబ్యునల్ ఏర్పాటు చేయగా, దీనికి ఇప్పటి వరకు ఛైర్మన్‌ను ఇతర స భ్యులను నియమించలేదని ఆయన తెలిపారు. బిల్డింగ్ ట్రిబ్యునల్ వుంటే అక్రమ నిర్మాణాల విషయంలో న్యాయస్థానాలు జోక్యం చేసుకునే వీ లుండదని పద్మనాభ రెడ్డి తెలిపారు. ఇదే విషయమై తమ సంస్థ 2022లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా దీనికి స్పందించిన ఉన్నత న్యాయస్థానం అదే ఏడాది ఏప్రిల్ 27వ తేదీన ఉత్తర్వులు ఇస్తూ నాలుగు వారాల్లో బిల్డింగ్ ట్రిబ్యునల్‌లో అందరు సభ్యులు వుండాలని, నాటి ప్రభుత్వాన్ని ఆదేశించిందని పద్మనాభ రెడ్డి తెలిపారు. అయితే ఇప్పటి వరకు ఇది అమలు జరగలేదని ఆయన తెలిపారు. తాజా ఘటన తరువాతైనా సర్కారు వెంటనే స్పందించి రాష్ట్ర వ్యాప్తంగా లక్షల సంఖ్యలో గల అక్రమ భవనాలను నిర్మూలించేందుకు వెంటనే బిల్డింగ్ ట్రిబ్యునల్ ను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

## కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీ రిటైర్ కాబోతున్నారా!



**నాగ్‌పూర్, ఆగస్టు 25:** తాజాగా ఆయన చేసిన వ్యాఖ్యలు అందుకు సంకేతమేనా అనే చర్చ జరుగుతోంది. దీనిపై ఆయన కార్యాలయం స్పం దించి, స్పష్టతనిచ్చింది. రాజకీయాల నుంచి రిటైర్ అవ్వాలనుకుంటున్నారనే ప్రచారంలో నిజం లేదని వెల్లడించింది. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఈ ఆదివారం, అంటే 23వ తేదీ తన సొంత ప్రాంతమైన మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్నారు. లక్ష్మణ్‌రావ్ మన్కర్ ట్రస్ట గడ్కరీ స్థాపించిన సంస్థ కార్య క్రమంలో పాల్గొన్నారు. ఇది ఎకాల్ విద్యాలయాస్ పేరుతో గిరిజన ప్రాంతాల్లో విద్యాసంస్థల్ని నిర్వహిస్తుంటుంది. ఈ ట్రస్టుకు సంబంధించిన కార్యక్రమంలో నితిన్ గడ్కరీ మాట్లాడారు. నేను ఎంతో కాలం పని చేయలేను. కాబట్టి, యువతకు ఎక్కువ అవకాశాలు ఇవ్వాల్సిందిగా కోరుతున్నా. ఇప్పుడు చాలా మంది యువత ఉన్నారు. పెద్దవారు వారికి మార్గనిర్దేశకత్వం చేస్తున్నార్హు అంటూ వ్యాఖ్యానించారు. తాను ఎక్కువ కాలం పని చేయలేనని, కొత్త వారికి అవకాశాలు ఇవ్వా లంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా చర్చకు దారితీశాయి. రాజకీయాల నుంచి నితిన్ గడ్కరీ తప్పుకోవాలి అనుకుంటున్నారని, కొత్త వారికి అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారని, మంత్రి పదవి నుంచి తప్పుకొంటారని ప్రచారం మొదలైంది. పైగా త్వరలో మోడీఆధ్వర్యంలోని ఎన్‌డీయే ప్రభుత్వంలో మంత్రివర్గంలో జరగనుందనే ప్రచారం కూడా తోడైంది. దీంతో కొత్త మంత్రివర్గంలో గడ్కరీకి చోటు ఉండక పోవచ్చని ప్రచారం జరిగింది. అయితే, ఈ అంశంపై ఇప్పుడు గడ్కరీ కార్యాలయం స్పందిం చింది. ఆయన రాజకీయాల నుంచి తప్పుకొంటారు అనే ప్రచారంలో నిజం లేదని వెల్లడించింది. గడ్కరీ చేసిన వ్యాఖ్యలు ఆయన ట్రస్టుకు వర్తిస్తాయని, రాజకీయాలకు కాదని పేర్కొంది. తన ట్రస్టు వ్యవహార్ని యువతకు ఇవ్వాల నుకుంటున్నారని స్పష్టం చేసింది. దీంతో ఈ ప్రచారానికి తెరపడినట్లైంది.

## హైకోర్టులో పిటిషన్ వేసిన మంత్రి కొండా సురేఖ మాజీ ఒఎస్‌డి

**హైదరాబాద్, ఆగస్టు 25, ప్రభాతవార్త:** కాంట్రాక్టర్‌ను కిడ్నాప్ చేసి, తీవ్రంగా దాడిచేయడంతో పాటు పది కోట్ల రూపాయలు డిమాండ్ చేసినం దుకు జూబ్లీహిల్స్ పోలీసు స్టేషన్‌లో నమోదైన కేసులో నిందితుడుగా వున్న మంత్రి కొండా సురేఖ మాజీ ఓఎస్‌డి సుమంత్ మంగళవారం హై కోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. ఈ కేసులో బాధితుడు హరికృష్ణ ఫిర్యాదు మేరకు మేడిపల్లి పోలీసు స్టేషన్‌లో జీరో ఎఫ్ఐఆర్‌గా కేసు నమో దు కాగా ఆ తరువాత ఈ ఘటన జరిగిన జూబ్లీహిల్స్ పోలీసు స్టేషన్‌కు బదిలీ చేశారు. ఈ కేసులో సుమంత్ డ్రైవర్ సహా నలుగురిని అరెస్టు చేయడం తెలిసిందే. సుమంత్ కోసం తెలుగు రాష్ట్రాల్లో పోలీసులు గాలిస్తుండడం విదితమే. ఈ కేసు విచారణలో నిర్లక్ష్యం వహించిన జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్ ముత్తు యాదవ్‌ను ఉన్నతాధికారులు మంగళవారం సస్పెండ్ చేయడం సంచలనం రేపింది. కాంట్రాక్టర్ హరికృష్ణ కిడ్నాప్ కేసులో నిందితుడుగా వున్న సుమంత్ కోసం పోలీసులు ఓవైపు గాలిస్తుండగా ఇదే సమయంలో తనను పోలీసులు అరెస్టు చేయకుండా రక్షణ కల్పించాలని కోరుతూ సుమంత్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. దీనిపై వచ్చే సోమవారం విచారణ జరగనుంది.

## ఎంపి ధర్మపురి అర్వింద్‌పై ఎలాంటి నిఘా లేదు

### 'ఎక్స్'లో వెల్లడించిన డిజిపి ఆనంద్

**హైదరాబాద్, ఆగస్టు 25 ప్రభాతవార్త:** సిఎం రేవంత్ రెడ్డి సోదరుడి ఆదేశాల మేరకు పోలీసులు తనపై నిఘా వుంచినట్లు నిజామాబాద్ ఎంపి ధర్మపురి అర్వింద్ చేసిన వ్యాఖ్యలను డిజిపి సి.వి ఆనంద్ ఖండించారు. సిఎం సోదరుడి ఆదేశాల మేరకు ఎసిపి స్థాయి అధికారితో పోలీసు శాఖ తనపై నిఘా వుంచిందని, దీనివల్ల తాను ఇబ్బందులు పడుతున్నానని, ఈ విషయమై విచారించి చర్యలు తీసుకోవాలని ఎంపి అర్వింద్ డి జిపి ఆనంద్‌ను ఎక్స్‌లో కోరడం తెలిసిందే. దీనికి బదులుగా డిజిపి ఆనంద్ కూడా ఎక్స్ వేదికగా ఎంపి అర్వింద్‌కు సమాధానం ఇచ్చారు. పో లీసు శాఖలో ఇలాంటివి వుండవని, అయినప్పటికీ దీనిపై విచారణ జరిపి ఏమీ లేదని నిర్ధారించినట్లు తెలిపారు. రాష్ట్ర పోలీసు శాఖ ఇటువంటి నిఘా పద్ధతులను ఏనాడు అనుసరించలేదని, రాజ్యాంగబద్ధమైన విధులకు మాత్రం కట్టుబడి వుందని డిజిపి ఆనంద్ తెలిపారు. ఈ విషయం లో ఎంపి అర్వింద్ వద్ద ఏమైనా నిర్దిష్టమైన ఆధారాలు లేదా సమాచారం వుంటే తనకు వ్యక్తిగతంగా అందజేయవచ్చని, వీటి ఆధారంగా పూ ర్తిస్థాయిలో విచారణ చేస్తామని డిజిపి హామీ ఇచ్చారు.

## ఏడుగురు నాన్‌కేడర్ ఎస్‌పిలకు ఐపిఎస్ హోదా

**హైదరాబాద్, ఆగస్టు 25, ప్రభాతవార్త:** రాష్ట్ర పోలీసు శాఖలో నాన్‌కేడర్ ఎస్‌పిలుగా వున్న ఏడుగురు గ్రూప్ వన్ అధికారులకు కేంద్ర హోం శాఖ ఐపి ఎస్ హోదా కల్పించింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో పనిచేస్తున్న పులి గిల్ల రవీందర్, శ్రీబాలాదేవి, అరవింద్ బాబు, మహేంద్ర నాయక్, సాయిశ్రీ, పూజ, పుల్ల కరుణాకర్‌లకు ఐపిఎస్ హోదా లభించింది. వీరికి త్వరలోనే కొత్తచోట్ల పోస్టింగులు రానున్నాయి. పోలీసు శాఖలో ఐపిఎస్ కేడర్‌కు సం బంధించి 33 శాతం నాన్‌కేడర్ ఎస్‌పిలకు రిజర్వ్ చేయబడడం తెలిసిందే. ఈ 33 శాతం పోస్టులను గ్రూప్ వన్ అ ధికారులతో పాటు కొన్ని ప్రత్యేక సందర్భాలలో ఎస్ఐ నుంచి ఉన్నతస్థాయికి ఎదిగిన వారికి ఇస్తుంటారు. ఇటీవల కాలంలో ఎస్ఐ నుంచి నాన్‌కేడర్ ఎస్‌పి వరకు పదోన్నతి అందు కున్న పలువురు ఐపిఎస్ హోదా అందుకోవడం గమనార్హం. అయితే ఎ.వెంకటేశ్వరరావు అనే అధికారి మాత్రం పోలీసు శాఖలో ఎస్ఐగా చేరి నాన్‌కేడర్ ఎస్‌పిగా వుంటూ ఐపిఎప్ అందుకుని ఆ తరువాత డిఐజి హోదా కూడా అందుకున్నారు. ఎస్ఐ స్థాయి నుంచి డిఐజి వరకు పదోన్నతి అందుకున్న ఏకైక అధికారి దేశంలో ఆయన ఒక్కరే కావడం గమనార్హం.

## ధాన్యం పొలం నుంచి గాదెలోకి విధానం

### కొనుగోలు కేంద్రాల్లో డిజిటల్ తూకాలు, గ్రెయిన్ డ్రయర్లు వంటి ఆధునిక మౌలిక వసతులు
### పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర

**హైదరాబాద్, ఆగస్టు 25, ప్రభాతవార్త:** వ్యవసాయ ఉత్పత్తులసేకరణలో శాస్త్రీయ విధానం అమలు చేసేందుకు 'ధాన్యంను పొలం నుంచి గాదెలోకి' అనే కొత్త సరళిని ఆచరించేందుకు చర్యలు చేపట్టామని పౌరసరఫరాలశాఖ కమీషనర్ ఎం స్టీఫెన్ రవీంద్ర ప్రకటించారు. ఖరీఫ్ 2026-27 ధాన్యం కొనుగోళ్ల వ్యూహం ఖరారు చేసేందుకు వ్యవసాయ నిర్మాణ కమీషనర్ కార్యదర్శి, సురేంద్ర మోహన్, సెర్ప్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, దివ్య దేవరాజన్, టిజిఎస్‌డబ్ల్యుసి మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మీ డాక్టర్. బి. గోపి, మార్క్‌ఫెడ్ అధికారి రాహుల్‌రాజ్ సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డైరెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ మంగళవారం సివిల్ సప్లైస్ భవన్‌లో ఉన్నతాధికారులతో ఒక ముఖ్యమైన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా స్టీఫెన్ మాట్లాడుతూ ధాన్యం నిల్వ చేయడానికి, రవాణా చేయడానికి కావాల్సి న ఏర్పాట్లతోపాటు కొనుగోలు కేంద్రాలలో డిజిటల్ తూకాలు, గ్రెయిన్ డ్రయర్లు వంటిఆధునిక మౌలిక వసతుల కల్పన వంటి అంశాలపై అధికారులు ఒక స్పష్టమైన ప్రణాళికను సిద్ధం చేసుకొన్నామని తెలిపారు. రైతుల నుంచి వచ్చే ధాన్యాన్ని నిల్వ చేయడానికి తగినంత స్థలం ఉండేలా చూడాలని పౌర సరఫరాల శాఖ నిర్ణయాన్ని అధికారులకు వివరించి ఇంకా ఎక్కడైనా ధాన్యం నిల్వ చేసే మార్గాలను కూడా అన్వేషించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గోదాములను, ఇతర అనుకూలమైన నిల్వ ప్రదేశాలను గుర్తించి సిద్ధంగా ఉంచాలని జిల్లా కలెక్టర్లను కూడా కోరడం జరిగిందని వివరించారు. గోదాములతో పాటు మార్కెట్ యార్డులు, ఖాళీగా ఉన్న ఇండస్ట్రియల్ షెడ్లు, ఫంక్షన్ హాళ్లు, ఓపెన్ స్పేస్‌లు, క్యాప్ స్టోరేజీలను ఉపయో గించుకునే ఆలోచనను కమీషనర్ ప్రతిపా దించారు. ప్రస్తుతం గోదాముల్లోని పాత స్టాక్ వేగంగా ఖాళీ చేసి, కొత్త ధాన్యం కోసం స్థలం సిద్ధం చేయనున్నారు. వ్యవసాయ శాఖ, మార్క్‌ఫెడ్ కూడా తమ గోదాములను ఖాళీ చేసి సిద్ధంగా ఉంచుతామని కమిషనర్‌కు హామి ఇచ్చారు. కొనుగోళ్లు మొదలయ్యే సమయానికి కావాల్సినంత స్థలం అందుబాటులో ఉంటుందని వారు భరోసా ఇచ్చారు.



## అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లర్ అరెస్టు

### కోటి 25 లక్షల విలువైన 251 కిలోల గంజాయి, ద్విచక్రవాహనం, రూ. 9వేల నగదు, సెల్‌ఫోన్ స్వాధీనం

**ఉమ్మడి వరంగల్ బ్యూరో, ఆగస్టు 25, ప్రభాతవార్త:** వరంగల్ పోలీస్ కమిషన రేట్ పరిధిలో యువతను మత్తుపదార్థాలకు బానిసలుగా మారకుండా వారి భవిష్యత్తును కాపాడటంతోపాటు, గంజాయి, ఇతర మత్తు పదార్థాల విక్ర యాలకు పాల్పడే వారిని నియంత్రించడంపై పోలీసులు ప్రత్యేక దష్టి పెట్టారు. ఈస్ట్‌జోన్ డిసిపి అంకిత్‌కుమార్ అధ్వర్యంలో దామెర పోలీసులు అంతర్ రాష్ట్ర గంజాయి స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న నిందితుడుని అదుపులోకి తీసుకొని విచారించగా గంజాయి కొనుగోలు, విక్రయాలకు సంబంధించి కీలక వివరాలను వెలుగులోకి వచ్చాయి. నిందితుడు హన్మకొండ జిల్లా దామెర మండలం లోని పులుకుర్తికి చెందిన ముదిగొండ నాగేశ్వర్‌రావు (55) తనకున్న నెట్‌వర్క్ ద్వారా ఒడిశా రాష్ట్రానికి చెందిన రమేష్, సుధాకర్ వద్ద తక్కువ ధరకు గంజాయి కొని తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన నిందితులు ఉర్దు, రాందాస్ శేషరావు బీరదార్ , అక్లీం, షారుఖ్‌ఖాన్, షేక్‌అక్బర్, నునావత్ రాజుల ద్వారా ఎక్కువ ధరకు విక్రయిం చినట్లుగా ప్రాథమిక విచారణలో వెల్లడైంది. పోలీసులు నిందితుడి ఇంటి నుండి కోటి 25లక్షల రూపాయల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేపట్టడంతోపాటు నిందితుడు నాగ్వేశ్వర్‌రావు నుండి గంజాయి కొనుగోలు చేసిన మిగితా రాష్ట్రాల నిందితులను పట్టుకొనేందుకు ప్రత్యేక టీంలను ఏర్పాటు చేశారు.

## సారంపల్లి మల్లారెడ్డి భౌతికకాయానికి పిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ నివాళి

**హైదరాబాద్ ఆగస్టు 25, ప్రభాతవార్త:** రైతుల ప్రయోజనం కోసం అనేక ఉద్య మాలు నిర్వహించిన సారంపల్లి మల్లారెడ్డి గొప్పదార్శనికుడని ఎన్నో వ్యవసాయ సంస్కరణలకు ఆయన ఆలోచనలు దిక్సూచిగా నిలిచాయనీ టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. మంగళవారం సారంపల్లి మల్లారెడ్డి భౌతిక దేహానికి పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ నివాళులర్పించారు. మల్లారెడ్డి భౌతికదేహాన్ని సందర్శించిన ఆయన పుష్పాం జలి ఘటించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మృతిపట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేసిన మహేశ్‌కుమార్‌గౌడ్.. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్ ముత్తుయాదవ్‌పై సస్పెన్షన్ వేటు

### మంత్రి మాజీ ఒఎస్డీ వ్యవహారంలో సస్పెండ్ చేసిన ఉన్నతాధికారులు

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), ఆగస్టు 25, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్ ముత్తు యాదవ్‌ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. జూబ్లీహిల్స్ ఠాణాలో విధులు స్వీకరించిన 25 రోజుల్లోనే ఆరోపణల నేపథ్యంలో వేటు వేయడం గమనార్హం. వివరాల్లోకి వెళితే.. మంత్రి కొండా సురేఖ మాజీ ఓఎస్డీ నార్ల సుమంత్‌తోపాటు అతని అనుచరులు గత నెల 30న జూబ్లీహిల్స్ రోడ్ నంబరు 2లోని ఒక కార్యాలయంలో చెంగిచెర్ల ప్రాంతానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి గొంగిడి హరికృష్ణపై ఇనుప రాడ్లు, కర్రలతో తీవ్రంగా దాడి చేశారు. అదే రోజు జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్‌గా ముత్తుయాదవ్ బాధ్యతలు స్వీకరించారు. ఉన్నతాధికారుల ద్వారా జూబ్లీహిల్స్‌లోని కార్యాలయంలో గొడవ జరగిందన్న విషయం తెలుసుకున్న ఇన్‌స్పెక్టర్ వెంటనే తన సిబ్బందిని అప్రమత్తం చేశాడు.


సస్పెన్షన్‌కు గురైన ముత్తుయాదవ్

పెట్రోకార్-3 సిబ్బంది సంఘటన జరిగిన ప్రాంతానికి చేరుకున్నారు. అక్కడ గాయపడిన హరికృష్ణతోపాటు మరో అయిదారుగురిని జూబ్లీహిల్స్ ఠాణాకు తీసుకొచ్చారు. ఈ క్రమంలోనే వారందరితో ఇన్‌స్పెక్టర్ తన క్యాబిన్ దాదాపు రెండు గంటల పాటు మాట్లాడారు. తీవ్ర గాయాలపాలైన హరికృష్ణను ఇన్‌స్పెక్టర్ ప్రాథమికంగా ఆసుపత్రికి పంపలేదు. దీనికితోడు రెండు గంటల పాటు అక్కడే ఉంచి అనంతరం జీడిలో న్యూసెన్స్ కేసు పేరుతో నమోదు చేశారు. ఈ వ్యవహారంలో ఎలాంటి కేసు నమోదు చేయలేదు. దీనికితోడు దాడి చేసిన వారిలో ఒకరైన పసుపులేటి కార్తిక్ కుమార్ నుంచి హరికృష్ణకు వ్యతిరేకంగా ఫిర్యాదు స్వీకరించినట్లు తెలుస్తుంది. కాగా రాత్రి పొద్దుపోయిన తరువాత హరికృష్ణకు సంబంధించిన లాయర్ ఠాణాకు రావడంతో, మరుసటి ఉదయం 10 గంటలకు హాజరుకావాలంటూ చెప్పి అక్కడి నుంచి పంపించారు.

తీవ్ర గాయాలపాలైన హరికృష్ణ నేరుగా గాంధీ ఆసుపత్రికి వెళ్లడంతో ఆసుపత్రి సిబ్బంది మెడికో లీగల్ కేసు(ఎమ్మెల్సీ) కింద జూబ్లీహిల్స్ పోలీసులకు సమాచారం అందించారు. అయినప్పటికి ఇన్‌స్పెక్టర్ ఈ కేసుపై పెద్దగా దృష్టి పెట్టలేదు. దీంతో బాధితుడు చేయి విరగడంతో అక్కడి నుంచి నేరుగా చెంగిచర్లలోని ఎస్వీస్ ఆసుపత్రికి వెళ్లి చేతికి పట్టీ వేయించుకున్నాడు. అది తగ్గకపోవడంతో ఈ నెల 10న ఉప్పల్‌లోని శ్రీ హెల్త్ ఆసుపత్రిలో చేయికి సర్జరీ చేయించుకన్నాడు. కోలుకున్న అతను నేరుగా మేడిపల్లి ఠాణాకు వెళ్లి అక్కడ ఠాణాలో ఫిర్యాదు చేయడంతో పోలీసులు మంత్రి కొండా సురేఖ మాజీ ఓఎస్డీ నార్ల సుమంత్‌తోపాటు అతని అనుచరులైన ప్రశాంత్, అరుణ్‌కుమార్‌రెడ్డి, కార్తిక్, మహేందర్‌రెడ్డి, రాము తదితరులు తనపై దాడి చేశారంటూ ఫిర్యాదు చేయడంతో హత్యాయత్నం కింద కేసు నమోదు చేశారు. కాగా ఈ కేసులో జూబ్లీహిల్స్ పోలీసులు ఇప్పటికే నిందితుల్లో ముగ్గురిని అరెస్ట్ చేశారు.


**GREATER VISAKHAPATNAM MUNICIPAL CORPORATION**

T.N.No.02/2026-27/CE/SE(P)/EE(PD-I)/GVMC/ Dt: 25.08.2026

Number of Works : 01 (One), Value of Works (ECV) : Rs.116.35 Crores

Downloading starting Date : 27.08.2026 @ 5.00 PM

Downloading End Date : 16.09.2026 @ 3.00 PM

Last date for Submission of bid : 16.09.2026 @ 5.00 PM

Further Details at http://www.apeprocurement.gov.in

O/o the Executive Engineer (PD-I) Division : 9848308824 Sd/- Commissioner



**FORM NO.14 [See Regulation 33(2)]**
**OFFICE OF THE RECOVERY OFFICER - I/II**
**DEBTS RECOVERY TRIBUNAL HYDERABAD (DRT 1)**
3rd Floor, Triveni Complex, Abids, Hyderabad-500001.

**DEMAND NOTICE**

NOTICE UNDER SECTIONS 25 TO 28 OF THE RECOVERY OF DEBTS & BANKRUPTCY ACT, 1993 AND RULE 2 OF SECOND SCHEDULE TO THE INCOME TAX ACT, 1961.

RC/278/2025 24-07-2026

The Karur Vysya Bank Limited
Versus
Sri.A. Sita Rama Rao A

To
(CD 1) Sri. A. Sita Rama Rao A Venkata Apparao S/O. Venkata Apparao, H.No.8- 2-293/82/F/B/17, Road No.7, Film Nagar, Jubliee Hills Hyderabad, Telangana.
(CD 2) Smt. Puspalatha W/O. A Sita Rama Rao, H.No.8- 2-293/82/F/B/17, Road No. 7, Film Nagar, Jubliee Hills, Hyderabad-500033.

1. This is to notify that as per the Recovery Certificate issued in pursuance of orders passed by the Presiding Officer, DEBTS RECOVERY TRIBUNAL HYDERABAD (DRT 1) in **OA/362/2024** an amount of **Rs.4197229.22 (Rupees Forty One Lakhs Ninety Seven Thousands Two Hundred Twenty Nine And Paise Twenty Two Only)** along with pendentellite and future interest @ 9.30 % Simple Interest Yearly w.e.f. **20/06/2024** till realization and costs of **Rs.85060 (Rupees Eighty Five Thousands Sixty Only)** has become due against you (Joinily and severally/ Fully/Limited).
2. You are hereby directed to pay the above sum within 15 days of the receipts of the notice, failing which the recovery shall be made in accordance with the Recovery of Debts Due to Banks and Financial Institutions Act, 1993 and Rules there under.
3. You are hereby ordered to declare on an affidavit the particulars of yours assets on or before the next date of hearing.
4. You are hereby ordered to appear before the undersigned on **17/09/2026 at 10:30 a.m.** for further proceedings.
5. In addition to the sum aforesaid, you will also be liable to pay:
(a) Such interests as is payable for the period commencing immediately after this notice of the certificate/execution proceedings.
(b) All costs, charges and expenses incurred in respect of the service of this notice and warrants and other processes and all other proceedings taken for recovering the amount due.

**Given under my hand and the seal of the Tribunal, on this date: 24/07/2026.**

Recovery Officer
DEBTS RECOVERY TRIBUNAL HYDERABAD (DRT 1)


## రైతు నేత సారంపల్లికి అశ్రునివాళి


సారంపల్లి మల్లారెడ్డి భౌతికకాయానికి నివాళులు అర్పించిన పిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ తదితరులు

**హైదరాబాద్ (చిక్కడపల్లి) ఆగస్టు 25, ప్రభాతవార్త :** అఖిల భారత కిసాన్ సభ జాతీయ ఉపాధ్యక్షుడు, సీపీఎం సీనియర్ నాయకుడు, ప్రముఖ రైతు ఉద్యమ నేత సారంపల్లి మల్లారెడ్డి (88) భౌతికకాయానికి పలువురు ప్రముఖులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు, అభిమానులు మంగళవారం ఘనంగా నివాళుల ర్పించారు. అనారోగ్య కారణాలతో నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం వేకువజామున కార్డియాక్ అరెస్టుతో ఆయన కన్నుమూసిన సంగతి తెలిసిందే. మంగళవారం ఉదయం 8 గంటల నుంచి ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని సీపీఎం రాష్ట్ర కార్యాలయం ఎంబీ భవన్‌లో ప్రజల సందర్శనార్థం ఆయన భౌతిక కాయాన్ని ఉంచారు. నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి పూలమాలలు వేసి అశ్రునయనాలమధ్య నివాళులర్పిం చారు. టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ఎంబీభవన్‌కు చేరుకుని మల్లారెడ్డి పార్థివదేహానికి పుష్పాంజలి ఘటిం చారు. ఆయన సేవలను స్మరించు కుంటూ, సారాంపల్లి సతీమతి భాగ్యలక్ష్మి, కుమారులు వాసుదేవ్‌రెడ్డి, మధు సూదన్ రెడ్డిలను ఓదార్చారు. ఈ కష్టసమయంలో మల్లారెడ్డి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ పూర్తి అండగా ఉంటుం దని హామీ ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో త్వరలో నిర్వహించబోయే మల్లారెడ్డి సంతాప సభకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా హాజరవుతారని వెల్లడించారు. మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డిలతో కలిసి మల్లారెడ్డికి పూల మాల వేసి నివాళులర్పించారు. జీవితాంతం రైతాంగ హక్కుల కోసం పోరాడిన మల్లారెడ్డి మృతి దేశ రైతాంగ ఉద్యమానికి, సీపీఐ(ఎం) పార్టీకి, ఉమ్మడి వరంగల్ జిల్లాకు తీరని లోటని కడియం శ్రీహరి అన్నారు.

**ఘనంగా అంతిమయాత్ర.. గాంధీ ఆస్పత్రికి దేహదానం**

మధ్యాహ్నం 12 గంటలకు ఎంబీ భవన్ నుంచి సికింద్రాబాద్‌లోని గాంధీ హాస్పిటల్ వరకు మల్లారెడ్డి అంతిమయాత్ర సాగింది. మల్లారెడ్డి ముందస్తు సంకల్పం కుటుంబ సభ్యుల అంగీకారం మేరకు వైద్య విద్యార్థుల పరిశోధనల నిమిత్తం ఆయన భౌతికకాయాన్ని గాంధీ మెడికల్ కాలేజీ అధిపతులకు అందజేశారు.

**తరలివచ్చిన ప్రజాప్రతినిధులు, వామపక్ష నేతలు**

నివాళులర్పించిన వారిలో సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బి.వి.రాఘవులు, సీపీఎం తెలంగాణ, ఏపీ రాష్ట్ర కార్యదర్శులు జాన్ వెస్లీ, వి.శ్రీనివాసరావు,

### గాంధీ ఆస్పత్రికి దేహదానం.. ముగిసిన అంతిమయాత్ర
### సంతాప సభకు హాజరుకానున్న సిఎం రేవంత్‌రెడ్డి


సీపీఎం రాష్ట్ర నాయకులు వీరయ్య, మాజీ ఎంపీ తమ్మినేని వీరభద్రం, పశ్య పద్మ, ఆమ్ ఆద్మీ పార్టీ నేత డాక్టర్ డి.సుధాకర్, సీపీఐ నగర నాయకుడు బి.వెంకటస్వామి గౌడ్, అఖిల భారత కిసాన్ సభ ప్రధాన కార్యదర్శి విజూకృష్ణన్, పి.కృష్ణప్రసాద్, బీఆర్‌ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, శాసనమండలి సభ్యుడు ప్రొఫెసర్ కోదండరామ్, మాజీ ఎమ్మెల్యేలు జూలకంటి రంగారెడ్డి, ఎర్రబెల్లి దయాకర్ రావు, ఎం.కోదండరెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, పూర్వ కార్యదర్శి చాడ వెంకట్ రెడ్డి, ఎమ్‌సీపీఐ(యు) నాయకుడు మద్దికాయల అశోక్, ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి, రైతు సంఘం నాయకులు టి.సాగర్, స్కైలాబ్ బాబు, పైళ్ల ఆశయ్య, సీపీఎం రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి బాబురావు తదితరులు ఉన్నారు. మల్లారెడ్డి మృతి పట్ల మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సహా పలువురు ప్రముఖులు తీవ్రసంతాపం వ్యక్తం చేశారు.

మితభాషి ఎక్కువగా వినగలుగుతాడు కనుక అతనే అధికంగా నేర్చుకుంటాడు.

- లాబ్ సాంగ్‌రపా


# ఉల్లికి పాట్లు!

ఈ భూప్రపంచం మీద 'వాన రాకడ ప్రాణంపోకడ' గురించి చెప్పగలిగే ఆధునిక శాస్త్ర పరిజ్ఞానం పెరుగుతూనే ఉంది. కానీ మార్కెట్లోకి 'ఉల్లి రాకడ ధరల పోకడల' గురించి చెప్పే ఏ శాస్త్రము అందుబాటులో లేదు. ప్రకృతి వైపరీత్యాల నేపథ్యంలో వ్యవసాయ శాస్త్రజ్ఞుల అంచనాలు కూడా తారుమారవుతున్నాయి. ఆధునిక పరిజ్ఞానం ఉపయోగపడక ఉల్లిధరల విషయంలో ఎప్పుడూ ఒక అడుగు వెనకాలకే ఉంది. ఒక సీజన్లో ఉల్లిధర పెరిగితే, మరో సీజన్లో ఉల్లి ధర తగ్గుతుంది. ఈ రెండింటి మధ్య సమతుల్యం చేసుకోలేక ఉల్లి రైతు సతమతమవుతున్నాడు. ఉల్లి సాగుకు దూరమౌతున్నాడు. నిన్నమొన్నటి వరకు రైతుకు గిట్టుబాటుధర లేకమార్కెట్ యార్డుల్లోనే ఉల్లిని వదిలేసే పరిస్థితి ఉండగా, నేడు అదే ఉల్లి వినియోగదారుడి జేబుకు చిల్లుపెడుతోంది. ఉల్లి ధర మళ్లీ సామాన్యుడి వంటింట్లో మంటలు రేపుతోంది. లోపభూయిష్టమైన వ్యవసాయ మార్కెట్ వ్యవస్థ తెచ్చిపెట్టే అనర్థమిది. ప్రస్తుతం దేశంలోని ప్రధాన ఉల్లి మార్కెట్లలో సరఫరా తగ్గడం, ప్రతికూల వాతావరణ పరిస్థితులు, రవాణా సమస్యలు వంటి కారణాలు ధరల పెరుగుదలకు దారితీస్తున్నాయి. పంటసాగు విస్తీర్ణం తగ్గడం, రుతుపవనాలు ఆలస్యం కావడం వంటివి దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపాయి. దేశంలోనే అతిపెద్ద ఉల్లి ఉత్పత్తిదారు మహారాష్ట్రలో ఈసారి ఖరీఫ్ పంట దిగుబడి 5 నుంచి 7శాతం వరకు తగ్గడమే ఈధరల పెరుగుదలకు ప్రధాన కారణంగా మార్కెట్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఒక సీజన్‌లో ధరలు పడిపోతే రైతు నష్టపోతాడు. మరుసటి సీజన్‌లో రైతులు సాగు తగ్గిస్తే తగిన దిగుబడి లేకధరలు పెరుగుతాయి. ప్రధానంగాటమోటా, ఉల్లి విషయంలో ఏటా ధరల చక్రం ఇదేమాదిరి పునరావృతమవుతున్నా, శాశ్వత పరిష్కార మార్గం దొరకడం లేదు. ఉల్లి సంక్షోభం కేవలం ధరల సమస్య కాదు. ఇది వ్యవసాయ విధానాల వైఫల్యానికి అద్దం. దేశవ్యాప్తంగా ఉల్లి ధరలు అమాంతం పెరిగిపోయి సామాన్యుడికి చుక్కలు చూపిస్తుండటంతో, వాటిని అదుపులోకి తెచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం రంగంలోకి దిగింది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం బఫర్ స్టాక్‌లోని ఉల్లిని మార్కెట్‌కు తరలించేందుకు 'కందా ఎక్స్‌ప్రెస్'ను ప్రారంభించింది. ఇందులో భాగంగా, ఉల్లి బఫర్ నిల్వలను నాసిక్ నుంచి ఢిల్లీ, చెన్నై, కొచ్చి, గువాహటి వంటి నగరాలకు తరలించి సరఫరాను పెంచి ఆయా ప్రాంతాల్లో ధరలను అదుపు చేసే చర్యలు చేపట్టింది. ఇటువంటి అత్యవసర చర్యలు తాత్కాలికంగా మాత్రమే ధరలను నియంత్రిస్తాయి. కానీ ప్రతిసారీ సంక్షోభం వచ్చినప్పుడు బఫర్ స్టాక్ విడుదల చేయడం కంటే, ఉల్లి ఉత్పత్తి, నిల్వ, రవాణా, మార్కెటింగ్ వ్యవస్థను సమగ్రంగా బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. ఆంధ్రప్రదేశ్‌లోనూ పరిస్థితి ఆందోళనకరంగానే ఉంది. రాయలసీమలో వర్షాభావ పరిస్థితులతో ఉల్లిసాగు గణనీయంగా తగ్గింది. ఉల్లి ధరలు జూన్‌లో కిలోకు సుమారు రూ.25 నుంచి ఆగస్టులోరూ.60 వరకు పెరిగినట్లు తాజా నివేదికలు చెబుతున్నాయి. ఏప్రిల్‌లోనేఆంధ్రప్రదేశ్‌లో గిట్టుబాటు ధర లేక కొందరు రైతులు ఉల్లిబస్తాలను మార్కెట్ యార్డుల్లో వదిలేసిన ఘటనలు నమోదయ్యాయి. రైతు ఉత్పత్తి చేసినప్పుడు ధర లేదు. కొరత ఏర్పడినప్పుడు కూడా వినియోగదారుడికి గిట్టుబాటు ధర దక్కడం కష్టం. రైతుకు కనీస గిట్టుబాటు ధర, శాస్త్రీయ నిల్వ సదుపాయాలు, సమయానుకూల ప్రభుత్వ కొనుగోళ్లు అవసరం. వినియోగదారుడికి మాత్రం స్థిరమైన సరఫరా, పారదర్శక మార్కెట్ ధరలుకావాలి. రైతు వినియోగదారుల మధ్య ఉన్న మార్కెట్ గొలుసులో అనవసరమైన మధ్యవర్తిత్వం, నిల్వదారుల దోపిడీ, కృత్రిమకొరతకు అవకాశం లేకుండా పర్యవేక్షణ పెరగాలి. సాగు ఉత్పత్తులు పెంచడమే కాదు, ధరల స్థిరత్వం కూడా ప్రభుత్వ బాధ్యతే. ధరల అస్థిరతకు శాశ్వత పరిష్కారం కావాలి. ఒక సమతుల్య మార్కెట్ వ్యవస్థను నిర్మించాలి. రైతుకు న్యాయమైన ధర, వినియోగదారుడికి అందుబాటు ధర ఈ రెండింటినీ సాధించగలిగినప్పుడే వ్యవసాయమార్కెట్ విజయవంత మైనట్లవుతుంది. శనివారం నాటికి దేశంలో ఉల్లి సగటు రిటైల్ ధర కిలోకు రూ.42కి చేరింది. గతేడాదితో పోలిస్తే ఇది దాదాపు 45 శాతం, గత నెలతో పోలిస్తే 19 శాతం అధికం. ముఖ్యంగా ఢిల్లీలో కిలోఉల్లి ధర రూ. 65కి చేరగా (గతేడాది ఇదే సమయానికి రూ. 35), చెన్నైలో రూ. 58కి (గతేడాది రూ. 33) విక్రయిస్తున్నారు. కేరళ, అసోం రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో కూడా ధరలు గణనీయంగా పెరిగాయి. అధిక ధరలున్న మార్కెట్లలో సరఫరా పెంచి, ధరలు మరింతపెరగకుండా నిరోధించడమే తమ లక్ష్యమని వినియోగదారుల వ్యవహారాల శాఖ కార్యదర్శి నిధిఖరే ధృవీకరించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో నాఫెడ్, ఎన్‌సీసీఎఫ్ సంస్థలు సుమారు 1.2 లక్షల టన్నుల ఉల్లిని సేకరించాయని, ప్రభుత్వంతో పాటు రైతులవద్ద కూడా తగినన్ని నిల్వలు అందుబాటులో ఉన్నట్లు అధికారులు చెప్పేవివరణ. 'ధరలస్థిరీకరణ నిధి' కింద ప్రభుత్వం ఇలాంటి చర్యలు చేపట్టడంకొత్తేమీ కాదు. ఒక పక్క పశ్చిమాసియా యుద్ధ వాతావరణ నేపథ్యం దాదాపు అన్ని నిత్యావసర వస్తువులు, చమురు ధరలనేకాకుండా, తాజాగా చక్కెర ధరలను అందనంత ఎత్తుకు తీసుకుపోయింది. మహారాష్ట్రలో నిల్వ ఉండటున్న ఉల్లిలో 50-70శాతం దెబ్బతినడం కూడా ఉల్లి సరఫరాకు ఆటంకంగా ఉందని భోగట్టా. రాష్ట్రాల వ్యాపారులపై కేంద్రం స్టాక్ లిమిట్ నిర్దేశించడం, ఎగుమతులపై ఆంక్షలు, 40శాతం ఎగుమతి సుంకం విధించడం మంచిదేమో ఆలోచించాలి. అప్పుడే ఉల్లిధరల ఘాటు శాంతిస్తుంది. గతంలో 2024 అక్టోబర్‌లోనూ ఉల్లిధరల నియంత్రణకు ఇలాంటి ప్రత్యేక రైళ్లనే వినియోగించారు. ఏదైనా ఇలాంటి సందర్భాల్లో శాశ్వత పరిష్కారం మేలు.



మనలోని ప్రతిభను గుర్తించి దానిని వెలికితీసి రాణింపునకు తీసుకురావడానికి ప్రయత్నించేవారే మంచి మిత్రులు.

హెన్రీఫోర్డ్



ఈశతాబ్దాన్ని తప్ప మిగతా అన్నింటినీ, ఈ దేశాన్ని తప్ప మిగిలిన అన్ని దేశాలను ఉత్సాహంగా కీర్తించేవాడు మూర్ఖుడు.

సర్ విలియం గిల్బర్ట్

# రిజర్వేషన్లు తొలగిస్తే సమానత్వం వచ్చేస్తుందా?

*సామాజిక న్యాయం అంటే ఒకరిని తగ్గించడంకాదు, వెనుకబడిన వారిని పైకి తీసుకురావడం. అసలు ప్రశ్న ఉద్యోగాల సంఖ్యతోనే ముగియదు. ఎవరు విశ్వవిద్యాలయాల్లో ఉన్నారు? ఎవరు పరిశోధన చేస్తున్నారు? ఎవరు పరిపాలనలో నిర్ణయాలు తీసుకుంటున్నారు? ఎవరు విధానాలు రూపొందిస్తున్నారు? ఎవరి స్వరం మీడియా, న్యాయవ్యవస్థ, కార్పొరేట్ సంస్థలు, విద్యా సంస్థల్లో బలంగా వినిపిస్తోంది? ఇవన్నీ ప్రాతినిధ్యానికి సంబంధించినప్రశ్నలే. అందుకే దేశం ఇప్పుడు రిజర్వేషన్‌పై కేవలం ఉంచాలా? తొలగించాలా?"అనే ద్వంద్వ ప్రశ్నలో చిక్కుకోకూడదు. ఎవరికి ఇంకా అవకాశం లేదు? ఎవరి ప్రాతినిధ్యం ఇంకా తక్కు? ఎవరి స్వరం నిర్ణయ వ్యవస్థకు చేరడం లేదు? అన్నప్రశ్నలకు సమాధానం వెతకాలి. రిజర్వేషన్లను మెరుగుపరచాలి. అవసరమైన చోట సంస్కరించాలి. నిజంగా వెనుకబడినవారికి చేరేలా చేయాలి. కానీ సామాజిక అసమానత తొలగిపోయిందనే సాక్ష్యం లేకుండానే రిజర్వేషన్ తొలగించాలని చెప్పడం సామాజిక అసమానతల చరిత్రకు అకాల ముగింపు పలకడమే అవుతుంది.*

దుంప్రా కుమారస్వామి

జంతర్ మంతర్‌లో 'రిజర్వేషన్ హటావో' నినాదం వినిపించింది. కుల ఆధారిత రిజర్వేషన్లు వద్దని, ఆర్థిక వెనుకబాటుతనమే ప్రాతిపదిక కావాలని డిమాండ్లు వచ్చాయి. 'ప్రతిభకు ప్రాధాన్యం ఇవ్వాలి' అన్న మాటకు సహజంగానే ఆకర్షణ ఉంటుంది. పేదరికంలో ఉన్న ప్రతి యువకుడికీ అవకాశం రావాలన్న ఆకాంక్ష కూడా న్యాయమైనదే. కానీ దేశం ఇప్పుడు అడగాల్సిన అసలు ప్రశ్నవేరొకటి. రిజర్వేషన్లు తొలగిస్తే సమానత్వం నిజంగానే వచ్చేస్తుందా? లేక సామాజిక అసమానతను కనిపించకుండా చేయడమే జరుగుతుందా?రిజర్వేషన్‌ను కేవలం ఉద్యోగంలో ఒకసీటు, విద్యలో ఒక సీటుగా చూడటం దాని అసలు ఉద్దేశాన్నిచిన్నదిగా చేయడమే. భారత రాజ్యాంగం రూపుదిద్దుకున్న సమాజం శతాబ్దాలుగా సమాన అవకాశాలతో నడిచిన సమాజం కాదు. కులం ఆధారంగా వృత్తి, విద్య, సామాజిక గౌరవం, నివాసం, అధికారానికి ప్రవేశం నిర్ణయించబడిన చరిత్రమన ముందు ఉంది. అందుకే రాజ్యాంగ నిర్మాతలు సమానత్వాన్ని ప్రకటించడంతో ఆగలేదు. సమాన అవకాశాలు అందని వర్గాలకు ప్రత్యేక అవకాశాలకుకూడా మార్గం సుగమం చేశారు. ఇక్కడే ఆర్థిక వెనుకబాటుతనం, సామాజిక వెనుకబాటుతనం మధ్య తేడాను గుర్తించాలి. ఒక పేద కుటుంబానికి చెందిన యువకుడు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటాడు. అది నిజమే. అతనికి విద్య, స్కాలర్‌షిప్, కోచింగ్, ఉపాధి, ఆర్థిక సహాయం అందాలి. కానీ ఆర్థిక పరిస్థితి మెరుగుపడితేఆర్థిక సమస్య తగ్గవచ్చు. సామాజిక వివక్ష మాత్రం కేవలం ఆదాయం పెరిగిందని తొలగిపోదు. ఒక వ్యక్తి ఆదాయం పెరిగినా, అతని సామాజిక గుర్తింపు, కులపరమైన అనుభవం, సంస్థల్లో ప్రాతినిధ్యం వంటి ప్రశ్నలు అలాగే ఉండవచ్చు. అందుకే 'పేదలందరికీ ఒకే రిజర్వేషన్' అనే వాదన వినడానికి సమానత్వంలా కనిపించినా, అది సామాజిక వెనుకబాటుతనాన్ని పూర్తిగా అంచనా వేయగలదా అన్నది పరిశీలించాలి. పేదరికం జేబును ప్రభావితం చేస్తుంది. సామాజిక వివక్ష మనిషి అవకాశాలను, గౌరవాన్ని, సంబంధాలనుప్రభావితం చేస్తుంది. రెండింటికీ పరిష్కారాలు అవసరం. కానీ రెండింటినీ ఒకే కొలమానంతో కొలవడం సరైన విధానం కాదు. సుప్రీంకోర్టు కూడా రిజర్వేషన్‌ను సమానత్వానికి వ్యతిరేకమైన మినహాయింపుగా మాత్రమే చూడలేదు. 2024లో రాజ్యాంగంలోని ఆర్టికల్ 16(4) ఉద్దేశాన్ని విశ్లేషిస్తూ, చారిత్రకంగా కొద్దిమంది సమూహాల ఆధిపత్యంలో ఉన్న పరిపాలనా వ్యవస్థలో వెనుకబడిన వర్గాలకు ప్రాపర్ లుక్ ఇన్ కల్పించడం, వారికి పరిపాలనలో, పాలనలో వాటా కల్పించడం రిజర్వేషన్ లక్ష్యమని న్యాయపరమైన చర్చనునమోదు చేసింది. 2026లోనూ సుప్రీంకోర్టు ఆర్టికల్ 14, 15, 16, పరిధిలో సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాల ప్రతికూలతలను తొలగించేందుకు రాష్ట్రం తగిన చర్యలు తీసుకోవచ్చని, రిజర్వేషన్లు సమాన అవకాశాన్ని సాధించే ఒక మార్గమని పేర్కొంది. అంటే రాజ్యాంగ దృష్టిలో రిజర్వేషన్‌కు మూల ప్రశ్న ఎవరు పేద? అనేది మాత్ర మేకాదు. ఎవరు వెనుకబడ్డారు?ఎవరు తగిన ప్రాతినిధ్యంపొందలేదు? ఎవరు నిర్ణయ వ్యవస్థలోకి ప్రవేశించలేకపోయారు?" అన్నదీ



అంతే ముఖ్యమైన ప్రశ్న. ఆర్టికల్ 342ఎ కూడా సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాల రాష్ట్రాలవారీ గుర్తింపుకు రాజ్యాంగపరమైన వ్యవస్థను కొన సాగిస్తోంది. అయితే ఇక్కడ మరో నిజాన్ని కూడా ఒప్పుకోవాలి. ఎసి, ఎస్టీ, బిసి/ఒబిసిలను ఒకే రకమైన సామాజిక సమూహాలుగా చూడటం సరైంది కాదు. ముఖ్యంగా ఒబిసి వర్గంలోనే విద్య, ఉద్యోగం, ఆర్థికస్థితి, రాజకీయ ప్రాతినిధ్యంలో తీవ్ర అంతర్గత తేడాలున్నాయి. కొన్ని వర్గాలుముందుకు వెళ్లాయి. మరికొన్ని అత్యంత వెనుకబడిన స్థితిలోనే ఉన్నాయి. అందుకే ఒబిసి రిజర్వేషన్‌పై చర్చలో క్రీమీ లేయర్, అత్యంత వెనుకబడిన వర్గాల ప్రయోజనం, డేటా ఆధారిత సమీక్ష వంటి అంశాలు తప్పనిసరిగా ఉండాలి. ఇదే విషయంలో సుప్రీంకోర్టు కూడా ఒబిసిలలో క్రీమీ లేయర్‌ను వేరు చేయడం, నిజంగా అవసరమైన వర్గాలకు రిజర్వేషన్ ప్రయోజనం చేరేలా చూడడం వంటి అంశాలను ప్రస్తావించింది. రిజర్వేషన్ వ్యవస్థలో లోపాలుంటే వాటినిసరిదిద్దాలి. కానీ లోపాలున్నాయని మొత్తం వ్యవస్థనే తొలగించడంపరిష్కారం కాదు. ప్రయోజనాలు నిజంగా అర్హులైన వారికి చేరేలా చేయడం అసలు పరిష్కారం. ఇక్కడ ప్రతిభ అనేపదాన్నీ ఒకసారి ప్రశ్నించాలి. పరీక్షలో వచ్చిన మార్కులే ప్రతిభకు పూర్తి కొలమానమా?ఒక విద్యార్థికి చిన్నప్పటి నుంచే మంచి పాఠశాల, ప్రైవేట్ కోచింగ్, పుస్తకాలు, ఇంట ర్నెట్, చదువుకు అనుకూలమైన వాతావరణం లభిస్తేమరొక విద్యార్థి ఉపాధ్యాయుల కొరత, పేదరికం, సామాజిక వెను కబాటుతనం మధ్య చదివితే ఇద్దరినీ ఒకే ప్రారంభ రేఖ వద్దనిలబెట్టినట్టు ఎలా భావించగలం? పోటీకి ముందు సమాన అవకాశాలు ఉన్నాయా అన్న ప్రశ్న లేకుండా, పోటీ ఫలితాన్ని మాత్రమే మెరిట్‌గా పిలవడం అసంపూర్ణమైన విశ్లేషణ. ఇదేసమయంలో రిజర్వేషన్‌కు వ్యతిరేకంగా ఉన్న వారి ప్రశ్నలను కొట్టిపారేయడం కూడా సరైంది కాదు. రిజర్వేషన్ ఎంతకాలం? ప్రయోజనం ఎవరికి చేరుతోంది? నిజంగా వెనుకబడినవారికి అందుతోందా? ఒకే కుటుంబాలు తరతరాలుగా ప్రయోజనం పొందుతున్నాయా? క్రీమీలేయర్ పరిమితులు సమర్థంగా అమలవుతున్నాయా? ఈ ప్రశ్నలకు సమాధానాలు కావాలి. సామాజిక న్యాయం పేరుతో వ్యవస్థలోని లోపాలను దాచడంకూడా సామాజిక న్యాయంకాదు. కానీ ఆ ప్రశ్నలకు సమాధానం రిజర్వేషన్ రద్దు అని చెప్పడం మాత్రం తార్కికంగా సరిపోదు. ప్రభుత్వ విద్యావ్యవస్థను బలోపేతం చేయాలి. పేద యువతకు కోచింగ్, స్కాలర్‌షిప్‌లుపెంచాలి. ఉన్నత విద్యలో నిలకడైన అవకాశాలు కల్పించాలి. ఒబిసిలలో అత్యంత వెనుకబడిన వర్గాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ఎస్సి, ఎస్టి విద్యార్థులకు నాణ్యమైన విద్య, నైపుణ్యాలు, ఉపాధి అవకాశాలు విస్తరించాలి. అగ్రవర్ణ పేదల ఆర్థిక వెనుకబాటుతనాన్నీ ప్రభుత్వం వదిలిపెట్టకూడదు. సామాజిక న్యాయం అంటే ఒకరిని తగ్గించడంకాదు, వెనుకబడిన వారిని పైకి తీసుకురావడం. అసలు ప్రశ్న ఉద్యోగాల సంఖ్యతోనే ముగియదు. ఎవరు విశ్వవిద్యాలయాల్లో ఉన్నారు? ఎవరు పరిశోధన చేస్తున్నారు? ఎవరు పరిపాలనలో నిర్ణయాలు తీసుకుంటున్నారు? ఎవరు విధానాలు రూపొందిస్తున్నారు? ఎవరి స్వరం మీడియా, న్యాయవ్యవస్థ, కార్పొరేట్‌సంస్థలు, విద్యా సంస్థల్లో బలంగా వినిపిస్తోంది? ఇవన్నీ ప్రాతినిధ్యానికి సంబంధించినప్రశ్నలే. అందుకే దేశం ఇప్పుడు రిజర్వేషన్‌పై కేవలం ఉంచాలా? తొలగించాలా?"అనే ద్వంద్వ ప్రశ్నలో చిక్కుకోకూడదు. ఎవరికి ఇంకా అవకాశం లేదు? ఎవరి ప్రాతినిధ్యం ఇంకా తక్కు? ఎవరి స్వరం నిర్ణయ వ్యవస్థకు చేరడం లేదు? అన్నప్రశ్నలకు సమాధానం వెతకాలి. రిజర్వేషన్లను మెరుగుపరచాలి. అవసరమైన చోట సంస్కరించాలి. నిజంగా వెనుకబడినవారికి చేరేలా చేయాలి. కానీ సామాజిక అసమానత తొలగిపోయిందనే సాక్ష్యం లేకుండానే రిజర్వేషన్ తొలగించాలని చెప్పడం సామాజిక అసమానతల చరిత్రకు అకాల ముగింపు పలకడమే అవుతుంది. ●

# 'వందేమాతరం'పై ఇంత రాద్ధాంతం దేనికి!

జయసూర్య

'జననీ జన్మ భూమిశ్చ స్వర్గాదపి గరీయసి' త్రేతాయుగం నాటి శ్రీమద్రామాయణంలోని తల్లి మాతృభూమి గురించిన ప్రశంస ప్రస్తుత కలియుగ భారతావనిలో జనని, జన్మభూమిగా మాతృభూమి, బానిస శృంఖలాలు ఛేదించే స్వాతంత్ర్యోద్యమసమరంలో 'వందే మాతరం' అయింది. వందేమాతరం అంటే "తల్లీ! నీకు ప్రణామం" అధర్వణ వేదంలోని పృథివీ సూక్తంలో అభివర్ణించారు రుషిపుంగవులు. ఆ ప్రాచీన పవిత్ర భావన మరింత ప్రగాఢమై దేశమాత ఆవిర్భవించింది. దేవీదేవతలు ఆరాధనలోంచి దేశమాత జనించింది. వందేమాతరం జప మంత్రంగా దేశభక్తి నినాదమైంది. వందేమాతరం, మాతృభూమి పట్ల ఆధ్యాత్మిక శక్తిని ఉద్భవింపచేసే రణతంత్రం అయింది. జన్మయిచ్చిన భూమి పట్ల అనన్య భక్తి నిర్మింప చేసింది. బెంగాల్ సమర యోధులు, మేధావులకు పుట్టిల్లు బంకించంద్రఛటర్జీ, వైభవాన్వితమైన మాతృభూమికి స్వేచ్ఛా, విముక్తి సాధనకు దేశభక్తి రగిలించాలంటే, దైవ భక్తిలోంచి దేశభక్తి స్ఫూరింపచేసే ఆనందమఠం నవలగా రచించారు. స్వరూపాలుగా జగద్ధాత్రి, కాళి ఉగ్రరూపాలతో పాటూ భారతావనని దివ్యమంగళ స్వరూపంగా అభివర్ణించి, సంతాన తెగకు చెందిన సన్యాసుల స్వాతంత్ర్య దీక్షాలక్ష్యం ఆ నవలలో విపులీకరించబడింది. దేశభక్తులైన సంతా నులు, సన్యాసులు దట్టమైన కీకారణ్యంలో శిథిల దుర్గం అయిన ఆనందమఠంలో రహస్యంగా నివసిస్తుంటారు. ఘోర కరవు కాటకాల కారణంగా నాటి జమీందార్ మహేంద్ర సింగ్ కుటుంబం అడవులపాలై విడిపోతారు. భార్య కల్యాణి దోపిడీ దొంగల బారి నుండి తప్పించుకుని ఆనందమఠంలో ఆశ్రయం పొందుతుంది. సత్యానంత ఆదే శాలనుసారం భావానంద మహేంద్రసింగ్‌ను అరణ్యంలో వెతుకుతుంటాడు. ఇంతలో యాభై మంది సాయుధ సిపాయి దళం, ఆంగ్లేయ సైనికాధికారి కమాండర్‌గాకంపెనీ ఆదాయ నిధులు కోల్‌కత్తా అరణ్య మార్గంలో తీసుకుని వెళ్తుంటారు. దేశభక్తులైన సన్యాసులు జీవానంద నాయకునిగా ఆ నిధిని దోపిడీతో కొల్లగొట్టారు. ఆంగ్ల సైనికాధికారిని సంహరించి, సిపాయిలను పరాజితులు చేసి లూటీ చేస్తారు. శత్రుసంహారం, లూటీ దోపిడీ దేశభక్తులైన సంతా నులు నేరాలుగా పరిగణించరు. మహేంద్ర, భావానందలు సిపాయిల నిర్బంధానికి గురి అయి తప్పించుకుని ఆనంద మఠంవైపు వెళ్తుండగా, సన్యాసుల లూటీ, దోపిడీ, దౌర్జన్యాలను మహేంద్ర విమర్శిస్తాడు. అప్పుడు భావానంద ఆకాలంలో రాజ్యమేలుతున్న అణచివేత, నిరంకుశ పాలన, అరాచకం, దారిద్ర్యస్థితిగతుల నుండి నాటి పాలనాధికారి, నవాబు రక్షణ కల్పించలేనందున అసమర్థునికిహక్కులేదని, అందువలన లూటీ దోపిడీ న్యాయమైన చర్యలని సమర్థిస్తాడు. భావోద్రేక భక్తి ఉద్విగ్న తన్మయత్వంతో కవి బంకించంద్రుడు దేశమాత మాతృభూమి స్వర్గతుల్యమని సుజలం, సుఫలం మలయ శీతలమైన దేవీ మాతృస్వరూపాన్ని వందేమాతరంగా గానం చేస్తాడు. 1875 నవం బరులో గేయరూపంలో ఆవిర్భవించిన వందేమాతరం, ఆయన సంపాదకత్వంలో ప్రచురితమయ్యే 'బంగదర్శన్' పత్రికలో ప్రచురింపబడింది. బంగదర్శన్ పత్రిక 1880- 1881 మధ్యకాలంలోఆనంద మఠ్ నవలనుధారావాహికగా ప్రచురించింది. ఆ నవలలో వందేమాతరం గీతం యథాత థంగా పొందుపరచబడింది. 1876లో యదునాథ భట్టాచార్య అనే కవి ఈ గీతం మల్హార్‌రాగంలో పాడారు. 1882లో ఆనందమఠం నవల పుస్తకంగా ప్రచురితమైంది. 1872-1875 మధ్య రాత ప్రతిగా ఉందని చరిత్ర భావి స్తోంది. 1885 జాతీయ కాంగ్రెస్ కోల్‌కత్తా సమావేశంలో విశ్వకవి రవీంద్రనాథ్ టాగూర్ దేశిరాగంలో స్వరబద్ధం చేసి స్వయంగా పాడి శ్రోతలను ముగ్ధులు చేశారు. జాతీయ కాంగ్రెస్ మహాసభలలో వందేమాతరం పాడటం అప్పటి నుంచే ప్రారంభమైంది. 1836జూన్ 26న జన్మించిన బంకించంద్ర ఛటర్జీ 1894 ఏప్రిల్ 8న స్వర్గస్థుడైనాడు. 58 ఏళ్ల జీవించిన మహాదార్శనిక అక్షర శిల్పి తన 44 యేటా ఈ గేయం రచించారు. ప్రప్రథమంగా భారత జాతీయ పితామహుడు దాదాభాయననౌరోజీ సమక్షంలో జాతీయ కాంగ్రెస్‌ద్వితీయ మహాసభలో 450 మంది ప్రతినిధులు, ఈదేశ భక్తిగేయం ఆలపించి ఉత్తేజితుల య్యారు. 1905 నాటికి కాశీ భారత జాతీయ కాంగ్రెస్‌లో గోపాలకృష్ణగోఖలే సూచనపై రవీంద్రుని మేనకోడలు సరళా దేవి చౌదురాణి ఈ గేయాన్ని ఆలపించారు. బాలగంగాధర తిలక్ మాటలలో చెప్పాలంటే భారత జాతీయ పునరుజ్జీ వానికి, వందేమాతరం ఒక మంత్రనాదం. నాటి బ్రిటిష్ ప్రభుత్వం నిషేధించినా వందేమాతరం సంప్రదాయసొసైటీ అధ్యక్షునిగా కోల్‌కత్తా నగర వీధులలో మానవేంద్రనాథ్ రాయ్ మార్చింగ్ సాంగ్‌గా నిర్వర్తించేవారు. 23చరణాలున్న వందేమాతరం, మొదటి రెండు స్టాంజాలు మాత్రమే మాతృదేశభక్తికి సంబంధించినవిగా గుర్తించబడుతున్నాయి. 7 పాదాల తొలి స్టాంజాలే గుర్తింపు పొందాయి. 150 వసంతాల తర్వాత, ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం జాతీయ గౌరవ అవమానాల నిరోధక (సవరణ) బిల్లు 2026 వందేమాతరం బిల్లుగా తెచ్చింది. మొత్తం 6 చరణాల భాగాల సంపూర్ణ గేయం లోని మొదటి రెండు చరణాలు మాత్రమే 1950 జనవరి 24 భారత రాజ్యాంగ సభ అధికారిక ఆమోదయోగ్యంగా సుమారు 76 సంవత్స రాలకు పైగా మాతృదేశాన్ని తల్లిగా వందేమాతరం పాడి పూజిస్తున్నాం. ఇప్పుడు ఎందుకీ అనర్థ రాద్ధాంతం? ●

(రచయిత : సీనియర్ జర్నలిస్టు)

# పర్యాటకంతో ఆర్థిక వృద్ధి సాధించగలమా?

దుంగ జయరాం

భారత్‌లో 2025లో 428.7 కోట్ల దేశీయ పర్యాటక సందర్శనలు నమోదయ్యాయి. అంతకుముందు ఏడాదితో పోలిస్తే ఇది 45.55శాతం పెరుగుదల. దేశంలో పర్యాటకానికి ఉన్న విస్తృత డిమాండ్‌ను ఈ గణాంకం స్పష్టం చేస్తోంది. అయితే అసలు ఆర్థిక ప్రశ్న పర్యాటకసందర్శనలు ఎన్ని అన్నది కాదు. ప్రతి పర్యటన ద్వారా ఎంత ఆదాయం, ఉపాధి, స్థానిక వ్యాపారం, పెట్టుబడి సృష్టించగలుగుతున్నామన్నదే. పర్యాటకాన్ని ఆర్థిక శక్తిగా మార్చాలంటే భారత్ సంఖ్యల పెరుగుదల నుంచి ఒక్కో పర్యాటకుడి ద్వారా సృష్టించే విలువ పెరుగుదల వైపు మళ్లాలి. పర్యాటకం ఇప్పటికే భారత ఆర్థికవ్యవస్థలో గణనీయమైన పాత్రపోషిస్తోంది. పర్యాటక మంత్రిత్వ శాఖ అంచనాల ప్రకారం2023-24లో ఈ రంగం రూ.15.74 లక్షల కోట్ల ఆర్థిక విలువను సృష్టించింది. ఇది దేశ స్థూలదేశీయోత్పత్తిలో 5.22 శాతం. పర్యాటక రంగంపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడిన ఉపాధి 8.463 కోట్లకు చేరింది. పర్యాటకుడి ఖర్చు రవాణా, వసతి, ఆహారం, కొనుగోళ్లు, వినోదం, స్థానిక ఉత్పత్తులు, సేవల్లో చలామణి అవుతుంది. అందుకే పర్యాటకం అనేక రంగాలను ఒకేసారి కదిలించగల ఆర్థిక గొలుసు. ఈ గొలుసు ఎంత బలంగా పనిచేస్తుందన్నదే పర్యాటకం సృష్టించే విలువను నిర్ణయిస్తుంది. ఒక ప్రదేశాన్ని కొన్ని గంటలు చూసి వెళ్లిపోయే పర్యాటకుడి వ్యయం పరిమితంగా ఉంటుంది. అదే పర్యాటకుడు రెండు మూడు రోజులు ఉండి సమీప ప్రాంతాలను సందర్శిస్తే వసతి, భోజనం, రవాణా, కొనుగోళ్లు, మార్గదర్శక సేవలు, సాంస్కృతిక కార్యక్రమాలకు ఆదాయం పెరుగుతుంది. అందువల్ల ఎంతమంది వచ్చారు? అనేదానితో పాటు ఎంతకాలం ఉన్నారు, ఎంత ఖర్చు చేశారు, ఆ ఖర్చులో ఎంత భాగం స్థానికంగా చలామణి అయింది?" అన్నదీ కొలవాలి. దీనికి గమ్యస్థానాలను విడివిడిగా కాకుండా పర్యాటక మార్గాలుగా అభివృద్ధి చేయాలి. దేవాలయాలు, వారసత్వ కట్టడాలు, సముద్ర తీరాలు, వన్యప్రాణి ప్రాంతాలను సమీప ఆకర్షణలతో అనుసంధానించి నాణ్యమైన వసతి, రహదారి-రైలు-విమాన సౌకర్యాలు, పరిశుభ్రత, స్థానిక ఆహారం, సాంస్కృతిక అనుభవాలు, కొనుగోళ్లు, వినోదం అందుబాటులోకి తేవాలి. రవాణా మౌలిక వసతులను కూడా కేవలం ప్రయాణ సౌకర్యాలుగా కాకుండా ప్రాంతీయ ఆర్థికవ్యవస్థలను మార్కెట్లతో కలిపే వసతులుగా చూడాలి. అప్పుడు పర్యాటక ఆదాయం పెద్ద నగరాలకే పరిమితం కాకుండా చిన్న పట్టణాలు, గ్రామాలకు విస్తరిస్తుంది. ఇక్కడ ఒక కీలకమైన ప్రశ్నఉంది.



పర్యాటకుడు ఖర్చు చేసిన ప్రతి రూపాయిలో ఎంత భాగం స్థానిక ఆర్థిక వ్యవస్థలోనే మిగులుతోంది? హోటళ్లు స్థానిక రైతుల నుంచి కొనుగోలు చేస్తే అది వ్యవసాయఆదాయంగా మారుతుంది. పర్యాటకుడు కళాకారుడి ఉత్పత్తిని కొనుగోలు చేస్తే అది కుటుంబ ఆదాయంగా మారుతుంది. స్థానిక వాహనదారులు, మార్గదర్శకులు, భోజనశాలలు, గ్రామీణ వసతి కేంద్రాలు కూడా ఆ ఖర్చులో భాగస్వాములవుతాయి. ఈ స్థానిక అనుసంధానం పెరిగితే పర్యాటక వ్యయపు ఆర్థిక గుణక ప్రభావం బలపడుతుంది. అందుకే స్థానిక ఆహారం, కళలు, సంగీతం, సంప్రదాయ వృత్తులు, ప్రకృతి అనుభవాలను పర్యాటక ఉత్పత్తులుగా మలచడంతో పాటు స్థానిక ఉత్పత్తులకు మార్కెట్లు కల్పించాలి. ఉపాధి విషయంలోనూ సంఖ్య కంటే నాణ్యత ముఖ్యం. విదేశీ భాషలు, వంటకళ, వారసత్వ వివరణ, అతిథి సేవలు, సాహస పర్యాటకభద్రత, ప్రచార నైపుణ్యాలకు డిమాండ్ పెరుగుతుంది. శిక్షణ పొందిన వారిసంఖ్య కంటే శిక్షణ తర్వాత లభించిన ఉద్యోగాలు, వేతనాలు, ఉత్పాదకత ఎంత పెరిగాయన్నదే నైపుణ్య కార్యక్రమాల విజయానికి కొలమానం కావాలి. అంతర్జాతీయ పర్యాటకంలో భారత్‌కు మరింత పెద్ద అవకాశం ఉంది. 2025లో విదేశీ పర్యాటకుల రాక 91.5 లక్షలుగానమోదై, అంతకుముందు ఏడాదితో పోలిస్తే 8.07 శాతం తగ్గింది. భారతదేశ భౌగోళిక వైవిధ్యం, వారసత్వం, ఆధ్యాత్మికత, వన్యప్రాణులు, వైద్య సేవలు, వంటకాలు, సాహస పర్యాటకానికి ఉన్న అవకాశాలను ప్రపంచ మార్కెట్లకు లక్ష్యంగా పరిచయం చేయాలి. వీసా ప్రక్రియను సులభతరం చేయడం, అంతర్జాతీయ విమాన అనుసంధానాన్ని విస్తరించడం, చివరి దశ రవాణాను మెరుగుపరచడం కూడా అవసరం. విదేశీ పర్యాటకులు దేశంలోకి విదేశీ కొనుగోలు శక్తిని తీసుకువస్తారు. 2025లో పర్యాటకం ద్వారా భారత్‌కు సుమారు రూ. 2.7 లక్షల కోట్ల విదేశీ మారకద్రవ్య ఆదాయం లభించినట్లు అంచనాలు సూచిస్తున్నాయి. ఈ ఆదాయం కూడా తగ్గింది. కాబట్టి లక్ష్యం కేవలం ఎక్కువ మంది విదేశీ పర్యాటకులను ఆకర్షించడం కాకుండా ఎక్కువ రోజులు ఉండే, అనేక ప్రాంతాలను సందర్శించే, అధిక విలువైన అనుభవాలపై ఖర్చు చేసే పర్యాటకులను ఆకర్షించడం కావాలి. పరిశుభ్రత, భద్రత, పారదర్శక ధరలు, విశ్వసనీయ సేవలు, సమయ పాలన ఈ వ్యూహంలో కీలకం. ప్రపంచ ప్రయాణ, పర్యాటక మండలి అంచనాల ప్రకారం 2026లో భారత పర్యాటకరంగం 8.5శాతం వృద్ధితో 286.1బిలియన్ డాలర్ల ఆర్థిక సహకారం అందించవచ్చని అంచనా. 2036నాటికి ఇది527 బిలియన్ డాలర్లకు చేరవచ్చని కూడా అంచనా ఉంది. ఈ సామర్థ్యాన్ని అందుకోవడం పర్యాటకుల సంఖ్యపైనే కాకుండా మౌలిక వసతులు, గమ్యస్థానాల నాణ్యత, స్థానిక వ్యాపారాల అనుసంధానం, నైపుణ్యాలు, ప్రైవేటు పెట్టుబడులు, ఒక్కో పర్యాటకుడి వ్యయ సామర్థ్యంపై ఆధారపడి ఉంటుంది. ●

# ప్రజావాక్కు



## రైతుది కష్టం, దళారిది లాభం

దేశానికి వెన్నెముక రైతని అందరూ ఒప్పుకున్న విషయమే. ఇటీవల ఏలూరు జిల్లా ముసునూరు మండలం కాత్రేనిపాడులో గౌర్మెట్ పాప్ కార్న్‌కా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఉత్పత్తి చేసిన నూతన పాప్ కార్న్‌కా వంగడాన్ని ఆవిష్కరించిన సమయంలో ఉపరాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్ గుర్తు చేసారు. కాని మన దేశంలో ప్రతి రోజు అన్నంపెట్టే రైతు పడేకష్టాలు వర్ణనాతీతం. ప్రకృతి వైపరీత్యాల వలన సరైన సమయంలో వర్షాలు పడకపోవడం, కరవురావడంలేదా అకాలవర్షాలు, తుఫాన్ల వల్ల చేతికొచ్చిన పంట నీట మునగడం. భారీ పెట్టుబడులు పెట్టుట వలన విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు, ట్రాక్టర్ వగైరా పనులకు, కోతలు, రవాణా కోసంవేల రూపాయలు ఖర్చు అవుతుంది. గిట్టు బాటు ధరలేకపోవడం వలన కష్టపడిపండించిన పంటను మార్కెట్‌కు తీసుకెళ్తే సరైన మద్దతు ధర లభించక రైతులు నష్టపోతున్నారు. కావున రైతులకు ప్రోత్సాహాలు పెంచి ఆదుకోగలగాలి.

- డా.దన్నాన అప్పలనాయుడు, విజయనగరం

## గిరిజన కోఆర్డినేటర్లను నియమించాలి

తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అమలు అయ్యే సంక్షేమ పథకాల గురించి గిరిజనులకు అవగాహన చైతన్య కార్యక్రమాలను నిర్వహించే గిరిజన కో ఆర్డినేటర్ అవసరం. గిరిజనసంక్షేమ శాఖలో, గురుకులాలలో పనిచేస్తున్న లెక్చరర్స్, టీచర్స్ ను ఎంపిక చేసి వారికి టిఎ డిఎ ఇచ్చివాహన సౌకర్యం కల్పించి ప్రతినెల ప్రతి మండలంలో అవగాహన చైతన్య కార్యక్రమాలు ఏర్పాటు చేయాలి. గిరిజన తండాలకు వాహన సౌకర్యం, రోడ్లు, మంచినీటి సౌకర్యం, విద్యుత్ సౌకర్యం, విద్య, వైద్య సౌకర్యం, వంటి అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడానికి ఈ ప్రోగ్రాం అవసరం.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్

## పేదింటి కల నెరవేరిన వేళ

సమాజంలో మధ్యతరగతి, బడుగు బలహీన వర్గాల కుటుంబాలు చిన్నప్పటినుండి అష్టకష్టాలు పడుతూ ఉన్నదో లేనిదోతింటూ సంవత్సరాల తరబడిరెక్కలు ముక్కలు జేసుకుని ఇల్లు నిర్మించినప్పుడు గాని ఏవైనా కార్యక్రమాలు చేసినప్పుడు ఆ కుటుంబంలోని ఆనందం మాటల్లో వర్ణించలేనిది. కావున ప్రభుత్వ పథకాల్లో నిరుపేదలకే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

## దేశ భవిష్యత్తును నిర్ణయించేది యువతే

యువత, విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, తీవ్రవాద నిర్మూలన వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వడం స్వాగతించదగినదే. దేశ భవిష్యత్తును నిర్ణయించే యువత గురించి మాట్లాడటం అవసరం. అయితే ప్రసంగాల్లో వినిపించే హామీలు యువత జీవితాల్లో మార్పుగా కనిపించినప్పుడే వాటికి నిజమైన విలువ ఉంటుంది. నేటి యువతకు ఆకర్షణీయమైన ప్రకటనల కంటే స్పష్టమైన లక్ష్యాలు, నిర్ణీత గడువులు, కనిపించే ఫలితాలు అవసరం. ప్రభుత్వం ప్రకటించే ప్రతి ప్రధాన కార్యక్రమానికి ఎంతమందికి ప్రయోజనం కల్పించాలి, ఎప్పటిలోగా లక్ష్యాన్ని చేరుకోవాలి, అమలుకు బాధ్యత వహించే శాఖ ఏది, ఇప్పటివరకు ఎంత పురోగతి సాధించామన్న వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలి. నిర్దిష్ట కాల వ్యవధుల్లో పురోగతిని బహిరంగంగా సమీక్షిస్తే పాలనా వ్యవస్థలో జవాబుదారీతనం పెరుగుతుంది. పార్లమెంట్‌తో పాటు ప్రజలు కూడా హామీల అమలును అంచనా వేసే అవకాశం ఉంటుంది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## కల్కి స్వపక్షమా, ప్రతిపక్షమా?

భూమన్ కరుణాకరరెడ్డి ఆక్రమణలను స్వాధీనం చేసుకున్నారు సంతోషం. అదే జిల్లాలో కల్కి అనే దొంగస్వామి ఆక్రమించినఅంజూర్ అటవీ భూములను ఎపుడు స్వాధీనం చేసుకుంటారు?ఆ పక్కనే వరదయ్య పాలెం మండలంలో కల్కి ఆక్రమించిన దళితుల భూములను దళితులకు ఎపుడు స్వాధీనం చేస్తారు కరుణాకరరెడ్డి ప్రతిపక్షం, కల్కి మీ పక్షమా? 20 సంవత్సరాలనుండి తిరుపతి జిల్లాలో కల్కి ట్రస్టు వారు బీఎన్ కండ్రిక మండలం కల్లివెట్టు గ్రామ పరిధిలోని 295 సర్వే నంబర్‌లో అంజూర్ అటవీ భూమిని అక్రమించి విదేశీయులనురప్పించి, అటవీ నిబంధనలకువ్యతిరేకంగా, వాళ్లను రాత్రులు అక్కడే వసతి కల్పించి, భజనలు యాగాలు చేస్తున్నారు. ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. కనుక తిరుపతి జిల్లాలో కల్కి అక్రమాలపై నిగ్గు తేల్చాలి

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

## విద్యార్థుల సంఖ్య పెరిగేదెలా?

దేశవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల సంఖ్య తగ్గుతుంది. దేశవ్యాప్తంగా ఎక్కువ ప్రాంతాల్లో తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రైవేటు విద్యా సంస్థల్లో చేర్పించేందుకే మొగ్గు చూపుతున్నట్లు కేంద్ర విద్యా శాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. దీనికిగల కారణాలను లోతుగా అధ్యయనం చేసి, అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి.

-కె.రామారావు, నల్గొండజిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# కులగణనలో 'ఓపెన్‌ఎండెడ్' వద్దు



## కులాల డ్రాప్‌డౌన్ జాబితా చేర్చండి

## ప్రధాని మోడీకి ఖర్గే, రాహుల్ సంయుక్త లేఖ

### తెలంగాణ, బీహార్‌ల విధానాన్ని అనుసరించాలని సూచన

**న్యూఢిల్లీ, ఆగస్టు 25:** కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి ఒక సంయుక్త లేఖ రాశారు. జనాభా లెక్కలలో కుల సమాచారాన్ని సేకరించడానికి ప్రతిపాదించిన 'ఓపెన్‌ఎండెడ్' విధానం వల్ల ఒకే కులాన్ని వేర్వేరు పేర్లతో నమోదు చేసే అవకాశం ఉందని, తద్వారా డేటా తప్పుగా మారే అవకాశం ఉందని కాంగ్రెస్ నేతలు హెచ్చరించారు. దానికిబదులుగా, ఫారంలో "కులాల డ్రాప్‌డౌన్ జాబితాను చేర్చాలని వారు కోరారు. "ఖచ్చితమైన డేటా లేకుండా భారత దేశంలో సామాజిక న్యాయ విధానాలను సమర్థవంతంగా రూపొందించలేము" అని పేర్కొంటూ కుల గణనను సరిగ్గా నిర్వహిస్తేనే వివిధ కులాల సంఖ్యా బలం, సామాజిక ఆర్థిక స్థితిపై ఖచ్చితమైన అంచనా సాధ్యమవుతుందని ఆ లేఖలో పేర్కొన్నారు. "జనాభా గణన సమయంలో కుల వివరాలను నమోదు చేయడానికి ప్రభుత్వం 'అపరిమితమైన' ప్రశ్నల విధానాన్ని ఎంచుకుంది, ఇది తప్పుదోవ పట్టించే పద్ధతి. ఈ పద్ధతి ప్రకారం, ఒక వ్యక్తి తన కులానికి ఏ పేరు చెప్పినా, అది ఉన్నది ఉన్నట్లుగానే నమోదు చేయబడుతుంది" అని ఖర్గే, రాహుల్‌గాంధీ అభిప్రాయపడ్డారు. దేశంలోని వివిధ ప్రాంతాలలో ఒకే కులాన్ని తరచుగా వేర్వేరు పేర్లు, ఉప కులాలు, భాషా వైవిధ్యాలతో పిలుస్తారని గుర్తుచేశారు. ఒకే కులానికి చెందిన వారిని వేర్వేరు పేర్లతో నమోదు చేస్తే, "ఒకే కులం వేలాది విభిన్న నమోదులుగా విడిపోయే అవకాశం ఉంది" అని హెచ్చరించారు. "దీనివల్ల లక్షలాది కుల పేర్లు పుట్టుకొస్తాయి, కుల గణన నుండి పొందిన మొత్తం డేటాసెట్ నిరుపయోగంగా మారుతుంది" అని కాంగ్రెస్ నాయకులు ఎత్తి చూపారు. ఒక వర్గం కచ్చితమైన జనాభా గణనను నమోదు చేయకపోతే, "వారి స్థితిపై చేసే ఏ అంచనా అయినా అనివార్యంగా లోపభూయిష్టంగా ఉంటుంది" అనిపేర్కొన్నారు. "ఇది వెనుకబడిన, అత్యంత వెనుకబడిన, ఇతర అణగారిన వర్గాలకు నష్టం కలిగిస్తుంది. అంతేకాకుండా విద్య, ఉపాధి, సంక్షేమ పథకాలు, సామాజిక న్యాయానికి సంబంధించిన నిర్ణయాలపై కూడా ప్రభావం చూపుతుంది. అన్నింటికన్నా ముఖ్యంగా, ఈ పద్ధతి భారతదేశంలోని ఒబిసి జనాభా వాస్తవ పరిమాణాన్ని వెల్లడించడంలో విఫలమవుతుంది. ఎందుకంటే ఈ జనాభా లెక్కలలో 'వెనుకబడిన తరగతి' అనే పదాన్నే చేర్చలేదు" అని ఆ లేఖలో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే "కులాల డ్రాప్‌డౌన్ జాబితాను రూపొందించాలని కాంగ్రెస్ నాయకులు సూచించారు. "షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల గణన కోసం ఉపయోగించే పద్ధతి ఇది. సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతుల వంటి ప్రభుత్వ జాబితాలు, భారత మానవ శాస్త్ర సర్వే (ఆంత్రోపాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా) నుండి సేకరించిన సమాచారం ఆధారంగా ఇలాంటి జాబితాను సులభంగా రూపొందించవచ్చు" అని పేర్కొన్నారు.

తెలంగాణ, బీహార్‌లలో నిర్వహించిన కుల సర్వేలలో కూడా ఇదే విధానాన్ని అనుసరించారని, కేంద్ర ప్రభుత్వం కూడా అదే విధానం అనుసరించాలని సూచించారు. "ప్రస్తుత పద్ధతిలో కుల గణన నిర్వహించడాన్ని తాము అంగీకరించము. ప్రభుత్వం ప్రస్తుత ప్రశ్నాపత్రాన్ని రద్దు చేసి, రాజకీయ పార్టీలు, నిపుణులు, ప్రజలతో సంప్రదించిన తర్వాత కొత్తదాన్ని రూపొందించాలి" అని డిమాండ్ చేశారు.

## రంగంలోకి 'మాలిస్'



### అమెరికా ఆవిష్కరించిన తాజా ఆయుధం

### 463 కి.మీ దూరం నుంచే కూల్చేసే శక్తివంతమైన క్షిపణి

**వాషింగ్టన్, ఆగస్టు 25:** ఆధునిక యుద్ధ వ్యూహాలపై పదునుపెడుతోన్న అమెరికా తాజాగా సరికొత్త ఆయుధాన్ని సిద్ధం చేసింది. సుదూరం నుంచే శత్రు ముప్పును ఛేదించేలా సరికొత్త ఎయిర్-టు-ఎయిర్ క్షిపణిని యుఎస్ నేవీ ఆవిష్కరించింది. 'మాలిస్'గా పిలిచే ఈ దీర్ఘశ్రేణి క్షిపణి వందల కిలోమీటర్ల దూరం నుంచే విమానాలను కూల్చగలదని అగ్రరాజ్యం చెబుతోంది. ఇంతకీ ఏమిటీ క్షిపణి? దీని ప్రత్యేకతలేమిటి?

**మాలిస్.. 'రేంజ్' వేరు**

మాలిస్ క్షిపణి సాంకేతిక పేరు ఎఐఎం-424 ఎల్‌ఆర్‌ఎఎం. రేథియాన్ సంస్థతో కలిసి అమెరికా నైకాదళం అత్యాధునిక ఎయిర్-టు-ఎయిర్ క్షిపణిని అభివృద్ధి చేసింది. పొడవు 4.11 మీటర్లు.. 680 కిలోల బరువుండే ఈ క్షిపణిలో సాలిడ్ ప్రొపెల్లెంగ్ రాకెట్ మోటార్ ప్రొపల్షన్ అమర్చారు. దీని సాంకేతికతను యుఎస్ నేవీ పూర్తిగా బయటపెట్టనప్పటికీ.. శత్రువు టార్గెట్‌ను గుర్తించిన వెంటనే.. దాన్ని కూల్చివేసేలా రూపొందించారు. 250 నాటికల్ మైళ్ల (463 కిలోమీటర్ల) దూరంలో ఉండే లక్ష్యాలను ఇది ఛేదించగలదు. గగనతల లక్ష్యాలను టార్గెట్ చేసే క్షిపణుల్లో ఇదే ఇప్పటివరకు అంత్యంత లాంగ్ రేంజ్ మిసైల్. దీంతో అమెరికా యుద్ధ విమానాలు లక్ష్యాలకు చేరువగా వెళ్లాల్సిన పని ఉండదు. అప్పుడు యుద్ధ క్షేత్రంలో అగ్రరాజ్యం వైపు తక్కువ నష్టం ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు.

**ఏ యుద్ధవిమానాల్లో వాడుతారు?**

ఎఐఎం-424 క్షిపణిని ప్రధానంగా ఎఫ్-35సి యుద్ధ విమానాల కోసం డిజైన్ చేశారు. దీంతోపాటు ఎఫ్/ఎ-18ఇ/ఎఫ్ సూపర్ హార్నెట్ ఫైటర్ జెట్లలోనూ వీటిని అమర్చేందుకుకూడా పరీక్షలు జరుపుతున్నారు. ఇటీవల జరిగిన టెస్ట్ ఈవెంట్‌లో ఈ క్షిపణులను యుద్ధ విమానాలకు అమర్చిన ఫొటోలను అమెరికా నేవీ విడుదల చేసింది. మరోవైపు, చైనా కూడా ఇలాంటి దీర్ఘశ్రేణి క్షిపణులపై దృష్టి పెట్టింది. వేల మైళ్ల దూరంలో ఉన్న గగనతల లక్ష్యాలను ఛేదించే హైపర్‌సోనిక్ గ్లైడ్ వెహికల్స్‌ను తయారుచేస్తున్నట్లు సమాచారం. ఈ క్షిపణులు దాదాపు 2,414 కిలోమీటర్ల దూరం ప్రయాణించగలవని అంచనా. అంటే.. చైనా నుంచి అమెరికా గగనతాన్ని లక్ష్యంగా చేసుకోవచ్చని సమాచారం. అయితే, ఈ క్షిపణికి సంబంధించిన వివరాలు ఇంకా బయటకు రాలేదు. ప్రస్తుతం బీజింగ్ వద్ద కనీసం 3,150 బాలిస్టిక్ క్షిపణులు, 300 గ్రౌండ్‌క్రూజ్ మిసైళ్లు ఉన్నాయని అంచనా.

## మా వద్ద రెండు సంవత్సరాల ప్రణాళిక ఉంది

### అమెరికా ఆంక్షలకు ఇరాన్ కౌంటర్



**టెహ్రాన్, ఆగస్టు 25:** ఇరాన్‌పై కొన్ని నెలలుగా దాడులు చేసిన అమెరికా ఇప్పుడు ఆర్థికంగా వెన్నువిరిచే ప్రయత్నాలు మొదలుపెట్టింది. అంతర్జాతీయంగా ఇరాన్‌కున్న ఆర్థిక సంబంధాలను తెంచేయడమే లక్ష్యంగా అగ్ర రాజ్యం కొత్త ఆంక్షలను ప్రకటించింది. టెహ్రాన్‌తో సంబంధాలు కొనసాగిస్తూ, నగదు అక్రమ చలామణిలో దానికి తోడ్పడే దేశాలను డాలరు వ్యవస్థ నుంచి దూరం చేస్తామని యుఎస్ ఆర్థిక స్కాట్ బెసెంట్ ప్రకటించారు. దీనికి ఇరాన్ దీటుగా స్పందించింది. ట్రంప్ ప్రభుత్వం విధించిన ఆంక్షలను ఎదుర్కోవడానికి తమ వద్ద రెండేళ్ల ప్రణాళికఉందని, ప్రతీకార చర్యలు తప్పవని బదులి చ్చింది.ఇరాన్‌పై ఆంక్షలు విధించడం కొత్తేంకాదు. ఇరాన్‌కు ప్రపంచడంతో ఉన్న ఆర్థిక జీవనాధారాన్ని తెగ్గొట్ట డమే తాజా ఆంక్షల లక్ష్యమని బెసెంట్ ప్రకటించారు. అయితే యుఎస్ నుంచి ఎదురయ్యే ఒత్తిడిని తమ వాణిజ్య భాగస్వాములు గట్టిగా వ్యతిరేకిస్తారని టెహ్రాన్ వ్యక్తం చేసింది. ఈ మేరకు ఆ దేశ పార్లమెంట్ స్పీకర్ గాలిబఫ్ స్పందించారు. ఇతర దేశాలతో ఇరాన్‌కున్న సంబంధాలను తెగ్గొట్టే స్థితిలో అమెరికా లేద న్నారు. 'అమెరికన్ల ప్రగల్భాలను ఎవరూనమ్మరు. అమెరికా ఆంక్షల ప్రకటనను పరిగణనలోకి తీసుకోబోమని మా వాణిజ్య భాగస్వాములు ఇప్పటికే మాకు సందేశాలు పంపారు' అని పేర్కొన్నారు.



## మహిళలకూ కమాండో శిక్షణ

### ఎన్ఎస్‌జి కీలక నిర్ణయం

**న్యూఢిల్లీ, ఆగస్టు 25:** భారతదేశ ఉగ్రవాద నిరోధక వ్యవస్థలో మహిళల కార్యాచరణ సామర్థ్యాలను బలోపేతం చేసే లక్ష్యంతో, మనేసర్‌లోని నేషనల్ సెక్యూరిటీ గార్డ్ (ఎన్ఎస్‌జి) శిక్షణా అకాడమీ, రాష్ట్ర పోలీసు బలగాలు, కేంద్ర సాయుధ పోలీసు బలగాల (సిఎపిఎఫ్) మహిళా సిబ్బంది కోసం మొట్టమొదటి మహిళా కమాండో కన్వర్షన్ కోర్సు (ఎంసిసిసి)ను ప్రారంభించింది. ఈ కార్యక్రమాన్ని 'నారీ శక్తి'లో ఒక కొత్త మైలురాయిగా అభివర్ణిస్తూ, ఉగ్రవాద నిరోధక కార్యకలాపాలలో క్లిష్టమైన ప్రత్యేక పాత్రలకోసం మహిళా సిబ్బందిని సిద్ధం చేయడమే ఈ కోర్సు లక్ష్యమని ఎన్ఎస్‌జి పేర్కొంది. శారీరకంగా దృఢంగా, సాంకేతికంగా నైపుణ్యం కలిగి, కార్యాచరణకు సిద్ధంగా ఉన్న మహిళా కమాండోలను అభివృద్ధి చేయడానికి ఈ 12 వారాల ఇంటెన్సివ్ కోర్సును రూపొందించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో కఠినమైన శారీరక కండిషనింగ్, ఆయుధాల నిర్వహణ, మార్క్‌మ్యాన్‌షిప్, వ్యూహాత్మక జోక్యం, బందీల రక్షణ, ఉగ్రవాద నిరోధక కార్యకలాపాలకు సంబంధించిన ఇతర ప్రత్యేక అంశాలు ఉంటాయి. వివిధ భద్రతా దళాల నుండి ఎంపిక చేయబడిన మహిళా సిబ్బందికి, దళం ప్రత్యేక ఉగ్రవాద నిరోధక నైపుణ్యాన్ని విస్తరించడం ద్వారా, వ్యక్తిగత నైపుణ్యాభివృద్ధికి అతీతంగా వెళ్లడమే ఎన్ఎస్‌జి శిక్షణా అకాడమీ ఉద్దేశ్యం. ఎన్ఎస్‌జి ప్రకారం, ఈ కోర్సు శిక్షణ పొందిన కార్యాచరణ సిబ్బంది విస్తృత సమూహాన్ని సృష్టించడంలో సహాయపడుతుంది. అదే సమయంలో, ఉమ్మడి వృత్తిపరమైన ప్రమాణాలను ప్రోత్సహిస్తూ, భారతదేశ భద్రతా వ్యవస్థలో పాలుపంచుకుంటున్న వివిధ దళాల మధ్య పరస్పర సహకారాన్ని బలోపేతం చేస్తుంది.

## రెండువారాల్లోగా లొంగిపోవాలి...

### తరుణ్ తేజ్‌పాల్‌కు సుప్రీం ఆదేశం

**న్యూఢిల్లీ, ఆగస్టు 25:** అత్యాచారం కేసులో దోషిగా తేలిన మాజీ తెహెల్కా ఎడిటర్ తరుణ్ తేజ్‌పాల్‌కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. లొంగిపోవడం నుంచి మినహాయింపు కోరుతూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు మంగళవారం తిరస్కరించింది. రెండు వారాల్లోగా లొంగిపోవాలని ఆదేశించింది. తేజ్‌పాల్ పిటిషన్‌పై జస్టిస్ అలోక్ అరాధే నేతృత్వంలోని సింగిల్ జడ్జి బెంచ్ సోమవారం విచారణ పూర్తి చేసి తీర్పును రిజర్వ్ చేసింది. తేజ్‌పాల్ తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్, గోవా ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్‌మెహతా వాదనలు వినిపించారు. తేజ్‌పాల్ అప్పీల్‌ను విచారణకు స్వీకరించాలంటే ముందుగా ఆయన లొంగిపోయినట్లు ధ్రువీకరించే సర్టిఫికెట్ సమర్పించాల్సి ఉంటుందని లేదంటే లొంగిపోవడం నుంచి మినహాయింపు కోరుతూ ప్రత్యేక పిటిషన్ దాఖలు చేయాలని తుషార్ మెహతా వాదించారు. సుప్రీంకోర్టు రూల్స్, 2013తో పాటు గత తీర్పులను ఆయన ప్రస్తావించారు. అయితే కపిల్ సిబల్ మాత్రం గోవా ప్రభుత్వం ప్రస్తావించిన సుప్రీంకోర్టు నిబంధనలు ఈ కేసుకు వర్తించవని వాదించారు. బాంబే హైకోర్టు ఇప్పటికే తేజ్‌పాల్‌కు నాలుగు వారాల గడువు ఇచ్చిందని, అప్పటివరకు ఆయనకు కోర్టు రక్షణ ఉందని తెలిపారు. ఆగస్టు 31న రెగ్యులర్ బెంచ్ ముందు కేసును విచారణకు లిస్ట్ చేయాలని కోరారు. ఈనెల 6న బాంబే హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ తేజ్‌పాల్ ఆగస్టు 20న సుప్రీంకోర్టును ఆశ్రయించారు. 2021లో గోవా సెషన్స్ కోర్టు ఇచ్చిన నిర్దోషి తీర్పును బాంబే హైకోర్టు కొట్టివేసి తేజ్‌పాల్‌ను అత్యాచారం కేసులో దోషిగా తేల్చింది.

## ఇక పైలట్లకు ప్రతి యేటా డోప్ టెస్టులు

### కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

**న్యూఢిల్లీ, ఆగస్టు 25:** ఇకపై పైలట్లకు ప్రతి యేడాది డోప్ టెస్టులు నిర్వహించనున్నట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు మంగళవారం వెల్లడించారు. ప్రస్తుతం ఈ అంశంపై డిజిసిఎ దృష్టి సారించిందని, దీనికి సంబంధించి ఇప్పటికే ఉన్న నిబంధనల్ని పరిశీలిస్తోందని మంత్రి అన్నారు. అలాగే, కొత్త నిబంధనల రూపకల్పనపై దృష్టి సారించిందని తెలిపారు. ఇటీవల ఎయిరిండియా విమానం గాలిలో ఉండగా, కుదుపులకు గురైన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో పలువురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. దీనికి గల కారణాలపై విచారించగా పైలట్ గంజాయి సేవించినట్లు తేలింది. పైలట్లు మత్తులో ఉండటం వల్ల విమాన ప్రయాణికుల ప్రాణాలకు ముప్పు ఉంటుంది. అందువల్ల పైలట్లు ఇలా నిషేధిత డ్రగ్స్ తీసుకోకుండా చర్యలు తీసుకోవాలని, అలాంటి వారిని గుర్తించేందుకు డోప్ టెస్టులు నిర్వహించాలని కేంద్రం భావిస్తోంది.

## బీహార్ సిఎం ఇల్లు ముట్టడి యత్నం

### ఉద్రిక్తంగా మారిన పాట్నా వీధులు



**పాట్నా, ఆగస్టు 25:** బీహార్ రాజధాని పాట్నా రోడ్లు మంగళవారం రణరంగాన్ని తలపించాయి. వందలాది మంది విద్యార్థులు, నిరుద్యోగ అభ్యర్థులు తమ ఆగ్రహాన్ని వ్యక్తంచేస్తూ ముఖ్యమంత్రి సమ్రాట్ చౌధరి నివాసాన్ని ముట్టడించేందుకు దూసుకెళ్లారు. బీహార్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే 70వ పరీక్షను వెంటనే రద్దు చేయాలని, ప్రశ్నాపత్రాల లీకేజీలు, పరీక్షల నిర్వహణలో జరుగుతున్న అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ అభ్యర్థులు ఈ ఆందోళన చేపట్టారు. ఉదయం 10 గంటల ప్రాంతంలో చారిత్రాత్మక గాంధీ మైదాన్ నుంచి ప్రారంభమైన ఈ నిరసన ర్యాలీ క్రమంగా తీవ్రరూపం దాల్చింది. నిరసనకారులు ముఖ్యమంత్రి నివాసంవైపు దూసుకెళ్లకుండా పోలీసులు మార్గమంతటా భారీగా బారికేడ్లను ఏర్పాటు చేసినప్పటికీ, ఆగ్రహంతో ఉన్న విద్యార్థులు వాటిని తోసుకుంటూ ముందుకు సాగారు. బారికేడ్లను బద్దలు కొట్టుకుని వస్తున్న అభ్యర్థులను అడ్డుకునేందుకు పోలీసులు శతవిధాలా ప్రయత్నించడంతో అక్కడ తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. నిరసనకారులను చెదరగొట్టడానికి పోలీసులు పలుచోట్ల లాఠీఛార్జ్ చేయడంతోపాటు వాటర్ కెన్లను ప్రయోగించారు. అయినా సరే వెనక్కి తగ్గనివిద్యార్థులు, పోలీసుల హెచ్చరికలను దాటుకుంటూ సిఎం నివాసానికి చేరువగా వెళ్లడం విశేషం. నిజానికి పట్నాలోని గర్దానీబాగ్ ప్రాంతంలో పోటీపరీక్షలు, ఉద్యోగనియామకాలకు సంబంధించి అభ్యర్థులు కొద్దిరోజులుగా నిరంతర నిరసనలు తెలుపుతున్నారు. నిరసనకారుల ప్రతినిధులతో ప్రభుత్వం సోమవారం జరిపిన చర్చలు సానుకూలంగానే ముగిసినప్పటికీ, తమ ప్రధాన డిమాండ్లు నెరవేరేవరకు వెనక్కి తగ్గేది లేదని అభ్యర్థులు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలోనే గాంధీమైదాన్ నుంచి సిఎం నివాసానికి మార్చ్‌ను ప్రకటించి అమలు చేశారు. ప్రభుత్వం తరఫున కేవలం జూనియర్ అధికారులతో మాట్లాడించి విషయాన్ని దాటవేస్తున్నారని, ఈసారి నేరుగా ముఖ్యమంత్రే తమతో చర్చలు జరపాలని విద్యార్థి నేత సౌరవ్‌కుమార్ స్పష్టంచేశారు. తమ తరఫున ఒక ప్రతినిధి బృందాన్ని సిఎం లేదా విద్యాశాఖమంత్రి వద్దకు పంపడానికి సిద్ధంగా ఉన్నామని, వారిద్దరూ తప్ప వేరే ఏఅధికారితోనూ మాట్లాడేది లేదని, సిఎం నుంచి అధికారిక ప్రకటన వస్తేనే నిరసన విరమిస్తామని విద్యార్థి నాయకులు తేల్చిచెప్పారు. ఒకవైపు అభ్యర్థుల ఆందోళనలు ఉధృతంగా సాగుతుండగానే, మరోవైపు బీహార్ ప్రభుత్వం విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం విద్యార్థి సహాయోగ్ శివిర్ పేరిట ఒక నూతన కార్యక్రమాన్ని ప్రకటించింది. ప్రభుత్వం ఎంతటి సంక్షేమ కార్యక్రమాలు ప్రకటించినప్పటికీ, 70వ బిపిఎస్‌సి పరీక్ష అక్రమాలపై కచ్చితమైన చర్యలు తీసుకునేవరకు పోరాటాన్ని ఆపేది లేదని నిరుద్యోగులు భీష్మించుకూర్చోవడంతో ఉత్కంఠ కొనసాగుతూనే ఉంది.

## భారత్ ప్రజాస్వామ్యానికి బిఎల్‌ఒలే పునాది

### కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్

### ఎన్నికల యంత్రాంగం ప్రపంచంలోనే అతిపెద్ద కుటుంబంగా అభివర్ణన



**లక్నో, ఆగస్టు 25:** భారత ప్రజాస్వామ్యానికి 'బూత్ స్థాయి అధికారుల్లు (బిఎల్ఒ) పునాది వంటివారని ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేష్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం లక్నోలో నిర్వహించిన సమావేశంలో ఆయన బిఎల్‌ఒలతో ముచ్చటించారు. ఈ సమావేశం అనంతరం విలేకరులతోమాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియలో బిఎల్‌ఒల కీలక పాత్రను, వారి అంకితభావాన్ని, పారదర్శకతను ప్రశంసించారు. "బిఎల్‌ఒలు భారత ప్రజాస్వామ్యానికి పునాది. ప్రతి బూత్ స్థాయి అధికారి తమ బూత్ పరిధిలోని ఓటర్లకు తమ పారదర్శకత, అంకితభావం ద్వారా సుపరిచితులు మాత్రమే కాదు, దేశవ్యాప్తంగా, ప్రపంచవ్యాప్తంగాకూడా గుర్తింపు, గౌరవం పొందుతున్నార్లు" అని సిఇసి జ్ఞానేష్ కుమార్అన్నారు. బిఎల్‌ఒల అనుభవాలను తెలుసుకోవడం, వారిసూచనలను స్వీకరించడమే ఈ సమావేశం ముఖ్య ఉద్దేశమని ఆయన తెలిపారు. సుమారు 97 కోట్ల మంది ఓటర్లు ఉన్న భారతదేశాన్ని, దేశ ప్రజాస్వామ్య వ్యవస్థ, ఎన్నికల యంత్రాంగం భారీ స్థాయిని నొక్కి చెబుతూ, జ్ఞానేష్ కుమార్ దీనిని "ప్రపంచంలోనే అతిపెద్ద కుటుంబం" గా అభివర్ణించారు.

ఇఎల్‌సి 2.0, ఇసిఐఎన్‌ఇటి ప్రాంతీయ సదస్సులో సిఇసి జ్ఞానేష్ కుమార్ మాట్లాడుతూ, వివిధ స్థాయిలలోని ఎన్నికల అధికారులను అనుసంధానించే వేదికగా ఇసిఐఎన్‌ఇటి ప్రాముఖ్యతను ఆయన వివరించారు. సుమారు నాలుగు, ఐదు నెలల క్రితం ప్రారంభించిన ఈ యాప్, ఈ యేడాది చివరి నాటికి భారతదేశంలోని అతిపెద్ద అప్లికేషన్లలో ఒకటిగా నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రపంచంలోని అనేక ప్రధాన ప్రాంతాల మొత్తం ఓటర్ల జనాభా కంటే భారతదేశ ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉందని జ్ఞానేష్ కుమార్ పేర్కొన్నారు. "భారత దేశంలో సుమారు 97 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. ఈ సంఖ్య కేవలం ఒక గణాంకం మాత్రమే కాదు, ఇది చాలా ముఖ్యమైనది. అమెరికా, కెనడా, దక్షిణ అమెరికా, మొత్తం ఐరోపా, మొత్తం ఆఫ్రికా, ఆగ్నేయాసియా దేశాల ఓటర్ల సంఖ్యను కలిపినా, అప్పటికీ సుమారు ఎనిమిది కోట్ల మంది ఓటర్లు మిగిలే ఉంటారు. మీరు అటువంటి భారీ ప్రజాస్వామ్యంలో భాగం. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద కుటుంబం" అని పునరుద్ఘాటించారు. లోక్‌సభ ఎన్నికల సమయంలో ఎన్నికల సంఘం నిర్వహించే భారీ స్థాయి కార్యకలాపాల గురించి కూడా జ్ఞానేష్ కుమార్ ప్రస్తావించారు. "ప్రపంచంలోనే అతిపెద్ద ప్రభుత్వమైన భారత ప్రభుత్వం 65 లక్షల మందికి ఉపాధి కల్పిస్తుండగా, అతిపెద్ద ప్రైవేట్ సంస్థ అయిన వాల్‌మార్ట్ సుమారు 20 లక్షల మందికి ఉపాధినిస్తోంది. లోక్‌సభ ఎన్నికల సమయంలో, 1.8 కోట్ల మంది సిబ్బందితో కలిసి పనిచేసే భారత ఎన్నికల సంఘం (ఇసిఐ) ప్రపంచంలోనే అతిపెద్ద సంస్థగా మారుతుంది" అని ఆయన అన్నారు.

## దేశీయ పరిశ్రమలకే డిఆర్‌డిఒ క్షిపణి టెక్నాలజీ

### రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్



**న్యూఢిల్లీ, ఆగస్టు 25:** ఆయుధాల తయారీలో స్వయం సమృద్ధి సాధించే దిశగా భారత్ చేస్తున్న ప్రయత్నాలకు పెద్ద ఊతం లభించింది. దేశీయంగా ఉత్పత్తి చేసేందుకు వీలుగా, డిఆర్‌డిఒ అభివృద్ధి చేసిన అన్ని సంప్రదాయ క్షిపణి వ్యవస్థల సాంకేతికతను దేశీయ పరిశ్రమలకు బదిలీ చేయడానికి రక్షణ శాఖ ఆమోదం తెలిపింది. ఈ సాంకేతికత బదిలీ (టిఒటి) భారతీయ కంపెనీల భాగస్వామ్యాన్ని పెంచడంలో సహాయపడుతుందని పేర్కొంది. "రక్షణ రంగంలో 'ఆత్మనిర్భరత' (స్వయం సమృద్ధి) లక్ష్యాన్ని సాధించే దిశగా ఒక కీలక అడుగుగా, డిఆర్‌డిఒ అభివృద్ధి చేసిన అన్ని సంప్రదాయ క్షిపణి వ్యవస్థల సాంకేతికతను దేశీయంగా ఉత్పత్తి చేసేందుకు భారతీయ పరిశ్రమలకు బదిలీ చేయడానికి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆమోదం తెలిపార్లు" అని రక్షణ శాఖ 'ఎక్స్' వేదికగా తెలిపింది. రష్యా వంటి దేశాల నుండి ఆయుధాల దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించుకోవడం, దేశంలో బలమైన రక్షణ తయారీ రంగాన్ని నిర్మించడం లక్ష్యంగా కేంద్రం ఈ చర్య చేపట్టింది.

"ఈ సాంకేతికత బదిలీ, భారతీయ పరిశ్రమలు తమ అర్హతలు, ధ్రువీకరణలు, నియంత్రణ నిబంధనలకు అనుగుణంగా స్వదేశీ ఉత్పత్తిని చేపట్టేలా చేయడం ద్వారా రక్షణ రంగ వ్యవస్థలో వాటి భాగస్వామ్యాన్ని పెంచడంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుంది" అని కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా రాసుకొచ్చారు. దేశీయ తయారీ పరిశ్రమ సామర్థ్యాలను మెరుగుపరచడం, రక్షణ పారిశ్రామిక పునాదిని బలోపేతం చేయడం, సరఫరా గొలుసులో ఎంఎస్‌ఎంఇలు, అలాగే ఇతర సాంకేతిక భాగస్వాముల భాగస్వామ్యాన్ని కల్పించడం తమ లక్ష్యమని పేర్కొన్నారు. "ఈ విధానం క్షిపణి వ్యవస్థల అభివృద్ధి నుండి పారిశ్రామిక ఉత్పత్తికి విజయవంతమైన పరివర్తనను సాధ్యం చేస్తుంది. అధునాతన రక్షణ వ్యవస్థల అభివృద్ధి, తయారీ కోసం భారతీయ పరిశ్రమ సామర్థ్యాలను వినియోగించుకోవడంలో డిఆర్‌డిఒ చేస్తున్న నిరంతర కృషిని ఇది ప్రతిబింబిస్తుంది" అని పేర్కొన్నారు.

# సంక్షిప్త వార్తలు

## చైనా ఉపాధ్యక్షుడు హాన్‌జెంగ్‌తో అజిత్ దోవల్ భేటీ



**బీజింగ్, ఆగస్టు 25:** జాతీయ భద్రతా సలహాదారు అజిత్‌దోవల్ ప్రస్తుతం చైనాలో పర్యటిస్తున్నారు. మంగళవారం ఆయన చైనా ఉపాధ్యక్షుడు హాన్‌జెంగ్‌తో భేటీ అయ్యారు. చైనా విదేశాంగమంత్రి, కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ చైనా సెంట్రల్ కమిటీ సభ్యుడు వాంగ్‌యి ఆహ్వానం మేరకు అజిత్ దోవల్ అక్కడ పర్యటిస్తున్నారు. చైనాకు చెందిన వివిధ ప్రజా ప్రతినిధులతో భేటీలో భాగంగా చైనా ఉపాధ్యక్షుడు హాన్‌జెంగ్‌తో భేటీ అయ్యారు. రెండు దేశాల మధ్య శాంతి నెలకొల్పే అంశాలతోపాటు, సరిహద్దు వివాదంపైకూడా చర్చలుజరిపారు. సరిహద్దులో వివాదాలు, ఉద్రిక్త పరిస్థితులు నెలకొనకుండా చూడటమే లక్ష్యంగా ఈ భేటీ జరిగింది. అలాగే, ఆర్థిక, రాజకీయ అంశాలతో పాటు ఇతర ద్వైపాక్షిక అంశాలపై కూడా చర్చించారు.

## ఢిల్లీలో నిరసనలపై ఇక ప్రత్యేక నిఘా

**న్యూఢిల్లీ, ఆగస్టు 25:** ఢిల్లీలో వరుసగా జరుగుతున్న నిరసనలు, వాటి వల్ల తలెత్తే శాంతి భద్రతల సమస్యపై ఢిల్లీ పోలీసులు ప్రత్యేక దృష్టి సారించబోతున్నారు. ఈ నిరసనల్ని ముందుగా గుర్తించేందుకు ఇంటెలిజెన్స్ వ్యవస్థను మరింత పటిష్టంచేయాలని పోలీసులు భావిస్తున్నారు.ఇందుకోసం స్పెషల్ బ్రాంచ్ పోలీసులు శ్రీకారంచుట్టారు. ఇటీవల జంతర్ మంతర్‌వద్ద సిజెపి నిరసన సందర్భంగా తలెత్తిన ఘర్షణల నేపథ్యంలో ఇంటెలిజెన్స్ వ్యవస్థను మరింతపటిష్టం చేయాల్సిందిగా ఢిల్లీపోలీస్ కమిషనర్ ఆదేశించారు.


## డేరాబాబాకు 17వ సారి పెరోల్

**రోహ్‌తక్, ఆగస్టు 25:** అత్యాచారం కేసులో దోషిగా తేలిన డేరా సచ్చా సౌదా చీఫ్ గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్ అలియాస్ డేరా బాబాకు మరోసారి పెరోల్ దొరికింది డేరా బాబా అత్యాచారం కేసులో 20 యేళ్ల జైలు శిక్ష అనుభవిస్తున్న ఆయనకు మరో 21 రోజుల పెరోల్ మంజూరైంది. 2017లో శిక్ష పడిన తర్వాత ఇది ఆయనకు ఇది 17వ తాత్కాలిక విడుదల కావడం గమనార్హం. హర్యానాలోని రోహ్‌తక్ సునారియా జైలు నుంచి ఈ రోజు తెల్లవారుజామున రామ్ రహీమ్ బయటకు వచ్చారు. పెరోల్ కాలంలో సిర్సాలోని డేరా సచ్చా సౌదా ప్రధాన కార్యాలయంలో ఆయన ఉండనున్నారు.

## ఢిల్లీలో 2,300 దాటిన స్వైన్‌ఫ్లూ కేసులు

**న్యూఢిల్లీ,ఆగస్టు 25:** దేశ రాజధాని ఢిల్లీలో స్వైన్‌ఫ్లూ కేసుల సంఖ్య 2,300 దాటిందని ఢిల్లీ ఆరోగ్యశాఖ మంత్రి పంకజ్ సింగ్ వెల్లడించారు. కేసులు పెరుగుతున్నప్పటికీ ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భారత వైద్య పరిశోధనా మండలి డైరెక్టర్ జనరల్ డాక్టర్ రాజీవ్ బహల్ స్పష్టం చేశారు. ఇవి వారానికొకసారి నమోదయ్యే సాధారణ గణాంకాల్లో భాగమేనని బహల్ తెలిపారు. ప్రస్తుతం నమోదవుతున్న హెచ్‌వన్‌ఎన్‌వన్ వైరస్ 2009లో కనిపించిన సాధారణ స్ట్రెయిన్‌నేనని, ఇందులో కొత్తదనం ఏమీ లేదని చెప్పారు. ఇప్పుడు దీనిని స్వైన్‌ఫ్లూ అని కాకుండా సీజనల్ ఫ్లూగా పరిగణిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

## స్వరాష్ట్రంలో చేపల మార్కెట్‌కు ప్రధాని మోడీ పేరు!




**సూరత్, ఆగస్టు 25:** గుజరాత్‌లోని సూరత్‌లో ఓ చేపల మార్కెట్‌కు ప్రధాని మోడీ పేరు పెట్టడంపై వివాదం చెలరేగింది. నాన్‌పురాలోని లక్కడ్‌కోట్ ప్రాంతంలో కొత్తగా నిర్మించిన హోల్‌సేల్ చేపల మార్కెట్ ప్రవేశద్వారం దగ్గర 'శ్రీ నరేంద్ర మోడీ హోల్‌సేల్ ఫిష్ మార్కెట్' పేరుతో ఓ బోర్డును ఏర్పాటు చేశారు. అందులో ప్రధాని మోడీ ఫొటోతో పాటు సూరత్ ఫిష్ మర్చంట్ అసోసియేషన్ పేరు కూడా ఉంది. దీనిపై కొందరు స్థానిక చేపల వ్యాపారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రధాని మోడీ శాఖాహారి కావడంతో ఆయన పేరును చేపల మార్కెట్‌కు పెట్టడం సరైన నిర్ణయం కాదని కొందరు వ్యాపారులు ప్రశ్నించారు.

# మండలి, అసెంబ్లీ సంయుక్త ఎస్టీ, బిసి, మహిళా సంక్షేమ కమిటీలు ప్రారంభం

## పాల్గొన్న మండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి, స్పీకర్ ప్రసాద్‌కుమార్, మంత్రి శ్రీధర్‌బాబు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 25:** శాసన పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం శాసనసమండలి,శాసనసభ (లెజిస్లేచర్) సంయుక్త షెడ్యూల్ తెగల సంక్షేమ కమిటీ, వెనుకబడిన వర్గాల సంక్షేమ కమిటీ, మహిళా, శిశు, వృద్ధుల సంక్షేమ కమిటీల ప్రారంభ సమావేశాలు జరిగాయి. ఈ సమావేశాలను శాసన పరిషత్ చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, శాసన వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్ ప్రారంభించారు, ఎస్టీ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు, సభ్యులు డాక్టర్ మురళీ నాయక్, రాందాస్ మాలోతు, కోవా లక్ష్మీ ్ర, అనిల్ జాదవ్, తెల్లం వెంకట్రావు, పింగళి శ్రీపాల్ రెడ్డి,బిసి వెల్ఫేర్ కమిటీ చైర్మన్ మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, సభ్యులు ఆర్. భూపతి రెడ్డి, చింతా ప్రభాకర్, శ్రీ గణేష్, రామారావు పవార్, యల్ రమణ, తీన్మార్ మల్లన్న. మహిళా, శిశు, దివ్యాంగులు, వృద్ధుల వెల్ఫేర్ కమిటీ చైర్మన్ చిట్టెం పర్ణిక రెడ్డి, సభ్యులు మట్టా రాగమయి, కోవా లక్ష్మీ, వాణీ దేవి హాజరయ్యారు. శాసనమండలి కార్యదర్శి డా.వి నరసింహ చార్యులు, శాసనసభ కార్యదర్శి రేండ్ల తిరుపతి.అధికారులు పాల్గొన్నారు. గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ శాసన వ్యవస్థలో కమిటీలకు ఎంతో ప్రాధాన్యత ఉన్నది. ప్రజల సమస్యలను లోతుగా అధ్యయనం చేసి, వాటి పరిష్కారానికి ప్రభుత్వానికి అవసరమైన సూచనలు, సిఫారసులు చేయడంలో కమిటీలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు.గత ప్రభుత్వ హయాంలో షెడ్యూల్ తెగల వారికి సబ్సిడీ పథకాలు అమలు కాక లబ్దిదారులు నేటికీ సబ్సిడీ పేపర్లు పట్టుకొని తిరుగుతున్నారు. అలాంటి పరిస్థితి రాకుండా చూడాల్సిన బాధ్యత కమిటీ చైర్మన్ సభ్యులపైన ఉన్నదన్నారు. గిరిజనులు, వెనుకబడిన తరగతులు, మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కమిటీలు ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. సంక్షేమ పథకాల అమలులో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ పరిష్కార మార్గాలను సూచించాలి.కమిటీల సభ్యులు ప్రజల నుంచి వచ్చే సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి, వాటి పరిష్కారానికి తోడ్పాటు అందించాలని చెప్పారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ లెజిస్లేటివ్ కమిటీలు ప్రభుత్వం, ప్రజల మధ్య ఒక ముఖ్యమైన వారధిగా పని చేయాలి. తద్వారా పథకాల అమలులో ప్రభుత్వం మెరుగైన ఫలితాలు సాధించేందుకు ప్రజలకు పథకాలు మరింతగా చేరువయ్యేందుకు ఉపయోగపడు తుందన్నారు. రాష్ట్ర జనాభాలో 10.45 శాతం మంది ఉన్న షెడ్యూల్డ్ తెగల జీవన పరిస్థితులను అధ్యయనం చేయడం, వారి సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల అమలు తీరును సమీక్షించడం, లోటుపాట్లను గుర్తించడం, వారి సమగ్ర అభివృద్ధికి అవసరమైన సూచనలను ప్రభుత్వానికి అందించడం ఈ షెడ్యూల్ తెగల సంక్షేమ కమిటీ ప్రధాన కర్తవ్యం అని చెప్పారు. కమిటీలు ప్రజల అవసరాలను అర్థం చేసుకుని, అర్థవంతమైన సిఫార్సుల ద్వారా వారి జీవన నాణ్యతను మెరుగుపరచడానికి దోహదపడాలని చెప్పారు. మహిళల భద్రత, ఆర్థిక సాధికారతకు సంబంధించిన పథకాలు, శిశు సంక్షేమ సంస్థలు, అంగన్వాడీల పనితీరు, దివ్యాంగులకు అందుబాటులో ఉన్న సౌకర్యాలు, అలాగే వయోవృద్ధులకు అందుబాటులో ఉన్న జీవన పరిస్థితులు, ఆరోగ్య సంరక్షణ వంటి అంశాలపై కమిటీ ప్రత్యేక శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు. శాసన వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ శాసనమండలి సంయుక్త కమిటీలు అత్యంత ప్రభావితమైనవని,బలహీన వర్గాల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి ఈ సంయుక్త కమిటీ సూచనలు, సలహాలు ఉపయోగపడు తాయన్నారు. క్షేత్ర స్థాయిలోని సమస్యలను గుర్తించి వాటికి పరిష్కారాలతో ప్రభుత్వం దృష్టికి తీసుకురావడం ద్వారా పరిష్కరించవచ్చునని చెప్పారు.

# నేడు ప్రజలతో ముఖాముఖితో వి.హనుమంతరావు

**హైదరాబాద్, ఆగస్టు 25,ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రజల సమస్యలను సత్వరంగా పరిష్కరించేందుకు గాంధీభవన్‌లో ప్రతి బుధవారం ఏర్పాటు చేసే 'ప్రజలతో ముఖాముఖి' కార్యక్రమంలోని బిసి వెల్ఫేర్ డిపార్ట్మెంట్ తెలంగాణ ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు పాల్గొంటారు. ప్రజలకు ప్రభుత్వం-పార్టీ మధ్య ప్రత్యక్ష వేదికగా తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ప్రతి బుధవారం ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. ప్రజలు తమ సమస్యలకు సంబం ధించిన వినతిపత్రాలు అవసరమైన ఆధార పత్రాలతో వస్తే వారి సమస్యలను అధికారదృష్టికి తీసుకెళ్ళిపరిష్కారంకు కృషిచేస్తారు. .ప్రజలు సమర్పించిన వినతులను సంబంధిత ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసి, వీలైనంత త్వరగా పరిష్కారం లభించేలా 'ప్రజలతో ముఖాముఖి' కమిటీ నాయకులు సంగిశెట్టి జగదీశ్వర్ రావు, నిరంతరం కృషిచేస్తారు. అలాంటి వేదికపై విహెచ్ హాజరై ప్రజల విన్నపాలను బుధవారం స్వీకరిస్తారు.




మంగళవారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

# తప్పుడు ప్రచారం తిప్పికొట్టి ప్రభుత్వాన్ని కాపాడుకొందాం

## భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 25,ప్రభాతవార్త:** ప్రతిపక్షపార్టీ లైన బిజెపి బిఆర్ఎస్ సోషల్ మీడియాలో చేస్తున్న అసత్య ప్రచారం ప్రతి ఒక్కరు తిప్పి కొట్టి ప్రభుత్వంను కాపాడుకోవాలని భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి హితవు చెప్పారు. గాంధీభవన్‌లో మంగళవారం విలేఖరులతో మాట్లాడుతూ దేశంలో మోడీ తో పాటు అందరూ సోషల్ మీడియాలో యాక్టవ్‌గా ఉన్నారని హెచ్చరించారు. మీడియా కమిటీ చైర్మన్ గా అందరి సోషల్ మీడియా హ్యాండిల్స్ పరిశీలిస్తా అనిఆయన తెలిపారు. అధికారంలోకి రావడానికి అందరూ కష్టపడ్డారనీ ఇప్పుడు అధికారం వచ్చాక అధికారాన్ని కాపాడు కోవడానికి ప్రతి పక్షాల తప్పుడు ప్రచారం ప్రతి ఒక్కరు తిప్పి కొట్టాలనీ సూచించారు. నీతి ఆయోగ్ ప్రకారం దేశంలో 8.7 కోట్ల మందికి విద్య లేదు,ట్రేనింగ్ లేదు విద్య లేనప్పుడు వికసిత్ భారత్ ఎట్లా అవుతుందనీ ప్రశ్నిం చారు. తెలంగాణ లో రేవంత్ విద్య ను డెవలప్మెంట్ చేస్తుంటే ఆయన అమెరికా పర్యటను అడ్డుకొన్నారని ఆవేదన చెందారు. సగం, సగం తెలిసిన నాయకులు సిఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటన పై మాట్లాడుతున్నారనీ అన్నారు.కిషన్ రెడ్డి కూడా నాపర్యటనకు పెర్మిషన్ ఇవ్వలేదు అంటుండనీ ఆయన ఏమైనా సిఎం స్థాయి వ్యక్తా ?కిషన్ రెడ్డి గుజరాత్ కు ముఖ్యమంత్రి అయినట్లు మట్లాడుతుండనీ ఎద్దేవా చేశారు. సిఎం రేవంత్ రెడ్డి యుకె పర్యటనకు అనుమతి ఇచ్చి అమెరికా పర్యటన కు అనుమతి ఇవ్వలేదదన్నారు. ఇలా ఎప్పుడు జరగలేదు తెలంగాణ కు రావాల్సిన సెమికండక్టర్లను గుజరాత్‌కు ఎందుకు తరలించారనీ అన్నారు. మూసీ, ఆర్ఆర్ఆర్, మెట్రో అభివృద్ధిని ఎందుకు అడ్డుకుంటున్నారని అడిగారు.


# గిరిజనుల సమగ్ర ప్రగతికి ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలి

## గిరిజన సర్పంచ్‌ల ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్యా సంతోష్‌నాయక్

**హైదరాబాద్, ఆగస్టు 25,ప్రభాతవార్త:** గిరిజన తండాలు, గూడాల సమగ్ర ప్రగతి కోసం ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేసి ఐదు వేల కోట్ల బడ్జెట్ కేటాయించాలని పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం గిరిజన సర్పంచ్‌లకు పూర్తి అధికారాలు, పరిపాలనా స్వేచ్ఛను కల్పించాలని గిరిజన సర్పంచ్ ఫోరం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు భూక్యా సంతోష్‌నాయక్ డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం రాష్ట్ర గిరిజన సర్పంచ్ ఫోరం ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో జరిగిన ఆవిర్భావ సదస్సులో ఆయన మాట్లాడుతూ..గిరిజన తండాలను రెవెన్యూ గ్రామ పంచాయతీలుగా గుర్తించాలన్నారు. 2018 పంచాయతీ చట్టం ముందు ఏ విధంగా అయితే సర్పంచులకు గ్రామాలపై పూర్తి అధికారం ఉందో ఆ విధంగా ఉండాలన్నారు. ప్రతి తండా గ్రామపంచాయితీలో డిజిటల్ లైబ్రరీని ఏర్పాటు చేయడంతో పాటు, గిరిజనులకు సబ్సిడీ నిధులు విడుదల చేసి ఇందిరమ్మ ఇల్లుని ప్రత్యేకంగా కేటాయించాలన్నారు. అలాగే తండాల్లోని పాఠశాలను ప్రైవేట్ మాదిరిగా అభివృద్ధి చేసి నాణ్యమైన విద్యను అందించాలని కోరారు. గిరిజన పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని గిరిజనులకు క్యాబినేట్‌లో స్థానం కల్పించాలన్నారు. ఐటీడీఏ గిరిజన గ్రామాల్లో ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సర్పంచులు చిరంజీవి, రాంజీ నాయక్, లైలా పరమేష్, సునీత, బానోజీ సతీష్ కుమార్, సుధాకర్ నాయ క్, కుర్ర రాజేందర్ నాయక్, మహేందర్, రాంసింగ్‌నాయక్ తదితరులు మాట్లాడారు. ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షుడుగా సంతోష్‌నాయక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు

# కేంద్రం తక్షణమే జనగణనలో బిసి కులగణన చేపట్టాలి: బిసి నేతలు డిమాండ్

**హైదరాబాద్ (సైఫాబాద్), ఆగస్టు 25, ప్రభాతవార్త:** బిసిల కులగణన చేయాలనే డిమాండ్‌ను కే ంద్ర ప్రభుత్వం గుర్తించి తక్షణమే చర్యలు తీసుకోవాలని రాష్ట్ర శాసన మండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి డిమాండ్ చేశారు. స్వాతంత్ర్య వచ్చిన నాటి నుంచి నేటివరకు దేశంలో సగభాగం ఉన్న బిసిలకు న్యాయం జరగలేదని, సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో న్యాయం జరగాలంటే తక్షణమే కేంద్రం జనగణనలో కులగణన చేపట్టాలని కోరారు. బిసిసంక్షేమ సంఘం జాతీయ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం గన్‌పార్కులో అమరవీరుల స్థూపం వద్ద మండల్ జయంతి సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. మతాలకు లెక్కలు ఉన్న ప్పుడు కులాలు ఎందుకు జరగవని, ప్రపంచంలోని వివిధ మతాల జనాభా లెక్కలు అందుబాటులో ఉన్నప్పుడు కుల వ్యవస్థ బలంగా ఉన్న భారతదేశంలో బిసి కులగణన ఎందుకు చేయడం లేదని ఆయన ప్రశ్నించారు. రాజకీయ పార్టీలు అధికారంలోకి రావడానికి బిసిలను కేవలం ఓటు బ్యాంకుగా ఉపయోగించుకోడమే కాకుండా వారికి ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ బిసిల జనాభాపై అధికారిక లెక్కలు లేకపోవడం వల్ల రిజర్వేషన్‌లపై కోర్టుల్లో ఆనేక సమస్యలు వస్తున్నాయని విచారం వ్యక్తం చేశారు. బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ బిజెపి బిసిల ఓట్ల కోసం మాత్రమే దీక్షలు, కార్యక్రమాలు చేస్తుందని, బిసిల కులగణన విషయంలో స్పష్టమైన నిర్ణయిం తీసుకోలేకపోతున్నదని ఆరోపించారు. ప్రమావేశంలో బిసి నాయకులు గుజ్జ కృష్ణ, కుందారం గణేషాచారి, కుల్కచర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



గన్‌పార్కు వద్ద నిరసన ప్రదర్శనలో పాల్గొన్న మధుసూదనాచారి, వి.శ్రీనివాస్‌గౌడ్, జాజుల శ్రీనివాస్‌గౌడ్, గుజ్జ కృష్ణ తదితరులు

# సత్యం మాత్రమే సామాజిక మాధ్యమాలు ప్రచారం చేయాలి: మహేశ్‌కుమార్‌గౌడ్

## పిసిసి సోషల్ మీడియా చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన పెట్టెం నవీన్

**హైదరాబాద్, ఆగస్టు 25,ప్రభాతవార్త:** ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లడంతోపాటు కాంగ్రెస్‌పార్టీ గాంధేయ సిద్దాంతాలకు బహుళ ప్రచారం కలిగించి అహింసాపూరిత ఆలోచనలు పెంచేందుకు సామాజిక మాధ్యమాలు పనిచేయాలని టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ పిలపు నిచ్చారు. పిసిసిఅధ్యక్షుడు, మహేశ్ కుమార్, ఎఐసిసి కార్య దర్శి సచిన్ సావంత్ సమక్షంలో పిసిసి సోషల్ మీడియా నూతన చైర్మన్ గా నవీన్ పెట్టెం మంగళవారం అధికారికంగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. చైర్మన్‌తో పాటు నూతనంగా నియమితులైన సోషల్ మీడియా కన్వీనర్లు, కోఆర్డినేటర్లు కూడా తమ తమ బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ సత్యం ఎప్పుడు విజయం సాధిస్తోందని సత్యం మాత్రమే సామాజిక మాధ్యమాలు ప్రచారం చేయాలని కోరారు. ప్రజల్లో శాస్త్రీయ ఆలోచనలు పెంచాలని ఆయన సామజికమాధ్యమాలకు హితవు చెప్పారు. ఈ కార్యక్రమంలో భువనగిరి ఎంపి, టిపిసిసి మీడియా చైర్మన్ చామల కిరణ్ కుమార్ రెడ్డి , జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ , రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ , యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్ రెడ్డి, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు మరియు పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు. పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం నవీన్ పెట్టెం మాట్లాడుతూ 'ప్రజా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లడం, క్షేత్రస్థాయి ముఖ్యంగా గ్రామస్థాయి సమస్యలను పిసిసి అధ్యక్షుడి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడం వంటి కర్తవ్యం నిర్వహిస్తామని తెలిపారు. అలాగే 2029లో కాంగ్రెస్ పార్టీని 101 స్థానాల్లో గెలిపించి, మళ్లీ అధికారంలోకి తీసుకు రావడానికి అహర్నిశలు శ్రమించడమే మా లక్ష్యం' అని పేర్కొన్నారు.



# రేపటి నుంచి అగ్రి బిఎస్సీ కోర్సులకు కౌన్సెలింగ్

## ఉపకులపతి అల్దాస్ జానయ్య

**హైదరాబాద్ (అత్తాపూర్) ఆగస్టు 25,ప్రభాతవార్త :** 2026-27 విద్యా సంవత్సరానికి ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధి లోని 13 కళాశాల లోని బిఎస్సీ(ఆనర్స్) అగ్రికల్చర్, బీ ఎస్సీ (ఆనర్స్) హార్టీకల్చర్, బీ టెక్(ఫుడ్ టెక్నాలజీ) కోర్సు లలోని రెగ్యులర్ సీట్ల భర్తీకి మొదటి విడత కౌన్సిలింగ్ ఈ నెల 27న ప్రారంభం కానుందని ఉప కులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య తెలిపారు. మంగళవారం ఆయన ఓ ప్రకటనలో మాట్లాడుతూ.. రాజేంద్రనగర్‌లోని విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో ఉదయం 9.30 గంటలకు కౌన్సిలింగ్ ప్రారంభం అవుతుందన్నారు.

తొలి విడత కౌన్సిలింగ్ 29 వ తేదీ( శనివారం) వరకూ సాగుతుందని జానయ్య వివరించారు.తెలంగాణా ఎప్ సెట్ 2026 లో అర్హులై ఇప్పటికే ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకున్న బైపీసీ స్ట్రీమ్ అభ్యర్థులు ఈ కౌన్సిలింగ్ కి హాజరు కావాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. ఏ ఏ తేదీల్లో ఏ ఏ ర్యాంకుల వారు కౌన్సిలింగ్ కి హాజరు కావాలన్న వివరాలు వెబ్ సైట్ లో పొందుపరిచామని జానయ్య వివరించారు.అదే విధంగా కౌన్సిలింగ్ కి హాజరు అయ్యే అభ్యర్థులు, వారి తల్లితండ్రులు తీసుకుని రావాల్సిన ధృవ పత్రాలు తదితర వివరాలని వెబ్ సైట్ లో పొందుపరిచామని జానయ్య పేర్కొన్నారు. పూర్తి సమాచారాన్ని విశ్వవిద్యాలయం వెబ్ సైట్‌లో చూడాలని జానయ్య సూచించారు.



'చలో సచివాలయం ముట్టడి' కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న పిల్లి సుధాకర్ తదితరులు

# మాలలకు జరుగుతున్న అన్యాయాలపై 31న 'చలో సచివాలయం ముట్టడి'

## జాతీయ మాల మహానాడు రాష్ట్ర కమిటీ

**హైదరాబాద్ (సైఫాబాద్), ఆగస్టు 25, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని లక్షలాది మంది మాలలకు విద్యా, ఉద్యోగ అవకాశాలు గండి కోడుతున్న రోస్టర్ విధానాన్ని సవరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 31న 'చలో సచివాలయం ముట్టడి' కార్యక్రమాన్ని వేలాది మంది మాలలతో నిర్వహిస్తున్నామని జాతీయ మాల మహానాడు రాష్ట్ర కమిటీ హెచ్చరించింది. ఈ మేరకు మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాల మహానాడు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ తదితరులు ఈ చలో సచివాలయం ముట్టడికి సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు.

మాలలకు 5 శాతం కేటాయించిన రిజర్వేషన్‌లు అమలు జరగడం లేదని, ఉద్దేశపూర్వకం గానే గ్రూప్-3లో ఉన్న మాలలు, మాల ఉపకులాల ప్రభుత్వం వివక్ష చూపుతు న్నదని ఆరోపించారు. తక్షణమే మాల ప్రజా ప్రతినిధులు సిఎం రేవంత్‌రెడ్డిపై వత్తిడీ చేసి జిఒ నెంబరు 99ని రద్దు చేయించాలని, రోస్టర్ 20 లోపు 2 పాయింట్స్ గ్రూప్-3లో 8 కేటాయించాలని ఆయన కోరారు. 31న జరిగే సచివాలయం ముట్టడి కార్యక్రమంలో మాల విద్యార్థి, యువజన, ఉద్యోగ, మేధావులు హాజరై విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# పంట మార్పిడి విధానాలపై రైతులను మరింత చైతన్యపరచాలి

## ఎల్‌నినో ప్రభావం, నీట్-పిజి ప్రవేశపరీక్ష ఏర్పాట్లు, పర్యాటక రంగం అభివృద్ధిపై జిల్లా కలెక్టర్లతో సిఎస్ సంజయ్‌జాజు విడియో కాన్ఫరెన్స్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 25:** రాష్ట్రంలో నెలకొన్న సీజనల్ పరిస్థితులు, నీట్-పిజి ప్రవేశపరీక్ష నిర్వహణకు చేపట్టాల్సిన ఏర్పాట్లు, రాష్ట్రంలో పర్యాటక ప్రాంతాల అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మంగళవారం సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో విడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. సిఎస్ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో పంట మార్పిడి విధానాలపై రైతులను మరింత చైతన్యపరిచి వ్యవసాయ సాగుకు అనుసరించాల్సిన నూతన విధానాలపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. జిల్లాల వారీగా సీజనల్ పరిస్థితులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తీసుకుంటున్న ముందస్తు చర్యలపై సీఎస్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. వాతావరణ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన చోట తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్లను ఆదేశించారు. పంటల వైవిధ్యీకరణ (క్రాప్ డైవర్సిఫికేషన్) అవసరాన్ని చెబుతూ, తక్కువ నీటి అవసరం ఉండే, ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు



అనుకూలమైన పంటలను సాగు చేసేలా రైతులకు నిరంతరం అవగాహన కల్పించాలని సూచించారు. ఈ నెల 30న జరగనున్న నీట్-పిజి ప్రవేశపరీక్ష సజావుగా, ఎలాంటి అవాంతరాలు లేకుండా నిర్వహించేందుకు జిల్లాల్లో చేపడుతున్న ఏర్పాట్లను సీఎస్ సమీక్షి ంచారు. పరీక్షా కేంద్రాల వద్ద అవసరమైన మౌలిక సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లు, విద్యుత్, తాగునీరు, రవాణా తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచిం చారు. దేశవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహి స్తున్న ఈ పరీక్షకు ఎలాంటి అవాంతరాలు లేకుండా సజావుగా జరిగేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు.

### పర్యాటక అభివృద్ధికి ప్రణాళికాబద్ధ చర్యలు

తెలంగాణ టూరిజం 2047 పాలసీలో భాగంగా రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలను మరింత అభివృద్ధి చేసి, దేశీయ, అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించేలా చర్యలు చేపట్టాలని సీఎస్ సూచించారు. ప్రతి జిల్లాలో ఉన్న ముఖ్యమైన పర్యాటక ప్రాంతాలను గుర్తించి, అక్కడ అవసరమైన మౌలిక సదుపాయాలు, కనెక్టివిటీ, పరిశుభ్రత, సౌకర్యాల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్లకు సూచించారు. జిల్లాల ప్రత్యేకతలు, చారిత్రక, సాంస్కృతిక, ప్రకృతి పర్యాటక ప్రాంతాలను సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. రాష్ట్రంలో టూరిజం అభివృద్ధికి 27 స్పెషల్ టూరిజం ప్రదేశాలు (ఎస్‌టిఎ) లను గుర్తించిందని, ఆ ప్రదేశాలను మరింత అభివృద్ధి చేసి టూరిజం సెక్టార్‌ను మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు జిల్లా కలెక్టర్లు కృషి చేయాలని సిఎస్ అన్నారు.

# టిమ్స్‌లో నిమ్స్ సర్వీసు రూల్స్ అనుసరణ

## పిజి కాలేజీని ప్రారంభించేందుకు నిర్ణయం

## ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశంలో వైద్య మంత్రి దామోదర రాజనర్సింహ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 25:** ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధ్యక్షతన మంగళవారం డాక్టర్ మర్రి చెన్నారెడ్డి తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (డాక్టర్ ఎంసీఆర్ టిమ్స్) ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ తొలి సమావేశం జరిగింది. డాక్టర్ ఎంసీఆర్ టిమ్స్ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్‌లో జరిగిన ఈ సమావేశంలో ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తు, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ డాక్టర్ గౌరవ్ ఉప్పల్, డాక్టర్ ఎంసీఆర్ టిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నరేంద్ర కుమార్, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ వాణి, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రవిందర్ నాయక్, నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాహుల్ దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు. టిమ్స్‌కు ప్రతి రోజూ సగటున 600 మంది అవుట్ పేషెంట్లు వస్తున్నారని, వారికి అవసరమైన వైద్య సేవలను అందిస్తున్నామని డైరెక్టర్ డాక్టర్ నరేంద్ర కుమార్ మంత్రికి వివరించారు. అలాగే డే కేర్ ప్రొసీజర్లను కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హాస్పిటల్‌లోని ఐసీయూలు, ఆపరేషన్ థియేటర్లు, డయాగ్నస్టిక్స్ ఎక్విప్‌మెంట్‌తో పాటు ఇతర కీలక వైద్య పరికరాలను పూర్తిస్థాయిలో స్టెరిలైజేషన్ చేయిస్తున్నామని, ఇందుకు సంబంధించిన ప్రక్రియ పూర్తయిన వెంటనే సర్జరీలు ప్రారంభిస్తామని డాక్టర్ నరేంద్ర కుమార్ మంత్రికి వివరించారు. ఎంసీఆర్ టిమ్స్‌లో డాక్టర్లు, సిబ్బంది నియామకాల కోసం నిమ్స్ సర్వీస్ రూల్స్‌ను అనుసరించడంతో పాటు, నిమ్స్‌లో అమలులో ఉన్న టారిఫ్‌లను టిమ్స్‌లో కూడా అమలు చేయడానికి ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. నిమ్స్ టారిఫ్‌లను అమలు చేయడం ద్వారా హాస్పిటల్



ప్రారంభ దశ నుంచే ఒక సమగ్రమైన టారిఫ్ విధానం అందుబాటులోకి రావడంతో పాటు, రాష్ట్రంలోని రెండు ప్రముఖ వైద్య సంస్థల మధ్య చార్జీల విధానంలో ఏకరూపత, మెరుగైన ఆర్థిక ప్రణాళికకు అవకాశం కలుగుతుందని ఈసీ అభిప్రాయపడింది.

డాక్టర్ ఎంసీఆర్ టిమ్స్‌కు సంబంధించిన ఆర్థిక లావాదేవీలను ట్రస్ట్ అండ్ రిటెన్షన్ అకౌంట్ ద్వారా నిర్వహించే విధంగా అవసరమైన బ్యాంకింగ్ సేవలను సమన్వయం చేయడానికి ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. టిమ్స్‌లో రోగులు, వైద్యులు, సిబ్బందికి అవసరమైన మౌలిక వసతులను మరింత మెరుగుపరిచే పలు ప్రతిపాదనలకు కూడా ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. హాస్పిటల్ స్టాఫ్, పేషెంట్లకు పార్కింగ్ ఇబ్బందులు లేకుండా మల్టీ లెవల్ కార్ పార్కింగ్, రోగుల సహాయకుల కోసం అదనపు టాయిలెట్ కాంప్లెక్స్ నిర్మించే ప్రతిపాదనలకు ఈసీ ఆమోదం తెలిపింది.డాక్టర్ ఎంసీఆర్ టిమ్స్‌ను అత్యాధునిక వైద్య సేవలు అందించే సంస్థగా తీర్చి దిద్దడంతోపాటు, ప్రజలకు నాణ్యమైన సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడం, వైద్య విద్య-పరిశోధనలను ప్రోత్సహించడం లక్ష్యంగా ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతోందని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు.

# మైనారిటీ విద్యార్థులకు ఏఐలో శిక్షణ

## 80 వేల మందికి డిజిటల్ సేఫ్టీ కోర్సులు

## 205 గురుకులాల్లో అత్యాధునిక శిక్షణ

## రాష్ట్ర ప్రభుత్వం విప్లవాత్మక నిర్ణయం

**హైదరాబాద్, ఆగస్టు 25, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని మైనారిటీ విద్యార్థుల భవిష్యత్తును సరికొత్త సాంకేతికత వైపు నడిపించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఒక కీలక నిర్ణయం తీసుకుంది. మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 205 మైనారిటీ గురుకుల పాఠశా లల్లో చదువుతున్న 80 వేల మంది విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డిజిటల్ సేఫ్టీపై ప్రత్యేక శిక్షణ ఇవ్వనుంది. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వం, మస్క్ నెక్ట్స్ జన్, డోక్సా కన్సల్టింగ్ (డిసిపిఎల్) సంస్థల సంయుక్త భాగస్వామ్యంతో రూపొం దించిన ఏఐ రీడైనెస్ అండ్ డిజిటల్ సేఫ్టీ ప్రోగ్రామ్ ఈ నెల నుండి అధికారికంగా అమలుకు ప్రారంభించింది. ప్రతి బిడ్డకూ నాణ్యమైన సాంకేతిక విద్యను అందించి, తెలంగాణను అంత ర్జాతీయ ఐటీ హబ్‌గా మార్చాలనే ముఖ్యమంత్రి దార్శనికతకు అనుగుణంగా ఈ సరికొత్త కార్య క్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఈ నూతన విద్యా విధానం ద్వారా గురుకుల విద్యార్థులకు చిన్నతనం నుంచే కృత్రిమ మేధస్సు పరిజ్ఞానం, కోడింగ్ ప్రాథమికాంశాలు, సైబర్ భద్రతపై సమగ్ర అవగాహన కల్పిస్తారు. ఈ అత్యాధునిక శిక్షణ మైనారిటీ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడమే కాకుండా, రాబోయే రోజుల్లో వారికి ఐటీ రంగంలో అద్భుతమైన ఉపాధి, ఉన్నత విద్యా అవకాశాలను కల్పించడంలో మైలురాయిగా నిలవనుంది.

# ఆగస్టు సంక్షోభం కాంగ్రెస్‌లో లేదు.. టిడిపిలో ఉంది

## సిఎం ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ టూర్‌ను అడ్డుకొన్న బిజెపి

## పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



**హైదరాబాద్, ఆగస్టు 25, ప్రభాతవార్త:** ప్రధాన మంత్రిది వన్‌సైడ్ లవ్.. రాహుల్ గాంధీ పట్ల కమిట్‌మెంట్‌తో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉన్నడు, ఎక్కువ ఊహించుకోండని పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. గాంధీభవన్‌లో మంగళవారం జగ్గారెడ్డి లైవ్‌స్టాక్ ఏజెన్సీ, చరణ్ కౌశిక్‌యాదవ్ మున్నూరు కాపు కార్పొరేషన్ వైస్‌ఛైర్మన్, అల్లం భాస్కర్, హ్యాం డ్లూమ్ కార్పొరేషన్ వైస్‌చైర్మన్ జక్కని అనిత మనవతారాయ్, రవిచంద్ర, కోట్ల శ్రీనివాస్‌తో కలిసి మీడియాతో మాట్లాడుతూ ప్రధాని టెంప్ట్ అయినా రేవంత్‌రెడ్డి న్యూట్రల్‌గా ఉన్నారని, బ్యాలెన్స్ తప్పలేదని కితాబు ఇచ్చారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో పనిచేయాలని తపనతో సిఎం రేవంత్ ఉన్నా రని న్నద్రువీకరించారు. మోడీ ఎందుకు టెంప్ట్‌అయి మాట్లాడారో తెలియదని, అలా మోడీ అడగడం సిఎంకు ఇబ్బందిగానే ఉంటుందని ఆయన వివరిం చారు. ఆగస్టు సంక్షోభం కాంగ్రెస్‌లో లేదు, అది టిడిపిలో ఉంటది ఇక్కడ ఉన్నది కాంగ్రెస్ సిఎం, కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి నోడౌట్ అని ధీమా వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటన పెట్టుకుని బయలుదేరాడు కానీ ముఖ్యమంత్రి హోదాలో ఏదో కారణం చూపి ఆపడమే కాదు కేంద్ర ప్రభుత్వం లండన్ నుండే వెనక్కి రప్పించిందన్నారు. తెలంగాణ ప్రజల కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ టూర్ కోసం అమెరికా పోతే బిజెపి ప్రభుత్వం అడ్డుకొని ఆపిందని, ప్రధాని మోడీ అనధికారికంగా పాకి స్థాన్ పోతే బిజెపి ఎంపిలు ఎందుకు మాట్లాడలేదని పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ సిఎం కాంగ్రెస్ పార్టీ అని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అడ్డుకుందని వివరించారు.

బిజెపి ప్రభుత్వ వైఖరిపై తెలంగాణ ప్రజలు, విద్యార్థులు, మేధావులు ఆలోచించాలని కోరారు. తెలంగాణ ముఖ్యమంత్రిని అవమానించడమంటే తెలంగాణ ప్రజలను అవ మానించినట్టే అన్నారు. అమెరికాకు పోవడం రేవంత్‌రెడ్డికి కొత్త ఏంకాదు కదా? ఎందుకు ఆపాల్సి వచ్చిందని అడిగారు. ఎంపి ఈటల రాజేందర్ దేశానికి వ్యతిరేకంగా మాట్లాడిన వ్యక్తిని కలవడానికి పోతున్నారని ఆరోపిం చారని, మరి ప్రధాని మోడీ ఎవరికి చెప్పకుండా పాకిస్థాన్ ప్రధాని నవాజ్ షరీఫ్ ఇంటికి వెళ్లారు, మరి ఇదేమిటని అడిగారు. నవాజ్‌షరీఫ్ బర్త్‌డే ఉందని పాకిస్థాన్ పోయాడని గుర్తుచేశారు. బిజెపి నేతలు రేవంత్‌రెడ్డిని తప్పుపట్టడం కాదు, అనధికారికంగా మోడీ పాకిస్థాన్ వెళ్లాడని దానిని తప్పు పట్టాలని సూచించారు. మన శత్రు దేశానికి ఎందుకు వెళ్లారో మోడీ తెలపాలని డిమాండ్ చేశారు.

# రైతు సంక్షేమమే దేశ సౌభాగ్యానికి పునాది

## పసుపు విలువ ఆధారిత ఉత్పత్తులతో రైతుల ఆదాయం పెంచాలి

## నిజామాబాద్‌లో పసుపు రైతులతో గవర్నర్ శివప్రతాప్‌శుక్లా ముఖాముఖి



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు25:** రైతుల సంక్షేమమే రాష్ట్ర, దేశ సంక్షేమమని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు, పసుపు సాగులో ఆధునిక సాంకేతికత, సహజ వ్యవసాయ పద్ధతులు, ప్రాసెసింగ్, విలువ ఆధారిత ఉత్పత్తులు, బలమైన మార్కెట్ అనుసంధానంతో రైతుల ఆదా యాన్ని పెంచాలని గవర్నర్ పిలుపునిచ్చారు. నిజామాబాద్‌లోని జాతీయ పసుపు బోర్డు ప్రధాన కార్యాలయంలో మంగళవారం పసుపు రైతులతో ముఖాముఖి నిర్వహించారు. రైతుల సమక్షంలో సునహరి మిట్టి అభియాన్, మార్కెట్ అనుసంధాన కార్యక్రమాలను గవర్నర్ ప్రారంభించారు. ఉత్తమ రైతు సంఘాలకు గవర్నర్ మెమంటోలు అందించి అభినందించారు. అనంతరం గవర్నర్ పసుపు రైతులను ఉద్దేశించి మాట్లాడారు.నిజామాబాద్‌కు పసుపు సాగులో ప్రత్యేక గుర్తింపు ఉందని గవర్నర్ అన్నారు. సారవంతమైన నేలలు, రైతుల కష్టంతో ఈ ప్రాంతం దేశంలోని ప్రముఖ పసుపు ఉత్పత్తి కేంద్రంగా ఎదిగిందన్నారు. ఇక్కడ జాతీయ పసుపు బోర్డు ప్రధాన కార్యాలయం ఏర్పాటు కావడం ఈ ప్రాంత రైతుల చిరకాల ఆకాంక్షకు ప్రతీకగా నిలిచిందని పేర్కొన్నారు. ఎంపీ ధర్మపురి అరవింద్ ప్రత్యేక చొరవ, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆశీస్సులతో ఇది సాకారం అయ్యిందన్నారు. సాగును లాభదాయకంగా మార్చేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అనేక కార్యక్రమాలు చేపడుతున్నారని చెప్పారు, పసుపు కేవలం వ్యవసాయ ఉత్పత్తి మాత్రమే కాదని.. భారతీయ సంస్కృతి, సంప్రదాయం, ఆయుర్వేదం, ఆధ్యాత్మికత, నిత్యజీవితంతో ముడిపడిన విలువైన సంపద అని గవర్నర్ పేర్కొన్నారు. భారతదేశ వ్యవసాయ వారసత్వానికి పసుపు ప్రతీకగా నిలు స్తోందన్నారు. భారత్ ను ప్రపంచంలోనే అతిపెద్ద పసుపు ఉత్పత్తిదారుగా కొనసాగించడంతో పాటు పసుపు ప్రాసెసింగ్, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీకి ప్రపంచ కేంద్రంగా అభివృద్ధి చేయడమే జాతీయ పసుపు బోర్డు లక్ష్యమని గవర్నర్ అన్నారు. పసుపు పండించే రైతుకు కష్టానికి తగిన గిట్టుబాటు ధర లభించడంతో పాటు.. అంతర్జాతీయ మార్కెట్‌లో భారత పసుపుకు ప్రత్యేక గుర్తింపు లభించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని, నాణ్యమైన పంటను పండిస్తూ, సమష్టి మార్కెటింగ్ ద్వారా ఆదాయాన్ని పెంచుకోవాలని రైతులకు పిలుపునిచ్చారు. అన్నదాత సుఖీభవ స్ఫూర్తితో రైతు సంపన్నుడిగా, నేల ఆరోగ్యంగా, ప్రపంచ మార్కెట్‌లో భారత్ అగ్రగామిగా నిలిచే వ్యవసాయ వ్యవస్థను నిర్మించాలి అని గవర్నర్ ఆకాంక్షించారు. ఎంపీ ధర్మపురి అరవింద్ మాట్లాడుతూ ఈ ప్రాంత పసుపు రైతుల నాలుగు దశాబ్దాల కలను నిజామాబాద్ కేంద్రంగా జాతీయ పసుపు బోర్డు ఏర్పాటుతో కేంద్రం నెరవేర్చిందన్నారు. బోర్డు ఏర్పాటుతో పసుపు రైతులకు అన్ని విధాలుగా ప్రయోజనం చేకూరుతుందని, పసుపు క్వింటాలు ధర గతం కంటే పెరిగిందన్నారు. గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం దాన కిషోర్, జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, నగర మేయర్ ఉమారాణి,నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ గుప్తా, ఆర్మూర్ ఎమ్మెల్యే పి. రాకేష్ రెడ్డి, జాతీయ పసుపు బోర్డు కార్యదర్శి భవానీశ్రీ, నిజామాబాద్ జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా, నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్యలు పాల్గొన్నారు.


**GREATER VISAKHAPATNAM MUNICIPAL CORPORATION**

T.N.No.02/2026-27/CE/SE(P)/EE(PD-I)/GVMC/ Dt: 25.08.2026

Number of Works : 01 (One), Value of Works (ECV) : Rs.116.35 Crores

Downloading starting Date : 27.08.2026 @ 5.00 PM

Downloading End Date : 16.09.2026 @ 3.00 PM

Last date for Submission of bid : 16.09.2026 @ 5.00 PM

Further Details at http://www.apeprocurement.gov.in

O/o the Executive Engineer (PD-I) Division : 9848308824 Sd/- Commissioner


# రైతులకు పూర్తిస్థాయిలో కేంద్ర పథకాలు

## మరింత పటిష్టంగా శాఖల మధ్య సమన్వయం

## రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 25, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వ్యవసాయ, రైతు సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి రైతుకు పూర్తిస్థాయిలో అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం. కోదండ రెడ్డి సూచించారు. రైతు సంక్షేమ కమిషన్ కార్యాలయంలో మంగళవారం వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశానికి ఎం. కోదండరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరును చైర్మన్ సమీక్షించారు. ఉద్యాన శాఖకు సంబంధించిన ఎంఐడీహెచ్, ఎన్ఎంఈఓపీ, టీజీఎంఐపీ తదితర పథకాల అమలు, పురోగతిపై చర్చించారు. రైతులకు అందుతున్న ప్రయోజనాలు, పథకాల అమలులో ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై సమావేశంలో ప్రస్తావించారు. పథకాల లక్ష్యాలు, ఇప్పటివరకు సాధించిన పురోగతి, రైతులకు అందుతున్న ప్రయోజనాలు, పరిష్కరించాల్సిన అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పథకాల అమలులో వ్యవసాయ, ఉద్యాన శాఖల మధ్య సమన్వయంతో పాటు క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ అవసరమని స్పష్టం చేశారు.

# హైదరాబాద్‌లో నకిలీ వైద్యులపై టాస్క్‌ఫోర్స్ కొరడా

## సికిందరాబాద్, జూబ్లీహిల్స్ జోన్లలో దాడులు.. 12 మంది అరెస్టు



పట్టుబడిన నిందితులు, మందులు చూపుతున్న డిసిపి వైభవ్ గైక్వాడ్ రఘునాథ్

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), ఆగస్టు 25, ప్రభాతవార్త:** సరైన వైద్య అర్హతలు లేకపోయినా డాక్టర్లుగా చలామణి అవుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న నకిలీ వైద్యులపై టాస్క్‌ఫోర్స్ కొరడా ఝుళిపించింది. సికింద్రాబాద్, జూబ్లీహిల్స్ జోన్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో విస్తృతంగా దాడులు నిర్వహించిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు మొత్తం 12 మందిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి నకిలీ వైద్య ధ్రువ పత్రాలు, గడువు ముగిసిన మందులు, ఇంజెక్షన్లు, సెలైన్లు, సిరంజిలు, స్టెతస్కోప్‌లు, బీపీ యంత్రాలు తదితర వైద్య పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. సికిందరాబాద్ జోన్‌లో చిలకల గూడ, రాంగోపాల్‌పేట్, దొమల్‌గూడ, ఓయూ సిటీ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వీరిలో గతంలో కాంపౌండర్లుగా పనిచేసిన వారు కూడా ఉన్నారు. ఎలాంటి వైద్య అర్హతలు లేకుండానే క్లినిక్‌లు నిర్వహిస్తూ ఇంజెక్షన్లు, సెలైన్లు ఇస్తూ రోగులకు చికిత్స అందిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. చిలకలగూడలోని ఓ క్లినిక్‌లో నకిలీ ఎంబీబీఎస్, బీహెచ్ఎంఎస్ ధ్రువపత్రాలతో జనరల్, చైల్డ్ స్పెషలిస్ట్‌గా చలామణి అవుతున్న వ్యక్తిని కూడా అరెస్ట్ చేశారు. మరో వ్యక్తి ఇంట్లోనే మందుల మిశ్రమాలను తయారు చేసి చర్మవ్యాధులకు చికిత్సగా ఇస్తున్నట్లు తేలింది. లోయర్ ట్యాంక్‌బండ్, చిలకలగూడ, మణికేశ్వర్‌నగర్ ప్రాంతాల్లోనూ అర్హత లేని వ్యక్తులు ఏళ్ల తరబడి క్లినిక్‌లు నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. వారి వద్ద నుంచి నకిలీ ధ్రువపత్రాలు, 5 స్టెతస్కోప్‌లు, 5 బీపీ యంత్రాలు, 277 ఇంజెక్షన్లు, 933 మాత్రలు, 12 సెలైన్ బాటిళ్లు, 70 సిరంజిలు, 16 ఆయింట్‌మెంట్లు, 57 సిరప్‌లు, ప్రిస్క్రిప్షన్ ప్యాడ్లు, పల్స్ ఆక్సీమీటర్లు తదితరాలను స్వాధీనం చేసుకున్నారు. ఇక జూబ్లీహిల్స్ జోన్‌లోనూ టాస్క్‌ఫోర్స్ విస్తృత దాడులు నిర్వహించింది. మధురానగర్, జూబ్లీహిల్స్, ఫిల్మ్‌నగర్, బోరబండ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఆరుగురిని అరెస్ట్ చేశారు. వీరిలో ఫస్ట్‌ఎయిడ్ సెంటర్ల పేరుతో వైద్యం చేస్తున్న వారు, ఫార్మసీలు నిర్వహిస్తూ పక్కనే క్లినిక్‌లు ఏర్పాటు చేసుకున్న వారు, గతంలో నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఇతర వైద్య సహాయకులుగా పనిచేసిన వారు ఉన్నారు. కొందరు రోజుకు 40 నుంచి 50 మంది వరకు రోగులను చూసి ఫీజులు వసూలు చేస్తున్నట్లు టాస్క్‌ఫోర్స్ డీసీపీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్ తెలిపారు.

# గచ్చిబౌలిలో ఇద్దరు పిల్లల కిడ్నాప్

## 4 గంటల్లోనే ఇద్దరు చిన్నారులను రక్షించిన పోలీసులు

## కిడ్నాప్‌కు పాల్పడిన మాజీ నేరస్తుడు అరెస్టు

**హైదరాబాద్ (గచ్చిబౌలి), ఆగస్టు 25, ప్రభాతవార్త:** గచ్చిబౌలి లేబర్ క్యాంపులో ఆడుకుంటున్న ఇద్దరు చిన్నారులు కిడ్నాప్‌కు గురయ్యారు. ఇద్దరు చిన్నారులను ఓ మాజీ నేరస్థుడు కిడ్నాప్ చేసి రాష్ట్రం దాటేందుకు యత్నిస్తుంగా, తల్లిదండ్రుల పిర్యాదుతో రంగంలోకి దిగిన గచ్చిబౌలి పోలీసులు ఇద్దరు చిన్నారులను కాపాడారు. కేవలం 4 గంటల్లోనే చిన్నారులను రక్షించడంతో పాటు కిడ్నాప్‌కు పాల్పడిన నేరస్థుడిని అరెస్టు చేశారు. నగరం దాటి వెస్ట్‌బెంగాల్ వెళ్లేందుకు ఘట్కేసార్ రైల్వే స్టేషన్‌లో ఉన్న నిందితుడిని పోలీసులు వలపన్ని పట్టుకున్నారు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శేరిలింగంపల్లి డిసిపి శ్రీనివాస్ వెల్లడించారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన చాకు సోరెన్(45) పాత నేరస్థుడు. గతంలో పశ్చిమ బెంగాల్‌లోని కరిగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ హత్యాయత్నంతో పాటు అత్యాచారం కేసులు చాకు సోరెన్ మీద ఉన్నాయి. అత్యాచారం కేసులో ఐదేళ్ల జైలు శిక్ష అనుభవించిన చాకు సోరెన్ గత మార్చిలో జైలు నుంచి విడుదలయ్యాడు. అనంతరం బ్రతుకుదెరువు కోసం నగరానికి వచ్చి గచ్చిబౌలి సుదర్శన్ నగర్ సమీపంలోని రాఘవేంద్ర లేబర్ క్యాంపులో నివాసం ఉంటూ స్థానికంగా కూలి పనులు చేస్తున్నాడు. కాగా ఇదే లేబర్ క్యాంపులో ఉంటున్న దేవిడ్ ముర్ము కుమార్తె ప్రమీలా ముర్ము(4), హోపన్ హేమరాయ్ కుమార్తె సంగీత హేమ రాయ్(3.5)లు ప్రతిరోజు ఒంటరిగా ఉండడం గమనించాడు. వీరిని కిడ్నాప్ చేసి వారితో బిక్షాటన చేయించడం లేదా వెస్ట్ బెంగాల్‌కు తీసుకువెళ్లి విక్రయించాలని పథకం వేశాడు. ఇందులో భాగంగా సోమవారం లేబర్ క్యాంపులో ఉన్న వారు పనులకు వెళ్లగా, చిన్నారులు ప్రమీలా, సంగీతలు అక్కడే ఆడుకుంటున్నారు. వీరు ఒంటరిగా ఉండడం గమనించిన చాకు సోరెన్ వారికి చాక్లెట్లు కొనివ్వనంటూ అక్కడి నుంచి తీసుకు వెళ్లాడు. ఈ విషయం దేవిడ్ ముర్ము సైతం గమనించాడు. చిన్నారులు చాక్లెట్ల పేరుతో నమ్మించి నేరుగా ఆటోలో లింగంపల్లి రైల్వే స్టేషన్‌కు తీసుకువెళ్లాడు. అక్కడి నుంచి ఎంఎం టిఎస్‌లో ఘట్కేసార్ వరకు వెళ్లాడు. కాగా సాయంత్రం పనుల నుంచి ఇంటికి వచ్చిన రెండు కుటుంబాల వారు తమ చిన్నారులు కనిపించకపోవడంతో చుట్టు ప్రక్కల ప్రాంతాల్లో గాలించారు. ఫలితం లేకపోవడంతో గచ్చిబౌలి పోలీసులకు అర్ధరాత్రి పిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణలో చిన్నారులు చాకు సోరెన్‌తో వెళ్లినట్లు నిర్ధారించు కోవడంతో పాటు చాకు సోరెన్ ఫోన్ స్విచ్చాఫ్ రావడంతో కిడ్నాప్‌కు గురైనట్లు తేల్చారు. ఈ మేరకు సిసి కెమెరాలు, చాకు సోరెన్ సెల్‌ఫోన్ డేటా ఆధారంగా రైలులో వెళ్లినట్లు గుర్తించారు. ఈమేరకు చెంగిచెర్ల, ఘట్కేసార్, భువనగిరి, ఆలేరు పోలీసులను అప్రమత్తం చేశారు. కాగా వెస్ట్ బెంగాల్ వెళ్లేందుకు ఉదయం 10 గంటలకు ఈస్ట్‌కోస్ట్ రైలు ఉండడంతో దానిలో చిన్నారులను తీసుకొని వెళ్లేందుకు చాకు సోరెన్ ఘట్కేసార్ రైల్వే స్టేషన్‌లో వేచి ఉన్నాడు. ఇతన్ని గమనించిన ఘట్కేసార్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఘట్కేసార్‌కు చేరుకున్న గచ్చిబౌలి పోలీసులు నిందితుడిని అరెస్టు చేయడంతో పాటు అతని వద్ద నుంచి చిన్నారులను రక్షించారు. కాగా చిన్నారులను కిడ్నాప్ చేసి, వారిని వెస్ట్ బెంగాల్‌కు తీసుకువెళ్లి, వారితో బిక్షాటన చేయిండం లేదా విక్రయించి సొమ్ము చేసుకోవాలని చాకు సోరెన్ పథకం వేసినట్లు పోలీసులు విచారణలో తేల్చారు. ఈమేరకు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడంతో పాటు కిడ్నాప్‌కు గురైన చిన్నారులను తల్లిదండ్రులకు అప్పగించారు.

# వర్షాలతో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం

**హైదరాబాద్, ఆగస్టు 25, ప్రభాతవార్త:** వర్షాల కారణంగా సింగరేణి కాలరీస్ ఓపెన్‌కాస్ట్ గనుల్లో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం కలిగింది. సింగరేణి పరిధిలోని పలు ఓపెన్ కాస్ట్ గనుల్లోకి వరద నీరు చేరడంతో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. గనుల్లో నీరు నిలవడంతో షావల్, డంపర్లు వంటి భారీ యంత్రాలు యార్డులకే పరిమితమయ్యాయి. బొగ్గు వెలికితీతతో పాటు మట్టి (ఓవర్‌బర్డెన్) తొలగింపు పనులకు కూడా బ్రేక్ పడింది. మణుగూరు, ఎల్లందు తదితర ప్రాంతాల్లోని సింగరేణి ఓపెన్‌కాస్ట్ గనులలో కురిసిన తేలికపాటి వర్షం కారణంగా బొగ్గు ఉత్పత్తితో పాటు, ఓవర్‌బర్డెన్ తొలగింపు కార్యకలాపాలను ప్రభావితం చేసింది. ఫలితంగా మణుగూరులో సుమారు 40 వేల టన్నుల ఓవర్‌బర్డెన్ తొలగింపుకు అంతరాయం కలగింది. అలాగే టేకులపల్లి మండలంలోని కోయగూడెం గనిలో నీరు నిలవడం వల్ల కార్యకలాపాలకు విఘాతం కలిగింది. ఈ ఓపెన్‌కాస్ట్ గనిలో వర్షపు నీరు నిలిచిపోవడంతో, సుమారు 4 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తితో పాటు, ఓవర్‌బర్డెన్ తొలగింపు కార్యకలాపాలు తాత్కాలికంగా నిలిచిపోయాయి. అంతేకాకుండా గత 24 గంటల్లో కురిసిన తేలికపాటి వర్షం కారణంగా పూర్వపు ఖమ్మంలోని సింగరేణి కాలరీస్ ఓపెన్‌కాస్ట్ గనుల్లో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. ఓపెన్‌కాస్ట్ గనుల నుంచి నిలిచిపోయిన నీటిని తోడివేయడానికి చర్యలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు.

---

తెలంగాణ ప్రభుత్వం

**ఫారం-VII**

**(Declaration) రూఢీ ప్రకటన**

భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు చట్టము 2013 (చట్టం 30/2013) సెక్షన్ 19(1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార నియమావళి 2014 రూల్ 25 ప్రకారము

No. G2/118/2026 తేది: 01.08.2026

Gaz. No. 143/2026

నాగర్‌కర్నూల్ జిల్లా తెల్కపల్లి మండలంలోని బాకారం గ్రామము వద్ద అచ్చంపేట్ లిఫ్ట్ ఇరిగేషన్ క్రింద రాంపూర్ కెనాల్ నిర్మాణ నిమిత్తము బాకారం గ్రామ పరిధి నందు ఈ క్రింది షెడ్యూల్‌లో ఉదహరించిన ఎ.3.17 గుంటలు/సెంట్లు భూమి ప్రజా ప్రయోజనార్థం అనగా అచ్చంపేట్ లిఫ్ట్ ఇరిగేషన్ క్రింద రాంపూర్ కెనాల్ నిమిత్తం సేకరించవలసిన అవసరం ఉన్నదని ప్రత్యేక ఉప కలెక్టరు (భూసేకరణ) యం.జి.ఎల్.ఐ.యస్.పి. నాగర్‌కర్నూల్ గారు భావిస్తున్నారు. కాబట్టి ఎ॥లు 3.17 గుం॥ భూమి అచ్చంపేట్ లిఫ్ట్ ఇరిగేషన్ క్రింద రాంపూర్ కెనాల్ నిమిత్తం భూసేకరణ ద్వారా సేకరించుటకుగాను రూఢీ ప్రకటన చేయడమైనది. సేకరించడానికి నిర్ధారించిన భూముల వివరాలు సంక్షిప్తంగా క్రింది ప్రకారం గలవు.

గ్రామము : బాకారం మండలం : లింగాల్ జిల్లా : నాగర్‌కర్నూల్

| క్ర. నం. | సర్వే నెం./ ఎస్. డి. నెం. | పట్టా/ ఇనాం etc. | భూవర్గీకరణ మెట్ట /ఆయకట్ /తరి | భూసేకరణకు ప్రతిపాదించిన విస్తీర్ణము ఎ.సెంట్లు/ ఎ.గుంటలు | పట్టాదారు పేరు అనుభవదారు పేరు మరియు ఏవైనా హక్కులు గల ఇతర వ్యక్తులు | సరిహద్దులు ఉ | ద | తూ | ప | చెట్లు పేరు | చెట్లు సంఖ్య | నిర్మాణములు వర్గము | నిర్మాణములు వస్తీర్ణము |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 |
| 1 | 24 | పట్టా | మెట్ట | 3.05 | బొడ్డుపల్లి ఎల్లమ్మ భర్త వెంకటయ్య (1.25) ద్యారంగుల శ్రీకాంత్ తండ్రి పర్వతాలు (0.14) పటాన్ నసీర్‌ఖాన్ తండ్రి ఇబ్రహీం ఖాన్ (0.22) ద్యారంగుల మోహన్ తండ్రి పర్వతాలు (0.13) వాకిలి చిన్న వెంకటయ్య తండ్రి సింగయ్య (0.06) తోడేటి యాదగిరిరెడ్డి తండ్రి టి. జంగారెడ్డి (0.05) పర్వతాలు తండ్రి చిన్న బాలయ్య రాములు తండ్రి బుడ్డ బాలయ్య గోవిందు వెంకటయ్య తండ్రి ఎల్లయ్య గాలి ఆంజనేయులు తండ్రి గాలిబుడ్డచెన్నయ్య కొర్ర రవి తండ్రి బాలసింగ్ బస్సూరి సైదమ్మ భర్త: టి.వెంకటయ్య బూడిద అంజిరెడ్డి తండ్రి పుల్లారెడ్డి దేరంగుల మంగమ్మ భర్త డి.బుడ్డ బాలయ్య | 156 | 15 | 25 /4 | 23 | లేవు | లేవు | లేవు | లేవు |
| 2 | 25 | లావుణి పట్టా | మెట్ట | 0.12 | మన్నెమోని బాలయ్య తండ్రి బాల్ లింగయ్య (0.06) మన్నెమోని తిరుపతయ్య తండ్రి సత్యం (0.06) పిల్లల అచ్చమ్మ భర్త రాములు ఎల్లికంటి వెంకటమ్మ భర్త నిరంజన్ మనేమోని అర్జునయ్య తండ్రి బాల్ లింగయ్య ఎల్లికంటి మణెమ్మ భర్త పెద్ద కాశన్న ఎల్లికంటి అనసూయ భర్త చిన్నకాశన్న మానెమ్మ భర్త శీనయ్య ప్రభుత్వ భూమి | 153 | 25 /5 | 24 | 32 | లేవు | లేవు | లేవు | లేవు |
| | | మొత్తం | | 3.17 | | | | | | | | | |

భూసేకరణ చట్టం 30/2013లోని సెక్షన్ 15(1) అనుసరించి పైన కనబరిచిన భూములకు సంబంధించినటువంటి రైతుల నుండి ఎటువంటి అభ్యంతరములు/ ఆక్షేపణలు లేనందున ఇట్టి రూఢీ ప్రకటన వేయడమైనది.

భూసేకరణ తలపెట్టిన భూమిలో బొగ్గు, ఇనుము, స్టీల్ మరియు ఇతర ఖనిజములు ఇట్టి భూములలో లేదా కొంత భాగములో లభ్యమైనచో, ఆ ఖనిజాలు ప్రాజెక్టు నిర్మాణమునకు ఉపయోగమున్న పక్షములో, వాటిని స్వీకరించబడును. లేనిచో స్వీకరించబడవు.

పైన చూపిన భూమిని భూసేకరణ చేయు భూముల యొక్క ప్లాన్ ఏదైనా పని దినములలో మరియు కార్యాలయ పని వేళలలో భూసేకరణ అధికారి మరియు ప్రత్యేక ఉప కలెక్టర్ కార్యాలయము, నాగర్‌కర్నూల్ నందు పరిశీలించుకొను నిమిత్తం అందుబాటులో ఉండును.

సామాజిక ఆర్థిక సర్వే నివేదిక ప్రకారము పైన చూపిన భూసేకరణ పీమ్ముట ఏ ఒక్కరునూ వారి జీవనోపాధి కోల్పోవడం గానీ నిర్వాసితులుగా మారడం గాని మరియు భూమి లేని వారిగా గాని జరగడము లేనందున ఇట్టి భూసేకరణ ప్రక్రియనందు పునరావాస మరియు పునరావాస కల్పన ప్రతిపాదనలు ఏమియును లేవు.

సం/-. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూ.సే.), యూనిట్-I, యం.జి.ఎల్.ఐ.యస్.పి., నాగర్‌కర్నూల్ సం/- అదనపు కలెక్టర్, నాగర్‌కర్నూల్ సం/-. జిల్లా కలెక్టర్ నాగర్‌కర్నూల్

DIPR RO.NO:749/LA/PP/Advt/Pub/2026-27

---

తెలంగాణ ప్రభుత్వం

**ఫారం - VI**

**ప్రాథమిక ప్రకటన**

గెజిట్ నెం.: 83/2026 తేది: 17.08.2026

ఫైల్ నెం.: G/693/2026

(భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టము 2013 (కేంద్ర చట్టం 30/2013) యొక్క సెక్షన్ 11(1) మరియు రాష్ట్ర రూల్ 19 (1) ననుసరించి)

తెలంగాణ ప్రభుత్వం/శ్రీయుత జిల్లా కలెక్టర్, వనపర్తి గారు ప్రజా ప్రయోజనార్థ అవసర నిమిత్తం వనపర్తి జిల్లా ఘనపూర్ మండలములోని వెంకటంపల్లి రెవెన్యూ గ్రామ పరిధిలో "MGKLIS - Restoration of Ghanapasamudram Balancing Reservoir" నిర్మాణం కొరకు ఈ క్రింది షెడ్యూల్‌లో ఉదాహరించిన భూమి ఎకరములు 10.00 గుంటలు పట్టా/ప్రభుత్వ భూములు సేకరించుటకు ప్రతిపాదించనైనది. భూసేకరణ కొరకు భూ సేకరణ పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013 లోని చాప్టర్-(II) లోని సామాజిక ప్రభావ అధ్యయన నివేదిక మరియు చాప్టర్-(III)లోని ఆహార భద్రత మరియు పరిరక్షణకు సంబంధించిన మినహాయింపు ఇస్తూ, తెలంగాణ సవరణ చట్టం2016 అనుసరించి, సెక్షన్-10A ప్రకారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జి.ఓ.యం.యస్.నం.51 (Irrigation & CAD (LA.R&R/A2), Dept., తేది: 25.07.2017 జారీ చేసినది. కేంద్ర భూసేకరణ చట్టం, 2013 (చట్టము నెం.30/2013) యొక్క సెక్షన్ 11(1) ప్రకారం ప్రకటన జారీ చేయనైనది.

పై ప్రాజెక్ట్‌కు సంబంధించిన భూసేకరణ పనులను చేపట్టుటకు చట్టంలోని నిబంధనలననుసరించి జిల్లా కలెక్టర్, వనపర్తిగారు జారీ చేసిన ఉత్తర్వులు నెం.జి/225/2026, తేది: 30.03.2026 ప్రకారం ప్రాజెక్ట్ పాలనాధికారిగా అదనపు కలెక్టర్ (రెవిన్యూ) గారిని నియమించినారు.

పై ప్రాజెక్ట్‌కు సంబంధించిన భూసేకరణ పనులను చేపట్టుటకు చట్టంలోని నిబంధనలననుసరించి జిల్లా కలెక్టర్, వనపర్తి గారు జారీ చేసిన ఉత్తర్వులు నెం. జి/225/2026, తేది: 30.03.2026 ప్రకారం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూ.సే.), ఆర్.యల్.ఐ.యస్.పి-2, పెబ్బేర్ గారిని భూసేకరణ అధికారిగా నియమించినారు.

కావున పైన పేర్కొన్న ప్రాజెక్టు కోసం వనపర్తి జిల్లా ఘనపూర్ మండలములోని వెంకటంపల్లి రెవెన్యూ గ్రామ పరిమితిలో గల ప్రామాణిక కొలత కంటే ఎక్కువ లేదా తక్కువ ఎకరములు 10.00 గుంటలు కొలిచే డివిజన్ భూమి. భూ సేకరణ ద్వారా సేకరణ చేసే భూముల వివరములు క్రింది విధంగా గలవు.

**షెడ్యూల్**

గ్రామము : వెంకటంపల్లి మండలం : ఘనపూర్ జిల్లా : వనపర్తి

| క్ర. సం | సర్వే నెం | భూమి రకం మెట్ట/ తరి | పట్టా/ అసైన్డ్/ ప్రభుత్వ /ఇతర. | భూసేకరణ కొరకు ప్రతిపాదిత భూ విస్తీర్ణం ఎ-గు | పట్టాదారు/ అనుభవదారు పేరు మరియు తండ్రి/ భర్త పేరు శ్రీ/శ్రీమతి/కుమారి | సరిహద్దులు ఉ | ద | తూ | ప |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 79 | మెట్ట | పట్టా | 00.09 1/2 | బైని నరేష్ తండ్రి బైని మానయ్య | VB ఘనపూర్ | VB ఘనపూర్ | VB ఘనపూర్ | 81 |
| 2 | 79 | మెట్ట | పట్టా | 00.19 1/2 | దేవరశెట్టి తిరుపతయ్య తండ్రి పెద్ద నర్సింహులు | VB ఘనపూర్ | VB ఘనపూర్ | VB ఘనపూర్ | 81 |
| 3 | 79 | మెట్ట | పట్టా | 00.10 | బయ్యని చంద్రాయుడు తండ్రి చంద్రయ్య | VB ఘనపూర్ | VB ఘనపూర్ | VB ఘనపూర్ | 81 |
| 4 | 79 | మెట్ట | పట్టా | 00.13 | దేవరశెట్టి బాలయ్య తండ్రి సాయన్న | VB ఘనపూర్ | VB ఘనపూర్ | VB ఘనపూర్ | 81 |
| 5 | 79 | మెట్ట | పట్టా | 00.06 1/2 | డి.యస్.చంద్ర తండ్రి డి.బాలయ్య | VB ఘనపూర్ | VB ఘనపూర్ | VB ఘనపూర్ | 81 |
| 6 | 79 | మెట్ట | పట్టా | 00.09 1/2 | బయ్యని మోహన్ తండ్రి బయ్యని మానయ్య | VB ఘనపూర్ | VB ఘనపూర్ | VB ఘనపూర్ | 81 |
| 7 | 79 | మెట్ట | పట్టా | 00.02 1/2 | బయ్యని నర్సింహ తండ్రి బయ్యని శేషయ్య | VB ఘనపూర్ | VB ఘనపూర్ | VB ఘనపూర్ | 81 |
| 8 | 79 | మెట్ట | పట్టా | 00.02 1/2 | బైని అనిత భర్త బైని శ్రీను | VB ఘనపూర్ | VB ఘనపూర్ | VB ఘనపూర్ | 81 |
| 9 | 79 | మెట్ట | పట్టా | 00.02 1/2 | బైని పద్మ భర్త బైని శంకర్ | VB ఘనపూర్ | VB ఘనపూర్ | VB ఘనపూర్ | 81 |
| 10 | 79 | మెట్ట | పట్టా | 00.02 1/2 | బైని సుజాత భర్త బైని రమేష్ | VB ఘనపూర్ | VB ఘనపూర్ | VB ఘనపూర్ | 81 |
| 11 | 80 | మెట్ట | పట్టా | 00.00 1/2 | బైని నరేష్ తండ్రి బైని మానయ్య | 79 | VB ఘనపూర్ | 79 | 81 |
| 12 | 80 | మెట్ట | పట్టా | 00.01 | దేవరశెట్టి బాలయ్య తండ్రి సాయన్న | 79 | VB ఘనపూర్ | 79 | 81 |
| 13 | 80 | మెట్ట | పట్టా | 00.01 1/2 | దేవరశెట్టి తిరుపతయ్య తండ్రి పెద్ద నర్సింహులు | 79 | VB ఘనపూర్ | 79 | 81 |
| 14 | 80 | మెట్ట | పట్టా | 00.00 1/2 | డి.యస్.చంద్ర తండ్రి డి.బాలయ్య | 79 | VB | 79 | 81 |
| 15 | 80 | మెట్ట | పట్టా | 00.00 1/2 | [illegible] | 79 | VB ఘనపూర్ | 79 | 81 |
| 16 | 80 | మెట్ట | పట్టా | 00.00 1/2 | [illegible] | 79 | VB ఘనపూర్ | 79 | 81 |
| 17 | 80 | మెట్ట | పట్టా | 00.00 1/2 | [illegible] | 79 | VB ఘనపూర్ | 79 | 81 |
| 18 | 80 | మెట్ట | పట్టా | 00.00 1/2 | [illegible] | 79 | VB ఘనపూర్ | 79 | 81 |
| 19 | 80 | మెట్ట | పట్టా | 00.00 1/2 | [illegible] | 79 | VB ఘనపూర్ | 79 | 81 |
| 20 | 81 | మెట్ట | పట్టా | 00.16 | [illegible] | VB ఘనపూర్ | VB ఘనపూర్ | 79, 80 | VB ఘనపూర్ |
| 21 | 81 | మెట్ట | పట్టా | 00.21 | [illegible] | VB ఘనపూర్ | VB ఘనపూర్ | 79, 80 | VB ఘనపూర్ |
| 22 | 81 | మెట్ట | పట్టా | 00.16 | [illegible] | VB ఘనపూర్ | VB ఘనపూర్ | 79, 80 | VB ఘనపూర్ |
| 23 | 81 | మెట్ట | పట్టా | 00.31 | [illegible] | VB ఘనపూర్ | VB ఘనపూర్ | 79, 80 | VB ఘనపూర్ |
| 24 | 81 | మెట్ట | పట్టా | 00.10 | [illegible] | VB ఘనపూర్ | VB ఘనపూర్ | 79, 80 | VB ఘనపూర్ |
| 25 | 81 | మెట్ట | పట్టా | 00.16 | [illegible] | VB ఘనపూర్ | VB ఘనపూర్ | 79, 80 | VB ఘనపూర్ |
| 26 | 81 | మెట్ట | పట్టా | 00.04 | [illegible] | VB ఘనపూర్ | VB ఘనపూర్ | 79, 80 | VB ఘనపూర్ |
| 27 | 81 | మెట్ట | పట్టా | 00.04 | బైని అనిత భర్త బైని శ్రీను | VB ఘనపూర్ | VB ఘనపూర్ | 79, 80 | VB ఘనపూర్ |
| 28 | 81 | మెట్ట | పట్టా | 00.04 | బైని పద్మ భర్త బైని శంకర్ | VB ఘనపూర్ | VB ఘనపూర్ | 79, 80 | VB ఘనపూర్ |
| 29 | 81 | మెట్ట | పట్టా | 00.04 | బైని సుజాత భర్త బైని రమేష్ | VB ఘనపూర్ | VB ఘనపూర్ | 79, 80 | VB ఘనపూర్ |
| 30 | 86 | మెట్ట | ప్రభుత్వ | 01.27 | ప్రభుత్వ భూమి | VB ఘనపూర్ | VB ఘనపూర్ | 87 | VB ఘనపూర్ |
| 31 | 87 | మెట్ట | పట్టా | 03.02 | జి.నరేందర్ రెడ్డి తండ్రి జి. కృష్ణారెడ్డి | VB ఘనపూర్ | VB ఘనపూర్ | VB ఘనపూర్ | 86 |
| మొత్తం విస్తీర్ణం (ఎ-గుం.) | | | | 10.00 | | | | | |

భూసేకరణ, పునరావాసం మరియు పునఃస్థాపనలో పారదర్శకత మరియు హేతు బద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు తెలంగాణ సవరణ 2016 (చట్టం.21/2017) మరియు భూ సేకరణ చట్టం-2013 (నెం.30/2013)లోని సెక్షన్ (నిబంధన) -11 (1) ప్రకారం సంబంధిత భూ యజమానులకు/ఆసక్తి గల వ్యక్తులందరికి తెలియచేయుట నిమిత్తం ఇట్టి ప్రకటన (నోటిఫికేషన్) జారీ చేయనైనది.

సదరు చట్టం యొక్క సెక్షన్ 11 (4) ప్రకారం శ్రీయుత జిల్లా కలెక్టర్, వనపర్తి గారి అనుమతి లేకుండా ఇట్టి ప్రాథమిక నోటిఫికేషన్ జారి చేసిన తేదీ నుండి ఆ నోటిఫికేషన్‌లో ప్రకటించిన/ఉదాహరించిన భూములకు సంబంధించిన ఎవరు ఎటువంటి లావాదేవీలు/ తాకట్టు, అమ్మకం/కొనుగోలు మొదలగు చర్యలు చేపట్టరాదు అని తెలియచేయనైనది.

సదరు చట్టంలోని సెక్షన్-12లో గల అధికారాలను అనుసరించి తెలంగాణ ప్రభుత్వం / శ్రీయుత జిల్లా కలెక్టర్‌గారు భూసేకరణ అధికారి & స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూ.సే.), ఆర్.యల్.ఐ.యస్.పి-2, పెబ్బేర్ Hq IDOC, వనపర్తి మరియు అతని సిబ్బందికి సదరు భూమిపైకి ప్రవేశించడానికి, సర్వే మరియు ఇతర పనులు చేపట్టుటకు, భూమిని తీసుకోవటానికి, త్రవ్వటానికి అధికారం ఇవ్వడానికి, ఇతర పనులు అమలు చెయ్యడానికి అనుమతించనైనది.

భూమి యొక్క ప్లాన్ మరియు వివరములు శ్రీయుత జిల్లా కలెక్టర్, వనపర్తి / భూ సేకరణ అధికారి & స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూ.సే.), ఆర్.యల్.ఐ.యస్.పి-2, పెబ్బేర్ Hq IDOC, వనపర్తి గారి కార్యాలయములలో ఉంచనైనది. సంబంధిత వ్యక్తులు ఏదైనా పని దినములలో మరియు కార్యాలయ పని వేళలలో పరిశీలించుకోవచ్చును.

భూసేకరణ చట్టంలోని సెక్షన్-15(1) ప్రకారం, ఇట్టి నోటిఫికేషన్ జారి చేసిన తరువాత పైన చూపించిన భూములలో ఎలాంటి సంబంధమున్న వ్యక్తులైన భూసేకరణపై అభ్యంతరాలున్నచో, అట్టి వ్యక్తులు ఇట్టి నోటిఫికేషన్ ప్రచురించిన తేదీ నుండి 60 (అరవై) రోజులు లోపు శ్రీయుత జిల్లా కలెక్టర్, వనపర్తి / భూసేకరణ అధికారి & ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే.), ఆర్.ఎల్.ఐ.యస్.పి. యూనిట్-2, పెబ్బేరు, Hq at IDOC, వనపర్తి గారికి లిఖిత పూర్వకంగా తెలియపరచగలరు.

తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జి.ఓ.యం.ఎస్.నెం.120 (రెవిన్యూ JA & LA), తేది: 30.06.2017 ప్రకారం సెక్షన్-23A కింద భూయజమానులు, ఆసక్తిగల వ్యక్తులు సరైన భూ పరిహారం పొందుటకై సంప్రదింపులు/చర్చల ద్వారా పరిష్కారం చేయదలుచుకున్నవారు తమ ఆసక్తులను ఫారం E-1 ద్వారా నోటిఫికేషన్ వెలువడిన తదుపరి సమర్పించవచ్చును.

సం/- ప్రత్యేక ఉప కలెక్టర్ భూసేకరణ ఆర్.ఎల్.ఐ.ఎస్.పి., యూనిట్-2, పెబ్బేర్. సం/- అదనపు కలెక్టర్, వనపర్తి సం/- జిల్లా కలెక్టర్, వనపర్తి

DIPR RO.NO:766/LA/PP/Advt/Pub/2026-27

---

**AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్** (ఒక షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్)

AU SMALL FINANCE BANK — A SCHEDULED COMMERCIAL BANK

నమోదిత కార్యాలయం: 19-ఎ, ధూలేశ్వర్ గార్డెన్, అజ్మీర్ రోడ్, జైపూర్-302001(CIN:L36911RJ1996PLC011381)

**అనుబంధం IV (నిబంధన 8(1) చూడండి) స్వాధీనతా ప్రకటన**

"ఫిన్‌కేర్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్" ఏప్రిల్ 01, 2024 నుండి "AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్"తో విలీనం అయిందని రుణగ్రహీతలందరికీ మరియు ప్రజలకు తెలియజేయడానికి ఇది. అయితే, కింద సంతకం చేసిన వ్యక్తి "సెక్యూరిటైజేషన్ మరియు రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (యాక్ట్, 2002 (54 ఆఫ్ 2002) కింద AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ (షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్) యొక్క అధీకృత అధికారి మరియు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3తో చదవబడిన సెక్షన్ 13(12) కింద ఇవ్వబడిన అధికారాలను వినియోగించుకుంటూ క్రింద పేర్కొన్న తేదీన డిమాండ్ నోటీసు జారీ చేశారు. ఆ నోటీసు అందిన తేదీ నుండి 60 రోజులలోపు, క్రింద ఇవ్వబడిన పట్టికలో ఇవ్వబడిన వివరాల ప్రకారం, ఆ నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని చెల్లించాలి.

| రుణగ్రహీత/సహ-రుణగ్రహీత/తనఖాదారు/ హామీదారు పేరు/రుణ ఖాతా నం. | 13(2) నోటీసు తేది మరియు మొత్తం | స్వాధీనం చేసుకున్న తేది |
|---|---|---|
| (Loan A/C No.) 23660001623630, పాలెం కృష్ణ (రుణగ్రహీత) పాలెం సరోజ (సహ-రుణగ్రహీత) | 05-జూన్-26 రూ.7,30,693/-, ఏడు లక్షల ముప్పై వేల ఆరు వందల తొంభై మూడు రూపాయలు మాత్రమే 04-జూన్-26 నాటికి | 21-ఆగస్ట్-26 |

తనఖా పెట్టిన ఆస్తి వివరణ

(నమోదిత ఇంటి కానుక పత్రం డాక్యుమెంట్ నం. 7912/2023, తేది: 24-07-2023 ప్రకారం) జోగులాంబ గద్వాల జిల్లా, గద్వాల మున్సిపాలిటీ, గద్వాల పట్టణం, గంట వీధిలో ఉన్న, ఇంటి నం. 3-3-14 (భాగం) (PTIN నం. 1036000638) కలిగిన ఆస్తి. దీని విస్తీర్ణం 41.88 చదరపు గజాలు 35.01 చదరపు మీటర్లకు సమానం. ఇందులో గ్రౌండ్ ఫ్లోర్ ప్లింత్ ఏరియా 242 చదరపు అడుగులు, మొదటి అంతస్తు ప్లింత్ ఏరియా 310 చదరపు అడుగులు మరియు రెండవ అంతస్తు ప్లింత్ ఏరియా 108.9 చదరపు అడుగులతో కూడిన RCC ఇంటి నిర్మాణం ఉంది. ఈ ఆస్తి ప్రస్తుతం శ్రీ పాలెం కృష్ణ తండ్రి: పాలెం నవారి అలియాస్ పాలెం నవరత్న గారికి చెందినది మరియు దీని సరిహద్దులు ఈ క్రింది విధంగా ఉన్నాయి: తూర్పున: నవరత్నగారి ఇల్లు, పడమరన: రోడ్డు, ఉత్తరాన: లక్ష్మీదేవి గారి ఇల్లు, దక్షిణాన : [illegible] గారి ఇంటి భాగం నం. 3-3-14 (భాగం).

| రుణగ్రహీత/సహ-రుణగ్రహీత/తనఖాదారు/ హామీదారు పేరు/రుణ ఖాతా నం. | 13(2) నోటీసు తేది మరియు మొత్తం | స్వాధీనం చేసుకున్న తేది |
|---|---|---|
| (Loan A/C No.) 24660002698488, రాల్లం చిన్న (రుణగ్రహీత) రాల్ల పద్మ (సహ-రుణగ్రహీత) | 16-మార్చి-26 రూ.5,32,154/-, ఐదు లక్షల ముప్పై రెండు వేల ఒక వంద యాభై నాలుగు రూపాయలు మాత్రమే 12-మార్చి-26 నాటికి | 21-ఆగస్ట్-26 |

తనఖా పెట్టిన ఆస్తి వివరణ

జోగులాంబ గద్వాల్ జిల్లా, ఇటిక్యాల మండలం, పాచాడ్ గ్రామంలో ఉన్న స్థిరాస్తి. ఇది 46 x 33 అడుగుల కొలతలు కలిగిన ఇల్లు H.No. 2-54, అసెస్మెంట్ నం. 157. దీని మొత్తం విస్తీర్ణం 194.22 చదరపు గజాలు అంటే 162.36 చదరపు మీటర్లు; ఇందులో 15 x 15 అడుగులు అంటే 225 చదరపు అడుగుల ప్లింత్ ఏరియాతో నిర్మించిన RCC ఇల్లు ఉంది. ప్రస్తుతం ఉన్న మరియు భవిష్యత్తులో చేపట్టే నిర్మాణాలతో కలిపి దీని మొత్తం విస్తీర్ణం 1747.98 చదరపు అడుగులు. సరిహద్దులు: తూర్పున రాముడు గారి ఇల్లు, పడమరన సి.సి. రోడ్డు, ఉత్తరాన రాజు గారి ఇల్లు, దక్షిణాన సి.సి. రోడ్డు.

రుణగ్రహీత మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, పైన పేర్కొన్న పట్టికలో పేర్కొన్న తేదీలో పేర్కొన్న నియమంలోని సెక్షన్ 13(4)తో పాటు (చట్టం 2002) నిబంధన 8తో చదవబడే అతనికి/ఆమెకు ఇవ్వబడిన అధికారాలను ఉపయోగించి, పైన పేర్కొన్న పట్టికలో వివరించిన ఆస్తిని క్రింద సంతకం చేసిన వ్యక్తి స్వాధీనం చేసుకున్నాడని రుణగ్రహీతకు మరియు ప్రజలకు నోటీసు ఇవ్వబడింది. "సెక్యూర్డ్ ఆస్తులను తిరిగి పొందడానికి అందుబాటులో ఉన్న సమయానికి సంబంధించి, అంటే ఈ నవావారం నుండి 30 రోజులలోపు, నియమం 8(6)తో పాటు చట్టంలోని సెక్షన్ 13లోని సబ్ సెక్షన్ (8)లోని నిబంధనలకు రుణగ్రహీత దృష్టిని ఆహ్వానించబడ్డాడు".

ముఖ్యంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలు ఆస్తితో ఎలాంటి లావాదేవీలు చేయరాదని ఇందుమూలంగా హెచ్చరిస్తున్నారు మరియు ఆస్తితో ఏవైనా లావాదేవీలు పైన పేర్కొన్న పట్టికలో పేర్కొన్న మొత్తం మరియు దానిపై వడ్డీకి AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ (ఒక షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్) ఛార్జీకి లోబడి ఉంటాయి.

తేది: 25/08/2026 ప్రదేశం : మహబూబ్‌నగర్, తెలంగాణ అధీకృత అధికారి, AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్

# పిఎం సూర్యఘర్ యోజనతో విద్యుత్ పొదుపు

- ప్రతి కుటుంబానికి ప్రయోజనం చేకూరాలి
- రచ్చుమర్రిలో సోలార్ రూఫ్‌టాప్ ప్లాంట్ పరిశీలన


పీఎం సూర్యఘర్ సోలార్‌ను పరిశీలిస్తున్న మంత్రులు గొట్టిపాటి రవికుమార్, నిమ్మల రామానాయుడు

**మంత్రాలయం, ఆగస్టు 25 ప్రభాతవార్త:** పిఎం సూర్యఘర్ యోజనతో విద్యుత్ పొదుపు ప్రతి కుటుంబానికి ప్రయోజనం చేకూరాలని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. మంగళవారం మంత్రాలయం మండలం రచ్చుమర్రి గ్రామంలో లబ్ధిదారుడు అజయ్‌కుమార్ పీఎం సూర్యఘర్ యోజన ద్వారా ఏర్పాటు చేసుకున్న సోలార్ రూఫ్‌టాప్ ప్లాంట్‌ను రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, రాష్ట్ర జలవనరులశాఖ, కర్నూలు జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు పరిశీలించారు. ఈ సందర్భంగా సోలార్ రూఫ్‌టాప్ ప్లాంట్ ఏర్పాటు, దాని పనితీరు, సామర్థ్యం, లబ్ధిదారులకు అందుతున్న ప్రయోజనాలు, ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ తదితర అంశాలను మంత్రులు అధికారులను, లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. సోలార్ రూఫ్‌టాప్ ప్లాంట్ల ఏర్పాటులో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ సూచించారు. సోలార్ ప్యానెళ్లు, ఇన్వర్టర్లు, ఇతర పరికరాలు అత్యున్నత ప్రమాణాలతో ఉండేలా చూడాలని, ఏర్పాటు చేసిన ప్లాంట్లు కనీసం 20 సంవత్సరాల పాటు సమర్థవంతంగా పనిచేసేలా నాణ్యతా ప్రమాణాలు పాటించాలని స్పష్టం చేశారు. పీఎం సూర్యఘర్ యోజన ప్రధాన ఉద్దేశ్యం ప్రతి కుటుంబానికి సౌర విద్యుత్ ద్వారా విద్యుత్ ఖర్చును తగ్గించడం, స్వచ్ఛమైన ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించడం అని మంత్రి పేర్కొన్నారు. పథకం ద్వారా లబ్ధిదారులకు వాస్తవ ప్రయోజనం అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. రచ్చుమర్రి గ్రామంలో ఏర్పాటు చేసిన సోలార్ రూఫ్‌టాప్ ప్లాంటట్2 కిలో వాట్ల సామర్థ్యంతో ఉందని అధికారులు వివరించారు. ఈ పథకం కింద అర్హత కలిగిన లబ్ధిదారులకు 60 శాతం వరకు సబ్సిడీ అందుతున్నట్లు తెలిపారు. లబ్ధిదారులకు సోలార్ రూఫ్‌టాప్ ప్లాంట్ల ఏర్పాటులో ఏపీఎస్పీడీసీఎల్ ద్వారా అవసరమైన సహకారం, మార్గదర్శకత్వం, సహాయక సేవలు అందిస్తున్నట్లు అధికారులు తలెఎఇపారు. పథకం అమలులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా లబ్ధిదారులకు అవసరమైన సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని మంత్రులు సూచించారు. పీఎం సూర్యఘర్ యోజనను ప్రజలు సద్వినియోగం చేసుకుని సౌర విద్యుత్ వినియోగాన్ని పెంచుకోవాలని, తద్వారా విద్యుత్ పొదుపుతో పాటు పర్యావరణ పరిరక్షణ కూడా సహకరించాలని మంత్రులు కోరారు. ఈ కార్యక్రమంలో మంత్రాలయం ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి, ఆదోని ఆర్డీఓ అరుణదేవి, విద్యుత్‌శాఖ ఎస్ఈ ప్రదీప్‌కుమార్, టిడిపి జిల్లా అధ్యక్షులు గుడిసె కృష్ణమ్మ, జోన్-5 ఇన్‌చార్జి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఫొటో జర్నలిస్టు నైపుణ్యం, శ్రమ కలగలిసిన కళాకారుడు

- సి.ఆర్. మీడియా అకాడమీ ఛైర్మన్ సురేశ్ కుమార్

**విజయవాడ, ఆగస్టు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** ఫొటో జర్నలిస్టు నైపుణ్యం,శ్రమ కలగలిసిన కళాకారుడని సి.ఆర్. మీడియా అకాడమీ ఛైర్మన్ ఆలపాటి సురేశ్ కుమార్ పేర్కొన్నారు. ఫొటో కాంటెస్ట్2026 అవార్డుల ప్రధానోత్సవం మంగళవారం విజయవాడ ప్రెస్ క్లబ్‌లో ఘనంగా నిర్వహించారు. సి.ఆర్.మీడియా అకాడమీ, ఎపి స్టేట్ క్రియేటివ్ అండ్ కల్చరర్ కమీషన్ ఈ కార్యక్రమ నిర్వహణకు తోడ్పాటునందించాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఒక ఫొటో వార్తకు ప్రాణం పోస్తుందనడం అతిశయోక్తి కాదన్నారు. ఒకఅంశాన్ని చిత్రం(ఫొటో)తో పాటు వివరించడం సంఘటనను పాఠకులకు మరింత చేరువ చేస్తుందన్నారు. తమ నలభై యేళ్ళ జర్నలిస్టు అనుభవంలో ఫిల్మ్ కెమెరాలు, డిజిటల్ కెమెరాలు, చివరికి స్మార్ట్ ఫోన్ కెమెరాలు వాడకం చూశామని, అన్ని దశల్లోనూ ఫొటోల నాణ్యత ఒకేలా ఉందని చెప్పలేమన్నారు. ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిన నేపధ్యంలో ఫొటోగ్రఫీ రంగంలో కూడా విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయని, దానిపై ఫొటో జర్నలిస్టులు నూతన, సాంకేతిక తను అలవర్చుకోవాలని సూచించారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి రోజూ 530 కోట్ల ఫొటోలు తీస్తున్నట్లు ఒక సర్వేలో వెల్లడైందన్నారు. ఇదంతా స్మార్ట్ ఫోన్ల వల్లనే సాధ్యం అవుతోందన్నారు. అయితే, సాధారణ ఫోటోలు, వార్తల కోసం తీసే ఫొటోలతోపాటు కళాత్మక ఫొటోగ్రఫీని ప్రోత్సహించాలని ఆయన సూచించారు. గతంలో "ఇలస్ట్రేటెడ్ వీక్లీ"వంటి పత్రికలు కళాత్మక ఫొటోగ్రఫిని, ఫొటో జర్నలిస్టులను ప్రోత్సహించేవన్నారు. తాను క్లిక్ మనిపించిన ఫొటోను మనస్సుతో అనుభూతి చెంది, ఆనందించడం ఫొటో జర్నలిస్టులందరికీ అనుభవంలో ఉంటుందన్నారు. సంఘటనకు అతి చేరువలో వుండి, ఓపిగ్గా నిరీక్షించడం ద్వారా ఫొటో జర్నలిస్టులు ఎన్నో చారిత్రాత్మక ఫొటోలు తీయగలిగారన్నారు. రెండో ప్రపంచ యుద్ధం ముగింపును సూచించే ప్రసిద్ధ ఫొటో అలాంటి వాటిలో ఒకటని ఆయన గుర్తు చేశారు. సమాజంలోని మార్పులను ప్రజల జీవన విధానాన్ని, ప్రకృతి అందాలను కళ్లకు కట్టినట్లు చూపించడంలో ఫొటోగ్రఫీకి ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. సమాజంలో జరిగే సంఘటనలను భవిష్యత్తు తరాలకు భద్రపరచడంలో ఫొటో జర్నలిస్టుల పాత్ర కీలకమన్నారు.

## 28నప్రభుత్వ ఉద్యోగులరాష్ట్రస్థాయి సదస్సు



**విజయవాడ, ఆగస్టు 25 (ప్రభాతవార్త):** ఉద్యోగుల సమస్యలు, తమకు రావాల్సిన వేతన బకాయిల సాధన కోసం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు చేపట్టనున్న ఉద్యమానికి తరలిరావాలని ఎ.పి. ఎన్.జి.ఒ, రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘ నాయకులకు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల అమరావతి జె.ఎ.సి. విజ్ఞప్తిచేసింది. ఉద్యమంలో భాగంగా ఈ నెల 28వ తేదీన విజయవాడలో నిర్వహించనున్న రాష్ట్ర సదస్సుకు ఎ.పి. ఎన్.జి.ఒ, రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘ నాయకులనుజె.ఎ.సి సభ్యులు మంగళవారం కలిసి ఆహ్వానించారు. ఐక్య ఉద్యమాలకు పిలుపునిచ్చిన ఎ.పి.జె.ఎ.సి. అమరావతి, ఛైర్మన్ బొప్పరాజు ఆధ్వర్యంలో నాయకుల బృందం విజయవాడ ఎ.పి. ఎన్.జి.ఒ భవన్ కి వెళ్లి రాష్ట్ర అధ్యక్షుడు, ఎ.పి.జె.ఎ.సి. ఛైర్మన్ ఏ.విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి రమణలను కలసి ఉద్యోగుల, ఉపాధ్యాయులు, పెన్షనర్ల దీర్ఘకాలిక సమస్యలను వివరించారు. ప్రధానంగా ఉద్యోగులబకాయిలపై ప్రభుత్వం గత రెండేళ్లుగా స్పందించనందున, ఎ.పి.జె.ఎ.సి. అమరావతి ఉద్యమ కార్యాచరణకు వివరించారు. ఈసందర్భంగా బొప్పరాజు గారు మాట్లాడుతూ ఏ ప్రభుత్వాలైనా ఉద్యోగ సంఘాలతో చర్చలు జరిపిన వెంటనే నిర్ణయాలు వెల్లడిస్తాయని, కానీ కూటమి ప్రభుత్వం గత నెల 22వ తేదీన చర్చలు జరిపి నెల రోజులు దాటినప్పటికీ ఎటువంటి నిర్ణయాలు ప్రకటించలేదని, ఇది చాలా బాధాకరమని, కాబట్టి ఉద్యోగులు అందరూ గతంలో మాదిరి రెండు జేఏసీ లు కలిసి ఉద్యమం చేయాలని కోరుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బొప్పరాజుతో పాటు సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదర రావు, ఉద్యమ కమిటీ అధ్యక్షుడు టి వి ఫణి పేర్రాజు, కోశాధికారి తిమ్మసర్తి నాగేశ్వరావు, మహిళా విభాగం రాష్ట్ర చైర్ పర్సన్ పారే లక్ష్మి ్మ, సెక్రటరీ జనరల్ పొన్నూరు విజయలక్ష్మి ్మ, వి.ఆర్.ఒ.లసంఘం రాష్ట్ర ప్రధాన కార్య దర్శి జి.అనుపమ, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు బత్తిన రామకృష్ణ, రాజధాని నగర అధ్యక్షుడు రవి ప్రసాద్,ప్రధానకార్యదర్శి మందపాటి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

# గల్లంతైన మత్స్యకారుల కోసం గాలింపు ముమ్మరం

- 15 కోస్ట్‌గార్డ్ నౌకలు, నాలుగు హెలికాప్టర్లతో విస్తృత సెర్చ్ ఆపరేషన్
- మయన్మార్, బంగ్లాదేశ్ సముద్ర అధికారులకు సమాచారం



**విజయవాడ, ఆగస్టు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** అమలాపురం ప్రాంతానికి చెందిన గల్లంతైన ఏడుగురు మత్స్యకారుల ఆచూకీ కోసం చేపట్టిన గాలింపు చర్యలను మరింత ముమ్మరం చేసినట్లు రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో భారత తీర రక్షక దళం నౌకాదళం, ఇతర సంబంధిత విభాగాలు సమన్వయంతో విస్తృత సెర్చ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అమలాపురం పార్లమెంట్ సభ్యులు హరీష్ బాలయోగి మంగళవారం కేంద్ర రక్షణ మంత్రిని కలిసి గల్లంతైన మత్స్యకారుల కోసం కొనసాగుతున్న గాలింపు చర్యలపై చర్చించిన అనంతరం కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ భారత తీర రక్షక దళాన్ని మరింత అప్రమత్తం చేసిందని మంత్రి తెలిపారు. ఐసీజీ ప్రధాన కార్యాలయంలోని డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (ఆపరేషన్స్) ఆదేశాల మేరకు కోల్‌కతాలోని తూర్పు, ఈశాన్య కమాండ్లను కూడా కార్యాచరణలోకి తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. గాలింపు పరిధిని విస్తరించి, ఆపరేషన్‌ను వేగవంతం చేసేందుకు సమీప సముద్ర జలాల్లో ఉన్న 15 ఐసీజీ నౌకలు, నాలుగు హెలికాప్టర్లను మంగళవారం రంగంలోకి దించినట్లు మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు. మెరైన్ రెస్క్యూ కోఆర్డినేషన్ సెంటర్ ఆధ్వర్యంలో ఎలక్ట్రానిక్ నిఘా ఏకకాలంలో కొనసాగుతోందన్నారు. గల్లంతైన పడవకు సంబంధించిన సమాచారం లేదా ఆచూకీ లభించే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని మయన్మార్, బంగ్లాదేశ్ సముద్ర అధికారులను కూడా అప్రమత్తం చేసినట్లు తెలిపారు. పడవ విదేశీ జలాల్లోకి కొట్టుకుపోయి ఉండవచ్చనే అవకాశంతో పాటు, ఇంజిన్‌లో సాంకేతిక లోపం కారణంగా సముద్రంలో ఎక్కడైనా నిలిచిపోయి ఉండవచ్చన్న కోణంలోనూ భారత తీర రక్షక దళం పరిశీలన జరుపుతోందని మంత్రి వివరించారు. ఎంఆర్‌సీసీ చేపడుతున్న ఎలక్ట్రానిక్ నిఘాతో పాటు వివిధ సముద్ర అధికారుల నుంచి అందుతున్న సమాచారాన్ని ఎప్పటికప్పుడు విశ్లేషిస్తున్నట్లు చెప్పారు. సముద్ర ప్రవాహాలు, గాలుల దిశ, వేగం, వాతావరణ పరిస్థితులతో పాటు మత్స్యకారులు సాధారణంగా చేపల వేటకు వెళ్లే మార్గాలను పరిగణనలోకి తీసుకుని గాలింపు కొనసాగిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. డైమండ్ హార్బర్, సుందర్‌బన్స్‌తో పాటు పరిసర సముద్ర ప్రాంతాల్లోనూ సెర్చ్ ఆపరేషన్‌ను విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## శ్రీశైలంలో క్యూకాంప్లెక్సు

**శ్రీశైలం ప్రాజెక్ట్, ఆగస్టు 25 ప్రభాతవార్త:** శ్రీశైల దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షులు పోతుగుంట రమేష్‌నాయుడు అధ్యక్షతన ధర్మకర్తల మండలి 10వ సమావేశం పరిపాలన భవనంలో నిర్వహించారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు పాల్గొనగా, సమావేశంలో మొత్తం 18 అంశాలు చర్చించారు. వీటిలో 15 అంశాలు ఆమోదించారు. మిగతా 3 అంశాలను వాయిదా వేశారు. సమావేశ ప్రారంభంలో ధర్మకర్తల మండలి అధ్యక్షుడు పోతుగుంట రమేష్‌నాయుడు మాట్లాడుతూ క్షేత్రపరిధిలో మౌలిక సదుపాయాల కల్పనకు మరిన్ని చర్యలు తీసుకుంటామన్నారు. సామాన్య భక్తులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు అవసరమైన సదుపాయాలను కల్పిస్తామన్నారు. శ్రీశైలం క్షేత్రాన్ని దర్శించే సామాన్య భక్తుల సౌకర్యాల కల్పనకే ప్రాధాన్యత ఇస్తామన్నారు. ముఖ్యంగా క్షేత్రాన్ని దర్శించే ప్రతీ భక్తుడిని ఒక అతిథిగా భావిస్తున్నామన్నారు. అందుకు అనుగుణంగా ఆయా సౌకర్యాల కల్పనను చేపడతామని వివరించారు. సర్వదర్శనం క్యూలైన్లలోని భక్తుల సౌకర్యార్థం ప్రతీ శని,ఆది, సోమవారాలలో ఉదయం, మధ్యాహ్నవేళలో శ్రీస్వామివారి స్పర్శదర్శనాన్ని పూర్తిగా నిలుపుదల చేయడం జరిగిందన్నారు. సామాన్య భక్తులకు ఇబ్బందులు లేకుండా కేవలం రాత్రి వేళలో మాత్రమే శ్రీస్వామివారి స్పర్శదర్శనం కల్పిస్తున్నామన్నారు. భక్తుల సౌకర్యార్థం నిర్మించతలపెట్టిన క్యూకాంప్లెక్సు నిర్మాణ పనులను వీలైనంత త్వరలో ప్రారంభిస్తామన్నారు. ఇప్పటికే ఈ నిర్మాణానికి సంబంధించిన డి.పి.ఆర్ దాదాపుగా పూర్తి కావచ్చిందన్నారు. మొత్తం ఒకేసారి 12వేల మంది భక్తులు వేచివుండే విధంగా 3 అంతస్తులుగా ఈ క్యూకాంప్లెక్సు నిర్మించాలని భావిస్తున్నామన్నారు. ఈ నెల 29 నుంచి 31 వరకు సిద్ధవట ఆలయంలో నూతన ధ్వజప్రతిష్ఠా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు.

## దొంగల కుటుంబం

**నెల్లూరు క్రైం, ఆగస్టు 25, ప్రభాతవార్త - వైద్యం:** రైల్వే రక్షణ, ప్రయాణికుల భద్రతను ధ్యేయంగా మలుచుకుని నెల్లూరు ప్రభుత్వ రైల్వే పోలీసులు భారీ విజయం సాధించారు. రైళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్న ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఘరానా దొంగలను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి భారీ మొత్తంలో సొత్తును రికవరీ చేశారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను మంగళవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రైల్వే డిఎస్పీ జి. మురళీధర్ వెల్లడించారు. ఆయన తెలిపిన సమాచారం మేరకు ఇటీవల కాలంలో రైళ్లలో జరుగుతున్న దొంగతనాలపై రైల్వే పోలీసులు రైల్వే ఐజీ రాజకుమారి ఆదేశాల మేరకు పూర్తి స్థాయిలో దృష్టి సారించారు. అందులో భాగంగా డీఎస్పీ జి. మురళీధర్ పర్యవేక్షణలో నెల్లూరు రైల్వే సీఐ ఎ. సుధాకర్, గూడూరు ఎస్ఐ ఎం. నారాయణ, నెల్లూరు ఎస్ఐ ఎన్. హరి చందనలతో కూడిన మూడు స్పెషల్ టీమ్‌లను ఏర్పాటు చేశారు. ఈ ప్రత్యేక బృందాలు గూడూరు, బొగ్గులదిబ్బకు చెందిన ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. తాళ్ళూరు అనిల్ కుమార్, తాళ్ళూరు సునీల్, షేక్ కాలేషా అనే ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా అరెస్ట్ అయిన ముగ్గురూ కూడా ఒకే కుటుంబానికి చెందినవారు కావడం గమనార్హం. వీరికి తల్లిదండ్రుల సరైన ఆదరణ లేకపోవడం, స్థిర నివాసం లేకపోవడంతో చిన్నతనంలోనే చెడు వ్యసనాలకు బానిసలయ్యారు. జల్సాల కోసం, సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో దొంగతనాలను వృత్తిగా మార్చుకున్నారు. వీరంతా పాత నేరస్తులు కాగా, గతేడాది ప్రకాశం జిల్లా ఇంకొల్లు పోలీస్ స్టేషన్, గూడూరు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మొత్తం నాలుగు దొంగతనం కేసులు నమోదై ఉన్నాయి.

# తిరుమల సమాచారం

## మహాపూర్ణాహుతితో ముగిసిన పవిత్రోత్సవాలు



**తిరుమల, ఆగస్టు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** కలియుగవైకుంఠం తిరుమలలో ఆనందనిలయంలోని సంపంగి ప్రాకారంలో మలయప్పస్వామి ఉత్సవ మూర్తులకు 3రోజులు జరిగిన పవిత్రోత్సవాలు మంగళవారం సాయంత్రం మహాపూర్ణాహుతితో ముగిశాయి. ఉదయం తిరుమలేశుని ఆలయం లోపల సంపంగి ప్రాకారంలో వేడుకగా శ్రీదేవిభూదేవిసమేత మలయప్పస్వామి యాగశాలలో హోమాలు వైదిక కార్యక్రమాలను ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపు, కొబ్బరిజలం తదితర సుగంధ ద్రవ్యాలతో విశేషంగా అభిషేకం చేశారు. సాయంత్రం మహాపూర్ణాహుతి సమర్పించారు. అనంతరం ఉభయదేవేరులతో మలయప్పస్వామి ఆలయ నాలుగుమాఢవీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమాల్లో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యాచౌదరి దంపతులు, ప్రధాన అర్చకుడు వేణుగోపాల దీక్షితులు, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ఆలయ పేష్కార్ రామకృష్ణ, విఎస్ఒ అల్లం సురేంద్ర, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

## శ్రీ రాఘవేంద్రస్వామి సన్నిధిలో రాష్ట్ర మంత్రులు

### ఆశీర్వదించిన పీఠాధిపతి



**మంత్రాలయం, ఆగస్టు 25 ప్రభాతవార్త:** మంత్రాలయంలోని ప్రసిద్ధ శ్రీ గురు రాఘవేంద్రస్వామి మఠాన్ని కర్నూలు జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే డాక్టర్ బి.వి.జయనాగేశ్వరరెడ్డి, మంత్రాలయం టిడిపి ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి, టిడిపి జిల్లా అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ, జోన్-5 ఇన్‌చార్జి శ్రీనివాసరెడ్డి మంగళవారం భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రులు శ్రీ గురు రాఘవేంద్రస్వామివారి బృందావనాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు, ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం మఠం పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ సుబుదేంద్రతీర్థ స్వామివారు మంత్రులకు శేషవస్త్రం కప్పి, ఫల మంత్రాంక్షింతలు, తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. రాష్ట్ర ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించాలని, రాష్ట్రం అన్ని రంగాల్ల మరింత అభివృద్ధి సాధించాలని స్వామివారిని ప్రార్థించినట్లు మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. మంత్రులు మఠం దర్శనానికి ముందుగా మంచాలమ్మ గ్రామదేవతను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజల శ్రేయస్సు, జిల్లాభివృద్ధి, సుఖ సంతోషాల కోసం ప్రార్థనలు చేశారు.

## దుర్గమ్మవారి సేవలో నూతన ఏపీ లోకాయుక్త



**ఇంద్రకీలాద్రి, ఆగస్టు 25, ప్రభాతవార్త:** ఇంద్రకీలాద్రిపై అమ్మవారిని నూతన ఏపీ లోకాయుక్త జస్టిస్ టి. మల్లికార్జున రావు తన కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయ డీఈఓ కిషోర్ కుమార్ అమ్మవారి శేష వస్త్రం, ప్రసాదాలు మరియు అమ్మవారి చిత్రపటాన్ని అందించారు. వేద పండితులు వారికి వేదాశీర్వచనం అందించారు. **- నిత్యాన్నదాన పథకానికి విరాళం:** దుర్గమ్మవారి ఆలయంలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి రు.1,00,150ల విరాళాన్ని బాపట్ల జిల్లా పేటేరు గ్రామంకు చెందిన భావన రుషి మంగళవారం అందించారు. దాతలకు దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అనంతరం ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

## బ్రహ్మోత్సవాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యత

**తిరుమల, ఆగస్టు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని భక్తులకు పరిశుభ్రమైన వాతావరణం, నాణ్యమైన ఆహారం అందించేందుకు టిటిడి ఆరోగ్యశాఖ ముందస్తు చర్యలు చేపట్టింది. టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి ఆదేశాల మేరకు తిరుమలలోని ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ఇకపై ప్రతి మంగళవారం "క్లీనింగ్ డే" ప్రత్యేకంగా నిర్వహించాలని నిర్ణయించింది.

వారం రోజుల పాటు వ్యాపార కార్యకలాపాలు నిర్వహించే దుకాణాల పరిసరాల్లో పేరుకుపోయే వ్యర్థాలు, మురికి తదితరాలను తొలగించి పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి మంగళవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లను మూసివేసి సంపూర్ణంగా శుభ్రం చేసుకోవాలని నిర్వాహకులకు సూచించారు.

## 28న గోవిందరాజస్వామి ఆలయంలో శ్రావణ ఉపకర్మ



**తిరుమల, ఆగస్టు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతి గోవిందరాజస్వామి ఆలయంలో 28వ తేదీ శ్రావణ ఉపకర్మను ఆగమోక్తంగా భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఉదయం 6.30 గంటలకు గోవిందరాజస్వామి, శ్రీ కృష్ణస్వామిని మంగళవాయిద్యాల నడుమకపి లతీర్థంలోని ఆళ్వార్‌తీర్థానికి ఊరేగింపుగా తీసుకువెళతారు. అక్కడ స్వామివారికి శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం, ఆస్థానం నిర్వహిస్తారు. అనంతరం సాయంత్రం 4.30 నుండి 6.30 గంటల వరకు ఆర్.ఎస్. మాడ వీధిలోని వైఖానసాచార్యుల ఆలయంలో భూసమేత గోవిందరాజస్వామికి ఆస్థానం నిర్వహించనున్నారు. అనంతరం స్వామివారు తిరిగి ఆలయానికి చేరుకుంటారు. శ్రావణ పౌర్ణమి పర్వదినాన నిర్వహించే ఈ పవిత్ర శ్రావణ ఉపకర్మలో భక్తులు పాల్గొని స్వామివారి దివ్య మంగళానుగ్రహాన్ని పొందాలని టిటిడి కోరింది.

## ఆర్టీసీ విద్యుత్ బస్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

**తిరుపతి, ఆగస్టు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆర్టీసి విద్యుత్ బస్సులు నడుపుతున్న డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం తక్షణమే పరిష్కరించాలని ఆర్టీసి విద్యుత్ బస్సుల డ్రైవర్స్ యూనియన్ సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కార్మికశాఖ డిప్యూటీ కమిషనర్ సురేష్ కుమార్‌కి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఎస్ జయచంద్ర, రాష్ట్ర కమిటీ సభ్యుడు జి.బాలసుబ్రహ్మణ్యంతో బాటు డ్రైవర్‌లు పాల్గొన్నారు. ప్రధాన కార్యదర్శి మునీంద్ర, అధ్యక్షుడు మునయ్య, కోశాధికారి యువరాజు, కేవస్ నాయక్, వి. సోమశేఖర్, పీకే రెడ్డి, యు.విజయకుమార్, ఎం. ప్రవీణ్, సి. సోమశేఖర్, వి. హేమంత్, సి. అనిల్ కుమార్, బి. వినోద్ కుమార్, ఎస్కె మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

# వేళాపాళా లేని సర్వదర్శనం టోకెన్లు జారీ !

- ఆఫ్‌లైన్‌లో టైమ్‌స్లాట్ కోటాకోసం భక్తుల అవస్థలు
- అర్థరాత్రి దాటాక గంటన్నరలోపే మూసివేత

**తిరుమల, ఆగస్టు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనానికి దేశ వ్యాప్తంగా భక్తులు భారీగా తరలివస్తున్నారు. రోజురోజుకూ పెరుగుతున్న సామాన్యభక్తుల తాకిడితో తిరుపతిలో ఆఫ్‌లైన్‌లో టిటిడి జారీచేస్తున్న సమయ నిర్దేశిత సర్వదర్శనం టోకెన్లుకు వేళాపాళా లేకుండా పోయింది. ఈ టోకెన్లు ఎప్పుడు జారీచేస్తారో.. ఎప్పుడు అయిపోతాయో అనే సమాచారం కూడా తెలియకుండా భక్తులు అవస్థలు పడుతున్నారు. రద్దీ పెరిగితే ఈ టోకెన్లు జారీకి సమయం సందర్భం లేకపోతోంది. అధికారుల ఇష్టారాజ్యంగా మారిందనేది భక్తుల నుండి వినిపిస్తున్న విమర్శలు. రోజువారీగా 10వేల సర్వదర్శనం టోకెన్లు, 2వేలు దివ్యదర్శనం టోకెన్లు (శ్రీవారి మెట్టు మార్గం) విడుదల చేస్తున్నారు. ఈ టోకెన్లుకోసం దాదాపు ఏడెనిమిది గంటల సమయం తిరుపతిలోని ఆర్టీసి బస్టాండ్ సమీపంలోని శ్రీనివాసం వసతిసముదాయం, రైల్వేస్టేషన్ సమీపంలోని విష్ణునివాసంతోబాటు అలిపిరి భూదేవి కాంప్లెక్స్‌లోని కౌంటర్ల వద్ద భక్తులు బారులు తీరి ఉంటారు. భక్తుల రద్దీ పెరిగితే టిటిడి తలనొప్పిని తగ్గించుకునేందుకు ఈ టోకెన్లు ఎప్పుడు బడితే అప్పుడు జారీ చేస్తుండటం జరుగుతోంది. సాధారణంగా తిరుపతిలో ఆఫ్‌లైన్ కౌంటర్లలో మధ్యాహ్నం 1గంట ప్రాంతంలో ఈ సమయనిర్దేశిత సర్వదర్శనం టోకెన్లు జారీ చేయాల్సి ఉంది. ఈ టోకెన్లు అందుకున్న భక్తులు ఆ రోజుగానీ, మరుసటిరోజుగానీ తిరుమలకు చేరుకోవచ్చు. అయితే వీరికి ఎలాంటి వసతి సౌకర్యం గదులు కేటాయించరు. భక్తులు ఆలయం ముందుగానీ, తిరుమలలోనే పార్కుల్లో, ఖాళీస్థలాల్లో, కాటేజీల వద్ద, యాత్రికుల వసతి సముదాయాల్లో విశ్రాంతి తీసుకునే వెసులుబాటు ఉంది. ఇలా రోజుకు 12వేలమంది వరకు సామాన్యభక్తులు ఆఫ్‌లైన్‌లో టోకెన్లు పొంది తిరుమలకు వస్తుంటే ఎలాంటి టోకెన్లు, దర్శన టిక్కెట్లు లేని భక్తులు 30వేలమంది వరకు వస్తున్నారనేది టిటిడి అంచనా. అయితే తిరుమలలో వసతి మాత్రం వీరికి కేటాయించరు.

**ఆఫ్‌లైన్‌కు పెరుగుతున్న డిమాండ్:** సాధారణంగానే తిరుమలకు దేశం నలుమూలల నుండి భక్తులు తరలివస్తున్నారు. మరీ వారాంతంలో ఈ భక్తుల సంఖ్య 50వేల మంది వరకు ఉంటుంది. వారాంతంలోనూ 10వేల సర్వదర్శనం టోకెన్లు మాత్రమే జారీచేస్తుండటంతో మిగిలిన వాళ్ళు సాధారణ సర్వదర్శనంపై ఆధారపడుతున్నారు. ఇలా రద్దీపెరిగితే 24గంటలు పైగా భక్తులు నిరీక్షణ తప్పడంలేదు. ఇక లక్షలాదిమంది భక్తులు తమ ఇష్టదైవాన్ని శ్రీవేంకటేశ్వరస్వామిని మరింత దగ్గరగా తనివితీరా వీక్షించాలని తపన పడుతుంటారు. అలాంటి వారికి ఆలయంలోపలబంగారువాకిలిలో జయవిజయుల వరకే మహాలఘు దర్శనం చేసి పంపుతున్నారు. ఆఫ్‌లైన్‌లో జారీచేస్తున్న టైమ్‌స్లాట్ టోకెన్లు కోసం ఇప్పటికీ సమయం సందర్భం లేకుండా ఉండటంతో క్యూలైన్లలో బారులుతీరిన భక్తులు గంట సమయంలోనే ఈ టోకెన్లన్నీ జారీ అయిపోతున్నాయి. దీన్నిబట్టి సామాన్యభక్తులు స్వామివారి దర్శనానికు ఎంతటి ఆసక్తి చూపుతున్నారనేది తెలుస్తుంది. టిటిడి కూడా ఎప్పటికప్పుడు భక్తులకు సంతృప్తికర, సులభ దర్శనం చేయించేందుకు కసరత్తు చేస్తోంది. ప్రతిరోజూ తిరుమలకు చేరుకుని స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు 90వేల మంది వరకు ఉండటం విశేషం. టిటిడి పాలకమండలి, అధికారులు సామాన్యభక్తులకు దేవుని దర్శనమ్ మరింత తక్కువసమయంలో సంతోషంగా చేయించాలనే తపనతో వినూత్నంగా ఆలోచన చేస్తున్నా ఆచరణలో మాత్రం అమలుకు నోచుకోవడం లేదు. టోకెన్లతో కొండకు వచ్చినా సాధారణ సర్వదర్శనమ్‌లోనే వైకుంఠమ్ 2నుండి, రద్దీ పెరిగితే ఆలయం వెలుపల క్యూలైన్ల నుండి ప్రవేశించాల్సిన కష్టం భక్తులకు తప్పడంలేదు.


**AU SMALL FINANCE BANK** — A SCHEDULED COMMERCIAL BANK

**AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ (ఒక షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్)**

నమోదిత కార్యాలయం: 19-ఎ, ధూలేశ్వర్ గార్డెన్, అజ్మీర్ రోడ్, జైపూర్-302001, రాజస్థాన్, (ఇండియా) (CIN:L36911RJ1996PLC011381)

**అనుబంధం-IV-A- (నియమం 8(6) నిబంధన చూడండి) స్థిర ఆస్తుల అమ్మకానికి విక్రయ ప్రకటన**

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు, 2002 యొక్క నిబంధన 8(6) ఏర్పాటుతో చదువబడే సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద స్థిరాస్తుల యొక్క అమ్మకానికి ఇ-వేలం విక్రయ ప్రకటన.

ఇందుమూలముగా సాధారణ ప్రజానీకానికి ప్రత్యేకంగా రుణగ్రహీత/లు)/సహ-రుణగ్రహీత(లు), తనఖాదారులు(లు) మరియు హామీదారులు(లు) (ఎవరైతే సెక్యూరిటీ క్రెడిటార్కు తనఖా ద్వారా ఆర్థిక రుణ సౌకర్యాన్ని పొందారో వారికి) AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ (ఒక షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్) యొక్క అధీకృత అధికారిచే నిర్మాణాత్మక/భౌతిక స్వాధీనం చేసుకొనబడిన వారికి ఈ ప్రకటన జారీ చేయబడుతోంది. ఇక నుండి ఆపై అది AUSFBకి రిఫర్ చేయబడుతుంది. ఫిన్‌కేర్ స్మాల్ ఫైనాన్షియల్ బ్యాంక్ లిమిటెడ్ ఏదైతే ఇప్పుడు 01వ ఏప్రిల్ 2024 నుండి AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ లోనికి మరియు విలీనమైందో దాని నుండి క్రింద వివరింపబడిన స్థిరాస్తులు, స్వాధీనం చేసుకొన్న సెక్యూర్డ్ ఆస్తులు క్రింద పట్టికలో పేర్కొన్న మొత్తం రికవరీ నిమిత్తం 'ఏది ఎక్కడ' 'ఎలా ఉన్నవీ అక్కడ అలా' 'ఏవి ఎలా ఉన్నవీ' మరియు 'అక్కడ ఏదో అలాగే' ప్రాతిపదికన తదుపరి వచ్చే వడ్డీ, ధర, ఛార్జీలు మరియు ఖర్చులు AUSFBకి అనగా సెక్యూర్డ్ క్రెడిటార్కు బకాయి కారణంగా ఇవేలం ద్వారా విక్రయించబడతాయి.

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా వెబ్సైట్ https://sarfaesi.auctiontiger.net ద్వారా బహిరంగ ఇవేలం నిర్వర్తిస్తున్నారని మీకు తెలియజేస్తున్నాము.

| రుణ ఖాతా నం/రుణగ్రహీతలు/ సహ-రుణగ్రహీతలు, తనఖాదారులు, హామీదారుడి పేరు | డిమాండ్ నోటీసు 13(2) యొక్క తేదీ & మొత్తం | స్వాధీనతా తేది | ఆస్తి కొరకు రిజర్వ్ ధర | ఆస్తి కొరకు బయానా | ఇ-వేలం తేదీ & సమయం | బిడ్ సమర్పణ తేది | టెండర్ దాఖలు యొక్క ఇ-వేలం ప్రదేశం | సంప్రదించు వ్యక్తి & ఆస్తి దర్శించుతేదీ |
| --- | --- | --- | --- | --- | --- | --- | --- | --- |
| (Loan A/C No.) L22660001144062 M.D గౌస్ పాషా (రుణగ్రహీత) బేగం (సహ-రుణగ్రహీత) | 26-ఆగస్టు-24 రూ.10,09,504/- రూ. పది లక్షల తొమ్మిది వేల ఐదు వందల నాలుగు మాత్రమే. 19-ఆగస్టు-24 నాటికి | 16-జూన్-26 | రూ. 10,30,000/- రూ.పది లక్షలు ముప్పై వేలు మాత్రమే | రూ. 1,03,000/- రూ. ఒక లక్ష మూడు వేలు మాత్రమే | 07-అక్టోబరు-26 మ.2.00గం. నుండి సా.4.00గం.కు 5 నిమిషాలు యొక్క అపరిమిత పొడిగింపుతో | 05-అక్టోబరు-26న లేదా ముందు | AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ శాఖ చిరునామా : H.No. 7/40/1, 1వ అంతస్తు, రామేశ్వర కాంప్లెక్స్, కర్నూల్ రోడ్, శ్రీనివాసపుర మహబూబ్‌నగర్-509103 | తెల్లా ప్రదీప్ 8008801095 భాను ప్రతాప్ సింగ్, 9358002663, bhanu.singh3@aubank.in 30-సెప్టెంబరు-26 |

**తనఖా పెట్టిన ఆస్తి వివరణ:** మహబూబ్‌నగర్ జిల్లా, కోయిల్‌కొండ మండలం, కోయిల్‌కొండ గ్రామం, కోయిల్‌కొండ గ్రామ కంఠం వద్ద ఉన్న స్థిరాస్తి ఇంటి నం. 7-69A1. దీని విస్తీర్ణం 100 చదరపు గజాలు దాగా, ఇందులో 616 చదరపు అడుగుల విస్తీర్ణంతో RCC పైకప్పు కలిగిన భవనం ఉంది. కొలత: 100చ.గజాలు.

**ఇ-వేలం అమ్మకం నిబంధనలు మరియు షరతులు:**

1). సెక్యూర్డ్ ఆస్తి యొక్క ఇ-వేలం అమ్మకం "ఎక్కడ ఉన్నది ఉన్నట్లుగానే", "ఏది ఉందో అలాగే", "ఏది ఉందో అలాగే" మరియు "అక్కడ ఏది" ఆధారంగా సెక్యూర్డ్ క్రెడిటర్ అంటే AUSFB తరపున జరుగుతుంది మరియు పేర్కొన్న ఆస్తిపై ఎటువంటి తెలిసిన చిక్కులు లేవు.

2). ఆన్లైన్ ఇవేలం అమ్మకంలో పాల్గొనడానికి, బిడ్ డాక్యుమెంట్, పాన్ కార్డ్ కాపీలు, కంపెనీ విషయంలో బోర్డు రిజల్యూషన్ మరియు ఫోటో ఐడి, చిరునామా రుజువును బయానాతో పాటు సమర్పించాలి, దీనిని MSME AUCTION POOL ACCOUNT OF AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్, కరెంట్ ఖాతా నం. 1921201121711599 AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ ఐదవ మరియు ఆరవ అంతస్తు సన్నీ బిగ్ జంక్షన్ STC ఖస్రా నం. 64 నుండి 67, గ్రామ్ సుల్తైపురా న్యూ ఆతిష్ మార్కెట్ జైపూర్ 302020, IFSC కోడ్: AUBL0002011, ఆన్‌లైన్ బిడ్ సమర్పించిన తర్వాత, దానిని ఉపసంహరించుకోలేరు. ఇంకా బిడ్డర్ సమర్పించిన ఏదైనా EMD రద్దు చేయబడిన చెక్కు కాపీతో RTGS/NEFT యొక్క UTR/రిఫరెన్స్ నంబర్ను ఈ క్రింది ఇమెయిల్ IDకు అంటే auction aubank.inకు పంపాలి.

3) ఆసక్తిగల పాల్గొనేవారు/బిడ్డర్లు అందరూ మరిన్ని వివరాల కోసం https://sarfaesi.auctiontiger.net & https://www.aubank.in/bank-auction వెబ్‌సైట్‌ను సందర్శించాలని అభ్యర్థించారు. ఇ-వేలం అమ్మకాల ప్రక్రియలో పాల్గొనడానికి నిబంధనలు & షరతులు మరియు auctions aubank.in ఇమెయిల్ ద్వారా కూడా సంప్రదించవచ్చు.

దయచేసి గమనించండి: పైన పేర్కొన్న తేదీన టెండర్/ఇంటర్ సే బిడ్డింగ్ ద్వారా అమ్మకం గురించి పైన పేర్కొన్న రుణ ఖాతా యొక్క రుణగ్రహీతలు/సహ రుణగ్రహీతలు/ తనఖాదారులకు నియమం 8(6)తో కలిపి చదవబడిన నియమం 9(1) కింద ఇది 30 రోజుల నోటీసు కూడా. ఇచ్చిన నోటీసు వ్యవధిలో రుణగ్రహీత వారి బకాయిలను పూర్తిగా తిరిగి చెల్లించకపోతే ఆస్తి అమ్మబడుతుంది.

తేది: 25/08/2026 ప్రదేశం : మహబూబ్‌నగర్, తెలంగాణ

అధీకృత అధికారి, AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్.

# పిల్లలకు సొంత వైద్యమా?



సాధారణంగా చిన్న వయసులో పిల్లలు ఆడుకోవడానికి వివిధ రకాల ఆట వస్తువులను తాకుతుంటారు. వీటి నుంచి సోకే క్రిముల కారణంగా జలుబు వచ్చే అవకాశం ఉంటుంది. అలాగే వాతావరణంలో వచ్చే మార్పులు, కొత్తగా ఏదైనా ఆహార పదార్థాన్ని అలవాటు చేసినప్పుడు కూడా జలుబు చేయడం సహజం. జలుబు ఉన్నా కానీ సాధారణంగా ఆడుకుంటారు. ఎదుగుదలలో ఎలాంటి సమస్యా లేదు అంటే అది అలర్జీ వల్ల వచ్చిన జలుబుగా భావించాలి. ఇతర ఇన్ఫెక్షన్ల వల్ల జలుబు వచ్చినప్పుడు జ్వరం రావడం, సరిగా నిద్రపోకపోవడం.. వంటి లక్షణాలు కనిపిస్తుంటాయి. మొదటి రకం జలుబుకి అలర్జీకి సంబంధించిన మందులు వాడితే సరిపోతుంది. ఏదైనా ఇన్ఫెక్షన్ వల్ల జలుబు వచ్చినప్పుడు శ్వాస తీసుకోవడానికి పిల్లలు ఇబ్బంది పడుతుంటారు. దానివల్ల వాంతులు చేసుకోవడం, నిద్రపట్టకపోవడం, ఆయాసపడడం.. వంటి లక్షణాలు కనిపిస్తాయి. అలాగే ఎక్కువసేపు ఏడుస్తుంటారు కూడా. ఇలాంటప్పుడు ఈ రకం నెబ్యులైజర్ వాడాల్సి ఉంటుంది. కానీ కొంతమంది ముక్కు దిబ్బడ తగ్గకుండాని జలుబు నుంచి వేగంగా ఉపశమనం పొందడాని సొంతంగా గానే నెబ్యులైజర్ వాడుతుంటారు. కానీ అది సరికాదు. డాక్టర్ సలహా మేరకు మాత్రమే నెబ్యులైజర్ని ఉపయోగించాలి. ఒకవేళ బాబుకి తరచూ అలర్జీ సమస్య ఉంటే అత్యవసర సమయంలో నెబ్యులైజర్ వాడవచ్చు. అయితే ప్రతిసారీ జలుబుకి నెబ్యులైజర్ ప్రత్యామ్నాయ చికిత్స కాదన్న విషయం మాత్రం గుర్తుపెట్టుకోండి. □

మన శరీరంలోని కీళ్లన్నింటిలో ఓ మెత్తటి ఎముక ఉంటుంది. కీలు దగ్గర కలిసే రెండు ఎముకలు ఒకదానికొకటి తగిలి రాపిడి ఏర్పడకుండా ఇది కాపాడుతుంది. దీన్నే మృదులాస్థి (కార్టిలేజ్) అంటారు. మిగతావాటికన్నా మోకాలి చిప్పదగ్గర ఉన్న ఈ మృదులాస్థి తొందరగా అరిగిపోతుంటుంది. అందువల్లే ఎక్కువమంది మోకీలు

# మోకాలిచిప్ప సమస్యకు 'జిగురు'!



సమస్యతో బాధపడుతుంటారు. ఈ మృదులాస్థి శరీరంలోని మిగతా ఎముకల్లా తనని తాను మరమ్మతు చేసుకోలేదు. పునరుత్పత్తిలం కోలేదు. రక్తం దీనికి నేరుగా అందకపోవడం ఇందులో కారణం. వైద్యులు మోకాలి చిప్ప శస్త్రచికిత్స చేసినప్పుడు అరిగిపోయిన ఆ మృదులాస్థిలోని కొంతభాగాన్ని తొలగిస్తారు. దానికిందున్న పెద్ద ఎముకకి రంధ్రాలు చేసి.. వాటి నుంచి రక్తం వచ్చేలా చూస్తారు. నేరుగా వచ్చే ఆ రక్తంతో మృదులాస్థి చాలా పెళుసుగా ఉంటుంది. చిన్న క్రమేణ విరిగిపోతుంది. ఈ సమస్య పరిష్కారానికే ఓ జిగురులాంటి పదార్థాన్ని కనిపెట్టారు అమెరికాలోని నార్త్ వెస్టర్న్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు. ఆ జిగురుని మోకాలిచిప్పలోకి నేరుగా ఇంజెక్ట్ చేస్తారు. జిగురు లోపలికెళ్లాక అందులోని ప్రోటీన్ ఆ ప్రాంతంలో టీజీఎఫ్ బీ 1 అనే రసాయనాన్ని ప్రేరేపిస్తుంది. ఆ రసాయనం అక్కడికక్కడే మృదులాస్థిని మరమ్మతు చేసి గట్టిగా ఎదిగేలా చేస్తోందట. ఇంకో సర్జరీ దీనికి అక్కర్లేదట. ఈ కొత్త విధానంతో త్వరలో క్లినికల్ ట్రయల్స్‌కి వెళ్లామంటున్నారు శాస్త్రవేత్తలు. □

# అల్మారాలో సర్దేద్దాం!



బ్రాండెడ్ దుస్తులకు ప్రత్యేకంగా ట్యాగ్ ఉంటుంది. అందులో వాటిని శుభ్రపరిచే విధానం నుంచి అరబెట్టడం, ఇస్త్రీ తదితర విషయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలన్నీ పొందుపరచి ఉంటాయి. వాటిని పాటిస్తే ఎక్కువకాలం ఆ వస్త్రం మన్నుతుంది. ఎంబ్రాయిడరీ, ఫ్యాబ్రిక్ పెయింటింగ్ చేసిన దుస్తులైతే నాణ్యత తగ్గకుండా జాగ్రత్తపడితే మరిన్ని రోజులు అకర్షణగా కనిపిస్తాయి. చిన్న మరక పడినా ఘాటైన రసాయ నాలున్న లిక్విడ్స్‌తో మొత్తం డ్రెస్‌ను శుభ్రపరిస్తే కాలక్రమేణా అది కళను కోల్పోతుంది. కొన్నిరకాల వస్త్రాలైతే త్వరగా చిరిగిపోయే ప్రమాదమూ ఉంది. దీనికి బదులుగా మరకలు పడిన ప్రాంతంలో మాత్రం సున్నితమైన డిటర్జెంట్ లేదా సహజమైన స్టెయిన్ రిమూవర్‌ని ఉపయోగించి శుభ్రపరచి ఆరనివ్వాలి. ఆ తర్వాత వస్త్రం మొత్తాన్ని సాధారణంగా ఉతికితే సరిపోతుంది. దుస్తులను వల్లనీటిలో శుభ్రపరచాలి. ముదురు వర్ణంలో ఉన్నవాటిని మొదటిసారి ఉతికే ముందు అరబకెట్ నీళ్లలో రెండుచెంచాల ఉప్పు వేసి అయిదు నిమిషాలపాటు నాననివ్వాలి. దానితో రంగు దిగకుండా ఉంటుంది. ఆ తర్వాత తేలికపాటి డిటర్జెంట్‌తో శుభ్రపరిచి ఆరనిస్తే చాలు. కొన్ని డ్రెస్‌లకు అదనంగా బొత్తాలుంచిన చిన్న కవర్ అటాచ్ చేసి ఉంటుంది. బయటకువేయకుండా దాన్ని భద్రపరచాలి. బటన్ ఊడినప్పుడు ఆ డిజైను వక్కన పడేయ కుండా, ఆ చోట కొత్తదాన్ని కుట్టుకోవాలి. చిన్నగా కుట్టు ఊడినప్పుడు లేదా మరేదైనా మరమ్మతు ఉంటే నేర్చుకుని బాగు చేసుకోవాలి. ఇస్త్రీకి ముందుగా ఆ వస్త్రానికి తగ్గ వేడిని చెక్ చేయాలి. అలాగే అలమరలో కుక్కేయకుండా మడిచి వరసగా సర్దడం లేదా హ్యాంగర్లకు వేయడం అలవరుచుకుంటే దుస్తులు ఎక్కువ కాలం మన్నుతాయి. అలమరలలో దుస్తుల స్థానాన్ని అప్పుడ ప్పుడు మార్చుతూ ఉండాలి. లేదంటే కంటికి కనిపించేవాటిని మాత్రమే ధరిస్తాం. మిగతా వన్నీ అడుగుకు వెళుతుంటాయి. నెలకోసారి లేదా సీజన్ మారినప్పుడల్లా దుస్తులను బయటకు తీసి వినియోగించేవీ లేదా అనవసరమైన వాటిని విడదీసి తిరిగి సర్దాలి. కొన్నింటిని రీసైకిల్ చేయొచ్చు. అలాగే వాడనివాటినివిరాళంగా ఎన్జీవోలకు అందించడం అలవరచుకోవాలి. □

# బీరపొట్టు పొడి

లేత బీరకాయ పొట్టు- అరకేజీ, వాము- చెంచా, ఎండుమిర్చి-12, మినపప్పు- రెండు చెంచాలు, పసుపు-పావుచెంచా, వెల్లుల్లి రెబ్బలు-ఏడు, చింతపండు-10గ్రా.



**తయారీ :** బీరకాయపొట్టులో చెమ్మలేకుండా చేసుకుని అరచెంచా ఉప్పు వేసి మిక్సీలో బరకగా ఆడించుకోవాలి. పొయ్యిమీద పాన్ పెట్టుకుని చెంచా నూనె వేసుకుని ఎండు మిరపకాయల్ని రంగు మారేంతవరకూ వేడి చేసి పక్కనపెట్టేయాలి. ఆ తర్వాత అదేపాన్‌లో మినపప్పుని ఎర్రగా వేయించుకుని పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు పాన్‌లో చెంచా నూనె వేసుకుని వేడెక్కాక బీరకాయ పొట్టుని వేసి పొడిపొడిగా అయ్యేంతవరకూ వేయించుకోవాలి. ఇందులోనే పసుపు, వాము కూడా వేసుకుని మరికాసేపు వేయించుకోవాలి. మక్సీలో వేయించిన ఎండుమిర్చి, మనిపప్పు, వెల్లుల్లిపాయ రెబ్బలు, చింతపండు వేసి పొడి చేసుకోవాలి. ఆ తర్వాత బీరకాయపొట్టు, ఉప్పు కూడా వేసి పొడి చేసుకోవాలి. యాంటీ ఆక్సిడెంట్లు నిండుగా ఉండే ఈ పొడి.. వాముపల్ల జీర్ణప్రక్రియ సజావుగా సాగేట్టు చేస్తుంది. □

# మెడ నలుపుకిలా..!



అందంగాకనిపించాలని.. ఎక్కువమంది ముఖ సౌందర్యంపైనే శ్రద్ధ పెడతారు. కాళ్లు, చేతులు, మెడ వంటి భాగాలను పట్టించుకోరు. దాంతో ఆయా ప్రదేశాలు నల్లగామారి.. అందవిహీనంగా కనిపిస్తాయి. కాళ్లు, చేతులను కవర్ చేసినా.. మెడపై ఉండే నలుపు (డార్క్ నెక్)తో ఎక్కువ ఇబ్బంది పడుతుంటారు. అందంగా కని పించాలని.. ఎక్కువమంది ముఖ సౌందర్యం పైనే శ్రద్ధ పెడతారు. కాళ్లు, చేతులు, మెడ వంటి భాగాలను పట్టించుకోరు. దాంతో ఆయా ప్రదేశాలు నల్లగా మారి.. అంద విహీనంగా కనిపిస్తాయి. కాళ్లు, చేతులను కవర్ చేసినా.. మెడపై ఉండే నలుపు (డార్క్ నెక్)తో ఎక్కువ ఇబ్బంది పడుతుంటారు. ఈక్రమంలో కొన్ని చిట్కాలు పాటిస్తే.. డార్క్ నెక్ సమస్యను ఇట్టే దూరం చేసుకోవచ్చని సౌందర్య నిపుణులు అంటున్నారు. నల్లగా మారిన చర్మాన్ని తెల్లగా మార్చడంలో టమాట, నిమ్మరసంలో ఉండే విటమిన్ సి సాయపడు తుంది. తేనెలో ఉండే సుగుణాలు.. చర్మాన్ని మృదువుగా మారుస్తాయి. ఒక చిన్న గిన్నెలో కొద్దిగా టమాటా రసం, రెండుమూడు చుక్కల నిమ్మరసం, కొంచెం తేనె వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని మెడపై నల్లగా మారిన ప్రదేశంలో అప్లయి చేయాలి. అర గంటపాటు అలాగే వదిలేసి.. ఆ తర్వాత చల్లటి నీటితో కడిగేయాలి. ఆలుగడ్డలు క్లెన్సర్‌గా పనిచేస్తాయి. నిమ్మ రసం.. అద్భుతమైన బ్లీచింగ్ ఏజెంట్ కూడా. డార్క్ నెక్‌ను తగ్గించడంలో ఈ రెండిటి మిశ్రమం సమర్థంగా పనిచేస్తుంది. □



# సుదర్శన చక్రత్తాళ్వార్



దుష్ట శిక్షణ .. శిష్ట రక్షణ కోసం శ్రీమహా విష్ణువు అనేక అవతారాలను ధరించాడు. లోక కల్యాణం కోసం స్వామివారు అవతరిస్తున్నప్పుడల్లా, ఆయన ఆజ్ఞను పాటించడానికి సుదర్శన చక్రత్తాళ్వార్ కూడా వెన్నంటే వున్నాడు. ఒక్కో అవతారంలో మానుష రూపంలోనూ ఒక్కో సమయంలో ఆయుధ రూపంలోను ఆయన స్వామి ఆదేశాలను పాటిస్తూ వచ్చాడు. శ్రీమహా విష్ణువు రామావతారాన్ని ధరించినప్పుడు, ఆయన తమ్ముడు భరతుడిగా సుదర్శన చక్రత్తాళ్వార్ అవతరించాడు. కృష్ణావతారంలో సుదర్శనుడుగానే స్వామిని అంటిపెట్టుకుని వున్నాడు. పరశురామావతారంలో గొడ్డలిఖిగా అవతరించాడు. నరసింహ స్వామి అవతారంలో ఆ స్వామి 'గోళ్లు'గా ఆవిర్భవించాడు. ఇలా స్వామివారు ఆయా అవతారాలను ధరిస్తూ ఉండగా, ఆ అవతారాల్లో స్వామివారు అప్పగించే బాధ్యతలను సుదర్శనుడు నెరవేరు స్తుంటాడు. లోక కళ్యాణం కోసం స్వామి వారు తలపెట్టిన కార్యాన్ని పూర్తి చేయడంలో తనవంతు కర్తవ్యాన్ని నిర్వహిస్తుం టాడు.

తెర

# సంగీత వారసత్వాన్ని.. కోల్పోతానేమోనన్న భయం



కర్ణాటక సంగీతం, కుటుంబ వారసత్వం, స్వీయ అన్వేషణల సమ్మేళనంగా రూపొందిన కొత్త తెలుగు వెబ్ సిరీస్ జగమే సంగీతం ట్రైలర్ విడుదలైంది. ప్రముఖ నటుడు ప్రకాశ్ రాజ్ ప్రధాన పాత్ర పోషిస్తున్న ఈ సిరీస్ సెప్టెంబర్ 4 నుంచి ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా ట్రైలర్ విడుదలైంది. హిందీలో విశేష ఆదరణ పొందిన బందిష్ బాండిట్స్ సిరీస్ స్ఫూర్తితో ఈ వెబ్ సిరీస్‌ను తెరకెక్కించారు. వైకుంఠపురం అనే దేవాలయ పట్టణం నేపథ్యంలో ఈ కథ సాగుతుంది. ప్రముఖ సంగీత విద్వాంసుడైన శాస్త్రి (ప్రకాశ్ రాజ్) కుటుంబ వారసత్వాన్ని కాపాడుకునేందుకు తాపత్రయపడుతుంటాడు. ఆయన మనవడు బాలు (అక్షయ్ లగుసాని) తాత వారసత్వాన్ని నిలబెడుతూనే, తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు ఎంచుకునే క్రమంలో ఎదుర్కొనే వైరుధ్యాలు, కుటుంబ సంబంధాల చుట్టూ కథ తిరుగుతుంది.

ఈ సదర్భంగా ప్రకాశ్‌రాజ్ మాట్లాడుతూ.. శాస్త్రి పాత్రలోని క్రమశిక్షణ, నమ్మకాలు తనను బాగా ఆకట్టుకున్నాయి. తరతరాల సంగీత వారసత్వాన్ని ఎక్కడ కోల్పోతానేమోనన్న భయంతో ఉండే ఒక తండ్రి పాత్ర ఇది. సంగీతం మనుషులను ఎలా కలుపుతుందో అన్వేషించే అవకాశం దక్కింది. నటి మధుబాల మాట్లాడుతూ ఈ కథలోని కుటుంబ సంబంధాలు, నిజాయతీ తనను ఆకట్టుకున్నాయన్నారు.

సంగీతం కథకు ఆత్మ అయితే, మానవ సంబంధాలు ప్రేక్షకులతో ఉండిపోతాయని పేర్కొన్నారు. గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై సుస్మిత కొణిదెల ఈ సిరీస్‌ను నిర్మించగా, పల్నాటి సూర్య ప్రతాప్ దర్శకత్వం వహించారు.

# దివ్యమైన ఆహార్యం



యామదొంగలో యముడిగా కనిపించిన 20 ఏళ్ల తర్వాత జూనియర్ ఎన్టీఆర్ మళ్లీ మైథలాజికల్ టచ్ ఉన్న పాత్ర చేయబోతున్నారు. ఈ చిత్రంలో ఆయన కుమారస్వామి (లార్డ్ మురుగన్) ఆధారిత దివ్యమైన పాత్రలో కనిపించబోతున్నారనేది టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ప్రచారంలో ఉన్న పవర్‌ఫుల్ టైటిల్స్ ఈ చిత్రానికి గాడ్ ఆఫ్ వార్ లేదా దేవసేనాపతి అనే పవర్‌ఫుల్ టైటిల్స్ పరిశీలనలో ఉన్నాయి. కథలోని దివ్యత్వం మరియు యాక్షన్ ఎలిమెంట్స్‌కు అనుగుణంగా త్రివిక్రమ్ టీమ్ స్పెషల్ ఎఫెక్ట్స్, లుక్ టెస్ట్‌లను సిద్ధం చేస్తోంది. వరుస పాన్‌ఇండియా ప్రాజెక్ట్‌లుఎన్టీఆర్ ప్రస్తుతం ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న డ్రాగన్ షూటింగ్ పూర్తి చేసిన వెంటనే ఈ త్రివిక్రమ్ ప్రాజెక్ట్ సెట్స్‌లోకి అడుగుపెట్టనున్నారు. త్రివిక్రమ్ శ్రీనివాస్ ప్రస్తుతం వెంకటేష్‌తో ఆదర్శకుటుంబం సినిమా పూర్తి చేసిన తర్వాత ఈ ప్రాజెక్ట్‌పై దృష్టి పెట్టనున్నారు. సంగీతం: అనిరుధ్ రవిచందర్. నిర్మాణం: హారిక అండ్ హాసిని క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా భారీ బడ్జెట్‌తో నిర్మించనున్నాయి.

# హిట్ మెషీన్‌కు గ్రీన్ సిగ్నల్..

సూపర్ స్టార్ మహేష్ బాబు, సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి కాంబినేషన్ మరోసారి వెండితెరపై సందడి చేయబోతోందనే వార్త ప్రస్తుతం టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది.



దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి దర్శకత్వంలో మహేష్ నటిస్తున్న పాన్‌వరల్డ్ విజువల్ వండర్ వారణాసి షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. టైమ్ ట్రావెల్, గ్లోబ్‌ట్రాటింగ్ అడ్వెంచర్ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ భారీ చిత్రంపై ప్రపంచవ్యాప్తంగా అంచనాలు పరాకాష్టకు చేరాయి. అయితే ఈ ప్రాజెక్ట్ పూర్తికాగానే ఎక్కువ విరామం తీసుకోకుండా, తన తదుపరి చిత్రాన్ని వెంటనే పట్టాలెక్కించే దిశగా మహేష్ బాబు పక్కా ప్లాన్ వేస్తున్నారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. వారణాసి విడుదల కాకముందే మహేష్ తన నెక్ట్స్ సినిమాకు సంబంధించిన కాల్‌షీట్లను కేటాయించడానికి సిద్ధమవుతున్నారు. రాజమౌళి సినిమా ప్రమోషన్ల కోసం కేవలం ఒక నెల రోజులు మాత్రమే గ్యాప్ తీసుకుని, ఆ వెంటనే కొత్త చిత్రాన్ని సెట్స్‌పైకి తీసుకెళ్లాలని భావిస్తున్నారు. ఈ క్రమంలోనే అనిల్ రావిపూడి చెప్పిన ఓ సరికొత్త స్పోర్ట్స్ డ్రామా కథాంశానికి మహేష్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చే ఆలోచనలో ఉన్నారు. వీరిద్దరి కాంబినేషన్‌లో గతంలో వచ్చిన సరిలేరు నీకెవ్వరు భారీ బాక్సాఫీస్ విజయాన్ని సాధించడంతో ఈ కొత్త ప్రాజెక్ట్‌పై చర్చలు ముమ్మరంగా సాగుతున్నాయి. తక్కువ సమయంలోనే నాణ్యమైన వినోదాన్ని అందిస్తూ విజయాలు సాధించడంలో అనిల్ రావిపూడి దిట్ట. దీంతో రాజమౌళి సినిమా తర్వాత ఆయనతో ప్రాజెక్ట్ చేయడం సరైన నిర్ణయమని విశ్లేషకులు భావిస్తున్నారు. అంతేకాకుండా, రాజమౌళితో సినిమా చేసిన తర్వాత కథానాయకులకు ఫ్లాపులు ఎదురవుతాయనే సినీ పరిశ్రమలోని పాత సెంటిమెంట్‌ను బ్రేక్ చేయడానికి కూడా హిట్ మెషీన్ అనిల్ రావిపూడి సరైన ఎంపిక అని మహేష్ బాబు భావిస్తున్నట్లు టాలీవుడ్ టాక్. ఈ చిత్రాన్ని 2028 సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చేలా ప్రణాళికలు రచిస్తున్నారు.

# ...ఇది వెయ్యి మాస్ బీట్స్‌తో సమానం



దసరా వంటి భారీ విజయం తర్వాత నేచురల్ స్టార్ నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్లో తెరకెక్కుతున్న పాన్‌ఇండియన్ చిత్రం ది ప్యారడైజ్. ఈ సినిమా మ్యూజిక్ సెషన్స్ నుంచి తాజాగా లీకైన పిక్ సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతోంది. జాతీయ పురస్కార గ్రహీత, పాటల రచయిత కాసర్ల శ్యామ్ కాళ్లకు నమస్కరించి అనిరుధ్ రవిచందర్ ఆశీస్సులు తీసుకుంటున్న ఒక ప్రత్యేకమైన ఫొటోను నిర్మాణ సంస్థ ఎస్ఎల్‌వి సినిమాస్ నెట్టింట పంచుకుంది. "ఒక చిత్రం వెయ్యి పదాలతో సమానం.. కానీ ఇది వెయ్యి మాస్ బీట్స్‌తో సమానం" అనే క్యాప్షన్‌తో పాటు ఈ చిత్రం నుంచి సెకండ్ సింగిల్ త్వరలోనే విడుదల కాబోతోందని మేకర్స్ అధికారికంగా వెల్లడించడంతో సినిమాపై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. హైదరాబాద్ మురికివాడల నేపథ్యంలో, సామాజిక వివక్షకు వ్యతిరేకంగా పోరాడే జడల్ అనే పవర్ ఫుల్ పాత్రలో నాని నటిస్తున్న యాక్షన్ డ్రామా ది ప్యారడైజ్.



# ఒక్క అమ్మాయీ లేకుండా కొత్త సినిమా

సినిమా అనేది కేవలం పట్టణాలకే పరిమితం కాదని, పల్లెల్లోనూ ప్రతిభ దాగి ఉందనే ఆలోచనతో కొత్త దర్శకుడు అజర్ రూపొందించిన చిత్రం కొత్త సినిమా. ఏకంగా 100 మంది కొత్త మగ నటులతో, ఒక్క మహిళా పాత్ర కూడా లేకుండా తెరకెక్కించిన ఈ సినిమా ప్రీరిలీజ్ ప్రమోషన్ ఈవెంట్ వై ఇన్ హైదరాబాద్.. వై నాట్ ఇన్ అవర్ ప్లేస్ పేరుతో హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ దర్శకనిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ చిత్ర యూనిట్‌ను అభినందిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సినిమా గురించి తమ్మారెడ్డి భరద్వాజ మాటల్లో.. 'దర్శకుడు అజర్ టైటిల్ కొత్త సినిమా అని పెట్టడమే కాకుండా, ఒక వైవిధ్యమైన ప్రయత్నం చేశాడు. అందరూ మేల్ ఆర్టిస్టులతోనే సినిమా తీయడం బహుశా ఇదే మొదటిసారి కావచ్చు. ప్రస్తుతం సినిమా మేకింగ్ అంటే చాలా ఖర్చుతో కూడుకున్నది, నటులు దొరకడం కూడా కష్టమే. అలాంటిది అజర్ తన సొంత ఊరికి వెళ్ళి, అక్కడి లోకల్ టాలెం ట్‌ను ఎంపిక చేసుకుని, వారికి తగిన ట్రైనింగ్ ఇచ్చి ఈ సినిమా రూపొందించడం విశేషం. అయితే 100 మందిని పెట్టి ఒక్క అమ్మాయికి కూడా అవకాశం ఇవ్వక పోవడం కాస్త బాధగా ఉంది. అయినా ఈ కొత్త ప్రయత్నం మంచి విజయం సాధించి, దర్శకుడికి మంచి పేరు తీసుకురావాలని కోరుకుంటున్నాన్న అన్నారు. డీవోపీ జానీ బాషా, మ్యూజిక్ డైరెక్టర్ పెద్దపల్లి రోహిత్, నటులు రాకేష్, సురేష్, క్రిటిక్ చల్లా శ్రీనివాస్, డైరెక్టర్లు అజర్, వీరశంకర్, వీఎన్ ఆదిత్య, దర్శక నిర్మాత ఎన్ శంకర్ తదితరులు మాట్లాడారు.

# దిల్ రాజుతో వచ్చే సంక్రాంతికి..



ఇరుముడి ఘనవిజయంతో బాక్సాఫీస్ వద్ద రికార్డు కలెక్షన్లు కొల్లగొడుతున్న మాస్ మహారాజా రవితేజ, తన అభిమానులకు మరో భారీ తీపి కబురు అందించారు. థియేటర్లలో రూ. 200 కోట్ల మైలురాయి వైపు దూసుకెళ్తున్న ఇరుముడి గ్రాండ్ సక్సెస్‌ను ఎంజాయ్ చేస్తున్న తరుణంలోనే, రవితేజ తన తదుపరి చిత్రాన్ని అధికారికంగా ప్రకటించారు. ఈ క్రేజీ ప్రాజెక్ట్ కోసం టాలీవుడ్ ప్రముఖ నిర్మాత దిల్ రాజుతో రవితేజ చేతులు కలిపారు. రాజ రాజ చోర చిత్రంతో తన మార్క్ వినోదాన్ని అందించి ప్రేక్షకులను మెప్పించిన యంగ్ డైరెక్టర్ హాసిత్ గోలి ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై ప్రొడక్షన్ నంబర్ 64గా ఈ చిత్రం రూపొందనుంది. ఇరుముడి విజయం సందర్భంగా నిర్మాత దిల్ రాజు స్వయంగా రవితేజను కలిసి అభినందనలు తెలియజేశారు. ఇదే సమయంలో ఈ కాంబినేషన్‌కు సంబంధించిన అనౌన్స్‌మెంట్ పిక్స్‌ను విడుదల చేశారు. రవితేజ ఎనర్జీకి హాసిత్ గోలి మార్క్ కామెడీ టైమింగ్ తోడైతే థియేటర్లలో నవ్వుల పండగ ఖాయమని చిత్రబృందం ధీమా వ్యక్తం చేస్తోంది. పక్కా ఫన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కనున్న ఈ చిత్రాన్ని రాబోయే సంక్రాంతి కానుకగా థియేటర్లలోకి తీసుకురావడానికి ప్లాన్ చేస్తున్నారు.

**కన్నీళ్లు ఆపుకోవడం నా వల్ల కాలేదు**

రవితేజ కథానాయకుడిగా, శివ నిర్వాణ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించిన ఇరుముడి చిత్రం ఘన విజయం సాధించడంతో హైదరాబాద్‌లో చిత్ర బృందం సక్సెస్ మీట్ నిర్వహించింది. ఈ సందర్భంగా రవితేజ మాట్లాడుతూ భావోద్వేగానికి గురయ్యారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..'స్క్రీన్ మీద నన్ను చూసి మీరంతా నవ్వుతారు, ఈలలు వేస్తారు. నేను కూడా సాధారణంగా దేనికీ అంతగా ఎమోషనల్ అవ్వను. కానీ ఇరుముడి సినిమా చూశాక నా కన్నీళ్లు ఆపుకోవడం నా వల్ల కాలేదు. నా కూతురు మోక్ష కూడా సినిమా చూసి బాగా ఎమోషనల్ అయ్యింది. ఒక నటుడిగా నన్ను ఇంతలా కదిలించిన కథ ఇది. హిందీలో రాజ్‌కుమార్ హిరాణీ గారు తీసే సినిమాలు గుండెలను పిండేస్తూనే ఒక మంచి అనుభూతిని ఇస్తాయి. తెలుగులో శివ నిర్వాణ ఇరుముడితో సరిగ్గా అలాంటి అనుభూతినే అందించాడు. జీవీ ప్రకాశ్ ఇచ్చిన మ్యూజిక్ ఈ సినిమాకి నిజమైన ఆత్మ. థియేటర్‌లో ప్రతీ సన్నివేశాన్ని ఆయన తన సంగీతంతో నెక్స్ట్ లెవెల్‌కి తీసుకెళ్లాడు. ప్రేక్షకులు కంటతడి పెట్టడానికి ఆ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ప్రధాన కారణం. నాకు అత్యంత సంతోషాన్నిచ్చిన విషయం ఏంటంటే... దాదాపు 20 సంవత్సరాలుగా థియేటర్ వైపే రాని ఎంతో మంది పెద్దవాళ్లు, కుటుంబాలు ఈ సినిమా చూడటానికి మళ్లీ థియేటర్లకు వస్తున్నారు. ఒక నటుడికి అంతకంటే పెద్ద అవార్డు, ఆనందం ఇంకేం ఉంటుంది? అని పేర్కొన్నారు. దర్శకుడు శివ నిర్వాణ మాట్లాడుతూ గతంలో నా నిన్ను కోరి, మజిలీ చిత్రాలు నన్ను తెలుగువారి ఇళ్లలోకి తీసుకెళ్తే, ఇరుముడి ఏకంగా వారి హృదయాల్లో స్థానం సంపాదించిపెట్టిందని రవితేజ గారు అన్నారు. కేవలం కమర్షియల్ లెక్కల కోసమే కాకుండా, ప్రేక్షకులను భావోద్వేగపరంగా మెప్పించాలనే ఉద్దేశంతోనే ఈ చిత్రాన్ని రూపొందించామని పేర్కొన్నారు. సినిమా విడుదలైన అతి తక్కువ కాలంలోనే లాభాల బాట పట్టిందని మైత్రీ మూవీ మేకర్స్ తెలిపారు. గత 50 ఏళ్లలో ఇలాంటి అద్భుత రికార్డులు చూడలేదని డిస్ట్రిబ్యూటర్లు అంటున్నారని హర్షం వ్యక్తం చేశారు. బేబీ నక్షత్ర, నటుడు సాయికుమార్ తదితరులు మాట్లాడారు.

# స్పెషల్ షోకు అదనంగా రూ. 600



కన్నడ రాకింగ్ స్టార్ యశ్ హీరోగా గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో తెరకెక్కిన భారీ యాక్షన్ థ్రిల్లర్ టాక్సిక్. కేవీఎన్ ప్రొడక్షన్స్, మాన్స్టర్ మైండ్ క్రియేషన్స్ బ్యానర్లపై వెంకట్ కే నారాయణ, యశ్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదలకు సిద్ధమైంది. ఈ నేపథ్యంలో సినిమా టికెట్ ధరల పెంపుతో పాటు ప్రత్యేక షోల ప్రదర్శనకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు అనుమతులు మంజూరు చేస్తూ జీవోలు జారీ చేశాయి. సింగిల్ స్క్రీన్స్ పై రూ. 50, మల్టీప్లెక్స్ లలో రూ. 100 చొప్పున (జీఎస్టీతో కలిపి) పెంచుకోవడానికి రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు అనుమతిచ్చాయి. ఈ పెంపు విడుదలైన నాటి నుంచి 10 రోజుల పాటు అమల్లో ఉంటుంది. ఏపీలో ఆగస్టు 26 ఉదయం 6 గంటల నుంచే స్పెషల్ ప్రీమియర్ షోల ప్రదర్శనకు గ్రీన్ సిగ్నల్ లభించింది. ఈ ప్రత్యేక షోలకు జీఎస్టీతో కలిపి టికెట్ ధరపై అదనంగా రూ. 600గా నిర్ణయించారు. థియేటర్లలో రోజుకు ఐదు షోలు వేసుకునే వెసులుబాటు కల్పించారు. తెలంగాణలో టికెట్ రేట్ల పెంపు వల్ల వచ్చే ఆదాయంలో 20 శాతం నిధిని తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ వర్కర్ల సంక్షేమానికి కేటాయించాలనే ప్రభుత్వ నిబంధన మేరకు, టాక్సిక్ నిర్మాతలు రూ. 1 కోటి ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ కమిటీలో డిపాజిట్ చేసినట్లు తెలుస్తోంది. ఒక కన్నడ పాన్‌ఇండియా/డబ్బింగ్ చిత్రానికి తెలుగు రాష్ట్రాల్లో ఈ స్థాయిలో టికెట్ రేట్ల పెంపు లభించడం ట్రేడ్ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది.



## నెక్సో ఛాంపియన్‌షిప్.. శుభంకర్ 46వ స్థానం

**స్కాట్లాండ్‌బి:** ట్రంప్ ఇంటర్నేషనల్ గోల్ఫ్ లింక్స్‌లో జరిగిన 2026 నెక్సో ఛాంపియన్‌షిప్ చివరి రౌండ్‌లో ఈవెన్‌పార్ 72 స్కోరు సాధించిన భారత గోల్ఫ్ క్రీడాకారుడు శుభంకర్ శర్మ, 46వ స్థానంలో నిలిచాడు. మూడు బర్డీలు, మూడు బోగీలు నమోదు చేసిన శర్మ, 73, 72, 75, 72 రౌండ్ల తర్వాత నాలుగు ఓవర్ 292 స్కోరుతో టోర్నమెంట్‌ను ముగించాడు. తోటి భారత ఆటగాడు యువరాజ్ సంధు ఈ వారం ప్రారంభంలో కట్ మిస్ అయ్యాడు. స్కాట్లాండ్‌కు చెందిన స్కాట్ జేమీసన్ తన స్వదేశంలో రెండవ డీపీ వరల్డ్ టూర్ టైటిల్‌ను గెలుచుకోవడానికి, చివరి రౌండ్‌లో 67 స్కోరుతో అద్భుతమైన ప్రదర్శన కనబరిచాడు. 42 ఏళ్ల అతను 11అండర్ పార్ స్కోరుతో ముగించి, ఇంగ్లాండ్‌కు చెందిన మాథ్యూ జోర్డాన్ కంటే రెండు షాట్లు ముందున్నాడు. జామీసన్ చివరి రౌండ్‌ను రాత్రికి అగ్రస్థానంలో ఉన్న షాన్ నారిస్ కంటే మూడు షాట్లు వెనుకబడి ప్రారంభించినప్పటికీ, ఫ్రంట్ నైన్‌లో మూడు బర్డీలతో ఆ లోటును త్వరగా పూడ్చాడు. స్ట్రోక్‌ను ప్రభావితం చేసే పరిస్థితులను మెరుగుపరిచే చర్యలకు సంబంధించిన రూల్ 8.1ను ఉల్లంఘించినందుకు నారిస్‌కు తదనంతరం రెండుస్ట్రోక్ పెనాల్టీ విధించబడింది, దీంతో జామీసన్ టర్న్ వద్ద స్పష్టమైన ఆధిక్యాన్ని సాధించాడు.

ఆట



## దులీప్ ట్రోఫీ.. సెమీఫైనల్‌కు ఈస్ట్ జోన్

**న్యూఢిల్లీ:** ఈస్ట్ జోన్, నార్త్ ఈస్ట్ జోన్‌ను ఒక ఇన్నింగ్స్ మరియు 210 పరుగుల తేడాతో చిత్తుగా ఓడించి దులీప్ ట్రోఫీ సెమీఫైనల్స్‌లో స్థానం సంపాదించింది. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ గ్రౌండ్‌లో మంగళవారం జరిగిన ఈ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో ఈస్ట్ జోన్ భారీగా 467 పరుగులు చేయడంతో ఈ ఘన విజయం సాధ్యమైంది. ఆ తర్వాత వారు తమ ప్రత్యర్థులను రెండు ఇన్నింగ్స్‌లలో 111 మరియు 146 పరుగులకే ఆలౌట్ చేశారు. షాబాజ్ అహ్మద్ అద్భుతమైన 167 పరుగులతో విజయాన్ని నిలబెట్టగా, రెండో ఇన్నింగ్స్‌లో అనుకుల్ రాయ్ ఐదు వికెట్లు పడగొట్టి మ్యాచ్‌ను ఖరారు చేశాడు. ఈస్ట్ జోన్ తొలుత తడబడి, ఐదు వికెట్ల నష్టానికి 138 పరుగులకే పరిమితమై, ఆ తర్వాత పుంజుకుంది. వారు చివరికి 112.5 ఓవర్లలో 467 పరుగులు సాధించారు. షాబాజ్ 244 బంతుల్లో 17 ఫోర్లు, నాలుగు సిక్సర్లతో 167 పరుగులు చేసి, జట్టును పునరుద్ధరించాడు. సుదీప్ కుమార్ ఘరామి క్రీజులో అద్భుతమైన సహకారం అందించాడు. అతను 185 బంతుల్లో 25 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 146 పరుగులు చేశాడు. ఈ జోడీ ఇన్నింగ్స్‌ను పునర్నిర్మించడానికి విలువైన భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. బౌలింగ్ దాడిని ఎదుర్కోవడంలో తడబడిన నార్త్ ఈస్ట్ జోన్, తమ తొలి ఇన్నింగ్స్‌లో 42.5 ఓవర్లలో 111 పరుగులకే ఆలౌట్ అయింది.

# భారీ ఆధిక్యం దిశగా భారత్

## 236 రన్స్‌తో వెనుకబడిన శ్రీలంక





**కొలంబో:** శ్రీలంకతో రెండో టెస్ట్‌లో టీమిండియా పట్టు బిగించి భారీ ఆధిక్యంతో విజయానికి చేరువలో ఉంది. బ్యాటింగ్ తరహాలోనే బౌలింగ్‌లోనూ సత్తా చాటింది. దాంతో మంగళవారం మూడో రోజు ఆట ముగిసే సమయానికి శ్రీలంక 83.4 ఓవర్లలో 8 వికెట్లకు 265 పరుగులు చేసి, టీమిండియా కంటే 236 పరుగులు వెనకబడి ఉంది. క్రీజులో లాహిరు కుమార(8 బ్యాటింగ్)తో పాటు సోనాల్ దినుషా(85 బ్యాటింగ్) ఉన్నాడు. ఇక 8/2 ఓవర్‌నైట్ స్కోర్‌తో మూడో రోజు ఆటను కొనసాగించిన శ్రీలంకకు ఆదిలోనే గట్టి షాక్ తగిలింది. కామిల్ మిషారా(19)ను ప్రసిధ్ కృష్ణ ఔట్ చేయగా, కామిందు మెండిస్‌తో కలిసి పసిందు సూర్య బండార ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. ఈ క్రమంలో అతను 76 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. 87 పరుగుల భాగస్వామ్యంతో క్రీజులో పాతుకు పోయిన ఈ జోడీని ప్రసిధ్ కృష్ణ విడదీసాడు. కామిందు మెండిస్(32)ను క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. దాంతో శ్రీలంక 130/4 స్కోర్‌తో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. ఈ సమయంలో వర్షం అంతరాయం కలిగించడంతో రెండో సెషన్ ఆలస్యంగా ప్రారంభమైంది. సెకండ్ సెషన్ ఆరంభంలోనే ధనంజయ డిసిల్వా(8)ను మానవ్ సుతార్ పెవిలియన్ చేర్చాడు. దాంతో శ్రీలంక 137 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ పరిస్థితుల్లో సోనాల్ దినుషాతో కలిసి పసిందు జట్టును ఆదుకునే ప్రయత్నం చేశారు. సెంచరీ దిశగా సాగిన పసిందును జడేజా క్లీన్ బౌల్డ్ చేశాడు. ఆ వెంటనే నిరోషన్ డిక్‌వెల్లా(0)ను సిరాజ్ డకౌట్‌గా పెవిలియన్ చేర్చాడు. కేశర నువాంతతో కలిసి సోనాల్ దినుషా పోరాడాడు. తొలి టెస్ట్ ఫామ్‌ను కొనసాగిస్తూ 82 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. దాంతో శ్రీలంక 216/7 స్కోర్ తో టీ బ్రేక్‌కు వెళ్లింది. ఆఖరి సెషన్‌లోనూ ఈ జోడీ ఆచితూచి ఆడింది. 57 పరుగుల భాగస్వామ్యంతో ప్రమాదకరంగా మారిన ఈ జోడీని మానవ్ సుతార్ విడదీసాడు. లాహిరు కుమారా ఆచితూచి ఆడగా, సొనాల్ దినుషా తనదైన శైలిలో బ్యాటింగ్ చేశాడు. మరోవికెట్ పడకుండా ఈ ఇద్దరూ జాగ్రత్త పడటంతో శ్రీలంక 265/8 స్కోర్ వద్ద మూడో రోజు ఆటను ముగించింది. భారత బౌలర్లలో ప్రసిధ్ కృష్ణ(3/47), మానవ్ సుతార్(3/83) మూడేసి, మహమ్మద్ సిరాజ్, రవీంద్ర జడేజా తలో వికెట్ పడగొట్టారు. కాగా తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 503/9 స్కోర్ వద్ద డిక్లేర్డ్ చేసిన సంగతి తెలిసిందే.



## డబ్ల్యూటీఏ టోర్నీ కోకో గాఫ్‌కు టైటిల్


**సిన్సినాటి:** యూఎస్ ఓపెన్ సమీపిస్తున్న తరుణంలో, సిన్సినాటిలో జరుగుతున్న డబ్ల్యూటీఏ 1000 టోర్నమెంట్‌లో జెస్సికా పెగులాపై 6-2, 6-4 తేడాతో కోకో గాఫ్ ఆధిపత్యం చెలాయించి, 2026లో తన తొలి టైటిల్‌ను కైవసం చేసుకుంది. ప్రపంచ నంబర్ ఫోర్ గాఫ్, ఈ ఏడాది మయామి, రోమ్‌లలో జరిగిన ఫైనల్స్‌లో ఓటమిపాలైన తర్వాత, గత అక్టోబర్‌లో వుహాన్‌లో తన మొదటి డబ్ల్యూటీఏ టైటిల్‌ను కైవసం చేసుకుంది. మూడవ ర్యాంక్ క్రీడాకారిణి పెగులాపై 75 నిమిషాల్లో విజయంతో టోర్నమెంట్‌ను ముగించిన గాఫ్ రెండవ సిన్సినాటి కిరీటాన్ని అందించింది. గాఫ్, పెగులా సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేసి 4-0 ఆధిక్యం సాధించింది. పెగులా తన సర్వీస్‌ను నిలబెట్టుకుని, ఒక బ్రేక్‌ను తిరిగి సాధించి స్కోరుబోర్డుపైకి రాకముందే గాఫ్ 5-0తో ఆధిక్యంలో ఉంది. 34 నిమిషాల తర్వాత గాఫ్ మళ్లీ బ్రేక్ చేసి తొలి సెట్‌ను కైవసం చేసుకోవడంతో అది ఒక స్వల్ప ఉపశమనంగా నిలిచింది. రెండవ సెట్ కూడా అదే విధంగా సాగింది, గాఫ్ 3-0 ఆధిక్యం సాధించే క్రమంలో బ్రేక్ చేయగా, పెగులా ఆమెను అందుకోవడానికి ప్రయత్నించింది. అయితే గాఫ్ తన మొదటి మ్యాచ్ పాయింట్‌తో విజయాన్ని ఖాయం చేసుకుంది. గాఫ్ విజయంతో ఇద్దరి మధ్య కెరీర్ సిరీస్ చెరో ఐదు విజయాలతో సమమైంది. వింబుల్డన్ క్వార్టర్‌ఫైనల్‌లో తన స్వదేశీయురాలిని ఓడించిన తర్వాత, ఈ సీజన్‌లో పెగులాపై గాఫ్ తన రెండవ మ్యాచ్‌ను గెలుచుకుంది.



## వరల్డ్ ర్యాంకింగ్స్‌లో.. 12 స్థానాలు ఎగబాకిన ట్రీసా-గాయత్రి

**న్యూఢిల్లీ:** బిడబ్ల్యూఎఫ్ ప్రపంచ ర్యాంకింగ్స్‌లో భారత బ్యాడ్మింటన్ మహిళల డబుల్స్ జోడీ ట్రీసా జాలీ, గాయత్రి గోపీచంద్ 12 స్థానాలు ఎగబాకి ప్రపంచ 27వ ర్యాంకును సాధించారు. ఈ మేరకు మంగళవారం విడుదలైన ర్యాంకింగ్స్‌లో ఈ భారత్ మహిళల డబుల్స్ జోడీ అనూహ్యంగా పాయింట్లతో పై పైకి చేరింది. ఇటీవల జరిగిన బిడబ్ల్యూఎఫ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం సాధించిన కొద్ది రోజులకే ట్రీసా, గాయత్రిల ఎదుగుదల చోటుచేసుకుంది. స్వదేశంలో జరిగిన ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లలో, భారత జంట ప్రపంచ ర్యాంకింగ్‌లో 39వ స్థానంలో ఉండి, అన్‌సీడెడ్‌గా బరిలోకి దిగింది. ఈ టోర్నమెంట్‌లో వారు రెండు పెద్ద సంచలనాలు సృష్టించారు. వరుస రౌండ్లలో జపాన్‌కు చెందిన ఏడవ సీడ్ రిన్ ఇవానగాకీ నకానిషిని, నాలుగవ సీడ్ జియా యి ఫాన్‌జాంగ్ షు జియాన్‌ను ఓడించి సెమీఫైనల్స్‌కు చేరుకున్నారు. సెమీఫైనల్స్‌లో చైనాకు చెందిన ప్రపంచ నంబర్1 జోడీ లియు షెంగ్ షు మరియు టాన్ నింగ్‌లతో తలపడిన ట్రీసాగాయత్రి, 18-21, 21-13, 8-21 తేడాతో ఓడిపోయి కాంస్య పతకంతో సరిపెట్టుకున్నారు. కాంస్య పతకం సాధించడం ద్వారా వారికి మొత్తం 10,500 ర్యాంకింగ్ పాయింట్లు లభించి, తాజా ర్యాంకింగ్స్‌లో వారు ప్రపంచ 27వ స్థానానికి చేరుకున్నారు. ఒకప్పుడు ప్రపంచ 9వ ర్యాంకు వరకు చేరుకున్న భారత జంట, గాయాల సమస్యలు మరియు నిలకడలేని ఫామ్ కారణంగా ఇటీవలి కాలంలో ర్యాంకింగ్‌లో గణనీయంగా వెనుకబడ్డారు. వారు ఈ ఏడాది మార్చిలో ప్రపంచ ర్యాంకింగ్‌లో 30వ స్థానం కంటే దిగువకు పడిపోయి, జూన్‌లో 58వ స్థానానికి కూడా దిగజారారు. మళ్లీ ఇప్పుడు పైకి ఎదిగారు.

## ఈ యేడాది దీపమ్ ఓఎఫ్ఎస్ లక్ష్యం రూ.80వేల కోట్లు!




**న్యూఢిల్లీ, ఆగస్టు 25:** ప్రభుత్వ డిజిన్వెస్ట్‌మెంట్ కార్యక్రమం కొనసాగింపు ఆర్థిక సంవత్సరం మిగిలిన కాలంలోనూ ప్రభుత్వ డిజిన్వెస్ట్‌మెంట్ కార్యక్రమం చురుగ్గా కొనసాగనున్నట్లు కేంద్రం సంకేతాలు ఇచ్చింది. ఈ ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన రూ.80వేల కోట్ల డిజిన్వెస్ట్‌మెంట్ లక్ష్యాన్ని సాధిస్తామని పెట్టుబడులు, ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ విభాగం ప్రకటించింది. ఇప్పటికే ప్రభుత్వం ఎల్ఐసీ ఆఫర్ ఫర్ సేల్, తాజా హిందుస్థాన్ కాపర్ వాటాల విక్రయం తదితర లావాదేవీల ద్వారా సుమారు రూ.52 వేల కోట్లను సమీకరించింది. లక్ష్యాలను చేరుకోవడంతో పాటు ఫలితాలపై కూడా ప్రభుత్వం దృష్టి సారిస్తోందని తెలుస్తోంది. తదుపరి ఏ ప్రభుత్వ రంగ సంస్థ వాటాలను మార్కెట్‌లో విక్రయించనున్నారనే విషయాన్ని వెల్లడించేందుకు దీపమ్ కార్యదర్శి నిరాకరించారు. మరిన్ని మార్కెట్ ఆఫర్లు కొనసాగుతాయని సూచించారు. పెద్ద మొత్తంలో ఓఎఫ్ఎస్‌లావాదేవీలకు సంబంధించి ప్రభుత్వం సిద్ధం చేస్తున్న ప్రణాళికపై ప్రశ్నించగా, మార్కెట్ ఆఫర్లతో ప్రభుత్వం ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు. దీంతో తాజా హిందుస్థాన్ కాపర్ ఒక్కటే కాకుండా, రాబోయే రోజుల్లో మరిన్ని ప్రభుత్వ సంస్థల వాటాల విక్రయాలు ఉండే అవకాశం కనిపిస్తోంది. మార్కెట్ పరిస్థితులను అంచనా వేసేందుకు దీపమ్‌లో ప్రత్యేక మార్కెట్ రీసెర్చ్ యూనిట్‌తో పాటు కురుక్షేత్ర పేరుతో అంతర్గత ఆపరేషన్స్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు కార్యదర్శి తెలిపారు. వాటాల విక్రయాలను ప్రారంభించే ముందు మార్కెట్ పరిస్థితులను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటుందని చెప్పారు.

వాణిజ్యం



## నివాస గృహాల మార్కెట్‌లో మందగమనం!

**న్యూఢిల్లీ, ఆగస్టు 25:** దేశంలో నివాస గృహాల మార్కెట్ ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో వృద్ధి బాటలో కొనసాగింది. అయితే గత త్రైమాసికంతో పోలిస్తే వార్షిక ప్రాతిపదికన ఇళ్ల ధరల పెరుగుదల వేగం కొంత మందగించినట్లు భారతీయ రిజర్వ్ బ్యాంక్ వెల్లడించింది. ఆర్‌బీఐ ఆల్ ఇండియా హౌస్ ప్రైస్ ఇండెక్స్ ప్రకారం, ఈఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో గృహ ధరల సూచీ వార్షికంగా 3.6 శాతం పెరిగింది. అంతకుముందు త్రైమాసికంలో నమోదైన 4.5 శాతం వృద్ధితో పోలిస్తే ఇది తక్కువ. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో నమోదైన వృద్ధి రేటు కూడా 3.6 శాతమే కావడం గమనార్హం. జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో ఆల్ ఇండియా ఇండెక్స్ 117.5కి చేరింది. గత త్రైమాసికంలోని 116.2తో పోలిస్తే ఇది 1.1 శాతం పెరుగుదల. గత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో సూచీ 113.4గా ఉంది. వార్షిక ప్రాతిపదికన గృహ ధరల పెరుగుదలకు ప్రధానంగా చండీగఢ్, జైపూర్, కాన్పూర్, లక్నో, తిరువనంతపురం నగరాల్లో నమోదైన ధరల పెరుగుదల దోహదపడింది. త్రైమాసిక ప్రాతిపదికన సూచీ 1.1 శాతం పెరగడానికి ముఖ్యంగా చండీగఢ్, లక్నో, తిరువనంతపురం నగరాల్లో అధిక ధరలు కారణమయ్యాయి. 2022-23ను బేస్ ఇయర్‌గా తీసుకుని దేశంలోని 18 ప్రధాన నగరాల్లో నివాస గృహాల ధరల మార్పులను ఈ సూచీ ప్రతిబింబిస్తుంది. ఈ సూచీలో ముంబై, ఢిల్లీ, చెన్నై, కోల్‌కతా, బెంగళూరు, లక్నో, అహ్మదాబాద్, జైపూర్, కాన్పూర్, కొచ్చి, హైదరాబాద్, తిరువనంతపురం, పుణె, ఘజియాబాద్, థానే, గౌతమ్ బుద్ధ నగర్, చండీగఢ్, నాగ్‌పూర్ నగరాలు ఉన్నాయి.

## బ్రెంట్ క్రూడ్ ధరలు 3 శాతం పతనం



**న్యూఢిల్లీ, ఆగస్టు 25:** మధ్యప్రాచ్యంలో మరోసారి పూర్తిస్థాయి ఉద్రిక్తతలు చెలరేగుతాయన్న సంకేతాలతో మంగళవారం అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ ఫ్యూచర్స్ ధరలు దాదాపు 3 శాతం పడిపోయాయి. బ్యారెల్‌కు సుమారు 87 డాలర్లకు చేరాయి. బ్రెంట్ ఫ్యూచర్స్ 2.92 శాతం క్షీణించి 87.90 డాలర్ల వద్ద ట్రేడయ్యాయి. అమెరికా పలు మధ్యప్రాచ్య దేశాల్లోని రాయబార కార్యాలయాల నుంచి తరలించిన దౌత్య సిబ్బందిని తిరిగి విధుల్లోకి పంపించే అవకాశం ఉందన్న వార్తల క్రమంలో మార్కెట్లలో ధరలు తగ్గాయి. అమెరికా విదేశాంగ సిబ్బంది ఈ వారంలోనే తమ పోస్టులకు తిరిగి వెళ్లే అవకాశం ఉందని పేర్కొంది. ఇరాన్‌తో మరోసారి పూర్తిస్థాయి సైనిక ఘర్షణలు చెలరేగే అవకాశాన్ని ట్రంప్ ప్రభుత్వం ప్రస్తుతం అంచనా వేయడం లేదనే సంకేతంగా ఈ నిర్ణయాన్ని మార్కెట్లు భావిస్తున్నాయి. ఇజ్రాయెల్, లెబనాన్, సౌదీ అరేబియా, ఖతార్, జోర్డాన్, ఒమన్, ఇరాక్, కువైట్‌లలోని అమెరికా దౌత్య కార్యాలయాల్లో సిబ్బందిని తిరిగి నియమించే ప్రక్రియ చేపట్టనున్నట్లు సమాచారం. వీటిలో బీరుట్‌లోని అమెరికా రాయబార కార్యాలయంలో తొలుత సిబ్బంది తిరిగి విధుల్లో చేరే అవకాశం ఉంది.

## హెచ్చుతగ్గులున్నా చివరికి లాభాలే!

**ముంబయి, ఆగస్టు 25:** దేశీయ ఈక్విటీ మార్కెట్లు మంగళవారం తీవ్ర ఒడిదుడుకుల మధ్య చివరకు లాభాలతో ముగిశాయి. ప్రారంభంలో నష్టాల్లో ట్రేడైన సూచీలు, చివరి గంటల్లో కొనుగోళ్లు పెరగడంతో కోలుకున్నాయి. భారీగా పడిపోయిన షేర్లలో ఇన్వెస్టర్లు కొనుగోళ్లు జరపడం, అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు తగ్గడం మార్కెట్‌కు ఊరటనిచ్చాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 286.98 పాయింట్లు లాభపడి 77,656.09 వద్ద ముగిసింది. నిఫ్టీ50 115.50 పాయింట్లు పెరిగి 24,334.55 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్ సమయంలో నిఫ్టీ 24,115.45 కనిష్ఠ స్థాయికి పడిపోయినా, తిరిగి పుంజుకుని 24,300 మార్క్‌ను తిరిగి అధిగమించింది. హెల్త్‌కేర్, పీఎస్‌యూ బ్యాంకులు, ఐటీ రంగాల షేర్లు మంచి ర్యాలీ తీసాయి. ప్రైవేట్ బ్యాంకులు, మెటల్ రంగ షేర్లు ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. ఇన్ఫోసిస్ - 1.24 లాభం రిలయన్స్ ఇండస్ట్రీస్ - 0.55 పెరుగుదఐసీఐసీఐ బ్యాంక్ - 0.54 లాభం



నెలవారీ డెరివేటివ్స్ ఎక్స్‌పైరీకి ముందు ట్రేడర్లు తమ పొజిషన్లను సర్దుబాటు చేసుకోవడంతో మార్కెట్లో అధిక అస్థిరత కనిపించింది. కొత్త క్లోజింగ్ ఆక్షన్ సెషన్ విధానంలో నిర్వహించిన తొలి నెలవారీ నిఫ్టీ ఎక్స్‌పైరీ కావడంతో, చివరి గంట ట్రేడింగ్ మరింత హెచ్చుతగ్గులకు లోనైంది. బీఎస్ఈ 150 మిడ్‌క్యాప్ సూచీ 0.37 పెరిగింది. బీఎస్ఈ 250 స్మాల్‌క్యాప్ సూచీ 0.17 తగ్గింది. బీఎస్ఈలో మొత్తం 2,007 షేర్లు లాభపడగా, 2,330 షేర్లు నష్టపోయాయి. 196 షేర్లు మార్పులేకుండా ముగిశాయి. కమోడిటీలు, రూపాయిఅక్టోబర్ 2026 డెలివరీ బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 2.73 డాలర్లు (2.96 ) తగ్గి 89.44 డాలర్లకు చేరింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి స్వల్పంగా బలపడింది. రూపాయి విలువ 95.4350 వద్ద ట్రేడవగా, గత ముగింపు 95.7000. భారత 10 ఏళ్ల ప్రభుత్వ బాండ్ రాబడులు 6.872 నుంచి 6.854 కు తగ్గింది. ఎంసీఎక్స్‌లో అక్టోబర్ 5 గోల్డ్ ఫ్యూచర్స్ 0.18 తగ్గి రూ.1,62,936 వద్ద ముగిశాయి. శంకేష్ జువెలర్స్ షేరు బీఎస్ఈలో రూ.95.03 వద్ద లిస్ట్ అయి, ఇష్యూ ధర రూ.93పై 2.18 ప్రీమియం నమోదు చేసింది. సన్‌షైన్ పిక్చర్స్ షేరు రూ.368.90 వద్ద లిస్ట్ అయి, రూ.360 ఇష్యూ ధరపై 2.47 ప్రీమియంతో ముగిసింది. నీలి ఫైనాన్స్, 4.74 ఎంటెరో హెల్త్‌కేర్ సొల్యూషన్స్ 6.39 నెట్‌వెబ్ టెక్నాలజీస్ ఇండియా 2.92, లార్సెన్ అండ్ టూబ్రో 0.71, సిగ్మా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ 5 (అప్పర్ సర్క్యూట్)పురవంక 1.73 అఫ్కాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ 2.42 గ్రేట్ ఈస్టర్న్ షిప్పింగ్ 0.68చొప్పున పెరిగాయి. ఐపీఓలకు పెట్టుబడిదారుల నుంచి మంచి స్పందన లభించింది. "అన్నూ ప్రాజెక్ట్స్ 0.34 రెట్లు, ఆగ్‌మాంట్ ఎంటర్‌ప్రైజెస్ 105.7 రెట్లు, స్కైవేస్ ఎయిర్ సర్వీసెస్ 2.46 రెట్లు, సింబయోటెక్ ఫార్మాల్యాబ్ 1.85 రెట్లు, హైటెక్ ఇంజినీర్స్ 19.31 రెట్లుమొత్తంగా, అంతర్జాతీయ ఉద్రిక్తతలు కొనసాగుతున్నప్పటికీ ముడి చమురు ధరలు తగ్గడం, దిగువ స్థాయిల్లో కొనుగోళ్లు పెరగడం వల్ల దేశీయ మార్కెట్లు మంగళవారం సానుకూలంగా మార్కెట్లు ముగిసాయి.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.